తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.TELTEL / 2013 /50370

గురువారం 01.01.2026 | సంపుటి :12 సంచిక : 163 | పేజీలు :12 వెల : రూ. 4/-

హైదరాబాద్ — Simultaneously Published from Hyderabad & Karimnagar — ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్










తెలంగాణ రైజింగ్ విజన్ 2047 లక్ష్య సాధన దిశగా..

## కొత్త ఏడాదిలో మరింత ఉత్సాహంతో ముందుకు సాగుతాం

రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలందరికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రైజింగ్ విజన్ 2047 లక్ష్య సాధన దిశగా ఈ ఏడాదిలో రాష్ట్ర ప్రభుత్వం మరింత ముందుకు సాగుతుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులతో పాటు మహిళలు, మిగతా 2లో..

### నూతన సంవత్సరానికి ఘన స్వాగతం

సంబరాల్లో మునిగిన ప్రపంచ దేశాలు



ఇటీవల మోకాలి శస్త్ర చికిత్స అనంతరం ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న మాజీ మంత్రి కుందూరు జానారెడ్డిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరామర్శించారు. బుధవారం ఆయన నివాసానికి వెళ్లి ఆయన బాగోగులు తెలుసుకున్నారు




## క్లీన్‌సిటీగా హైదరాబాద్

పరిశుభ్రం, పచ్చదనంపై జీహెచ్‌ఎంసీ ప్రత్యేక శ్రద్ధ

- పరిశుభ్రతలో హైదరాబాద్‌ను అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యం
- రూ.3వేల కోట్ల ఆస్తి పన్ను వసూలే లక్ష్యం: జీహెచ్‌ఎంసీ కమిషనర్

**హైదరాబాద్(జనంసాక్షి):** పరిశుభ్రతలో హైదరాబాద్ మహానగరాన్ని అగ్ర స్థానంలో నిలపడమే లక్ష్యంగా 2026లో పనిచేయనున్నట్లు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు. 2025 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జాతీయ స్థాయిలో జీహెచ్ఎంసీ ఆరో ర్యాంకు సాధించిందన్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ 650 చదరపు కిలోమీటర్ల నుంచి దాదాపు 2 వేల కిలోమీటర్ల వరకు పరిధి విస్తరించిన క్రమంలో 300 వార్డుల నుంచి రోజుకు 9 వేల మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోందన్నారు. చెత్త నిర్వహణకు కొత్త డంపింగ్ యార్డుల కోసం భూసేకరణ చేస్తున్నట్లు తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు పారిశుద్ధ్యంపై 300 వార్డుల్లో నిరంతరం ప్రత్యేక



డ్రైవ్ కొనసాగిస్తామని వివరించారు. గ్రేటర్‌లో పారిశుద్ధ్యం సహా వివిధ అభివృద్ధి పనులు, పరిపాలన అంశాలపై సమగ్ర వివరాలు వెల్లడించిన ఆర్వీ కర్ణన్.... వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.3వేల కోట్ల ఆస్తి పన్ను వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. జీఐఎస్ సర్వే ద్వారా 14 లక్షల ప్రాపర్టీలను సర్వే చేసినట్లు పేర్కొన్నారు. అందులో లక్ష మంది.. కట్టాల్సిన ఆస్తి పన్ను కంటే తక్కువగా చెల్లిస్తున్నట్టు గుర్తించామన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండానే నగర పౌరులు తమ ఆస్తి పన్ను నేరుగా జీహెచ్‌ఎంసీ వెబ్ సైట్, యాప్ ద్వారా చెల్లించవచ్చని సూచించారు. నగరంలో రవాణా సదుపాయం మరింత మెరుగుపర్చేందుకు పెండింగ్ లో ఉన్న ఫ్లైఓవర్లను ఏప్రిల్ నాటికి పూర్తి చేస్తామని, హెచ్ సీటీ ప్రాజెక్టు కింద చేపట్టిన 32 ప్రాజెక్టులకు త్వరలోనే ప్రారంభిస్తామని ఆర్వీ కర్ణన్ ప్రకటించారు.

## 'ఆయుష్'ను హత్యచేసిన సీఎం నితీశ

హిజాబ్ లాగినందుకు విధుల్లో చేరకుండా వైద్యురాలి నిరసన

డిసెంబర్ 31తో గడువు విధించినా హాజరుకాని డా॥నుస్రత్ పర్వీన్

సీఎం చర్యతో వేరేప్రాంతానికి వెళ్లిపోయిన బాధితురాలి కుటుంబం!



బీహార్‌లో ఉద్యోగ నియామక పత్రాల స్వీకరణ కార్యక్రమంలో వైద్యురాలు నుస్రత్ పర్వీన్ హిజాబ్ తొలగించడానికి ప్రయత్నిస్తున్న సీఎం నీతీశ్ కుమార్

**పాట్నా(జనంసాక్షి) :** బీహార్ లో జరిగిన ఉద్యోగ నియామక పత్రాల స్వీకరణ కార్యక్రమంలో సీఎం నీతీశ్ ఓ వైద్యురాలి హిజాబ్ తొలగించడంపై పెద్దఎత్తున వివాదం నెలకొన్న విషయం విదితమే. ఆ ఘటనతో ఇబ్బందిపడిన సదరు వైద్యురాలు నుస్రత్ పర్వీన్ ఇంకా విధుల్లో చేరలేదని స్థానిక అధికారులు వెల్లడించారు. నియామక పత్రాలు అందుకున్న వైద్యులు పోస్టింగ్‌లో చేరడానికి ఇచ్చిన గడువు బుధవారంతో ముగిసినా సబల్‌పూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో విధుల్లో చేరాల్సిన ఆమె నుంచి ఎటువంటి సమాచారం లేదని, రిపోర్టు చేయకపోతే ఆమె అపాయింట్‌మెంట్ రద్దు చేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. కాగా హిజాబ్ వివాదం తర్వాత పర్వీన్ కుటుంబం పట్నా నుంచి కోల్‌కతాకు మారినట్లు తెలిసింది. అయితే సీఎం నితీశ్ హిజాబ్ లాగిన సందర్భంలో నిశ్చేష్టురాలిగా ఉండిపోయిన డాక్టర్ నుస్రత్ పర్వీన్.. ఆయన చర్యతో తీవ్రంగా ఇబ్బంది పడినట్టు తెలిసింది. ఈ ఘటన తర్వాత, ఆమె బయటకు వెళ్లకుండా, మీడియాతో మాట్లాడకుండా ఆమె భర్త ఆజ్ఞాపించినట్లు తెలుస్తోంది. పర్వీన్ విధులకు హాజరు కాలేదని సబల్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సర్జన్‌గా పనిచేస్తున్న విజయ్ కుమార్ సైతం తెలిపారు. వైద్యులు తమకు కేటాయించిన కేంద్రాలలో బాధ్యతలు స్వీకరించడానికి ముందు సివిల్ సర్జన్ కార్యాలయంలో నివేదించాలని ఆయన పేర్కొన్నారు.

### అసలేం జరిగిందంటే..

డిసెంబర్ 15న పాట్నాలోని సీఎం నివాసంలో కొత్తగా ఎంపికైన ఆయుష్ వైద్యులకు నియామక పత్రాలను అందజేసే కార్యక్రమం చేపట్టగా.. ఉద్యోగానికి ఎంపికైన ముస్లిం మహిళ హిజాబ్ ధరించి హాజరయ్యారు. ఆమెకు నియామక పత్రాన్ని అందజేసిన తర్వాత ముఖ్యమంత్రి ఆ మహిళ ధరించిన హిజాబ్ గురించి అడిగి, దానిని తీసివేయమని సూచించారు. ఆ వెంటనే ఆయనే స్వయంగా దానిని తొలగించారు. దీంతో అక్కడున్న కొందరు నవ్వడంతో ఆమె కలత చెందారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కాగా ముఖ్యమంత్రి తీరుపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు గుప్పించాయి. తదనంతరం సీఎం చర్యకు నిరసనగానే వైద్యురాలు ఉద్యోగంలోకి రాలేదని సర్వత్రా అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## కాంగ్రెస్ వైఖరితో నేత కార్మికులకు అన్యాయం

కేటీఆర్



**సిరిసిల్ల(జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలతో నేత కార్మికులకు అన్యాయం జరుగుతోందని మాజీ మంత్రి, భారత రాష్ట్రసమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. సిరిసిల్ల అపారెల్ పార్క్‌ను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మిగతా 2లో..

## ఉద్యోగులకు తీపి కబురు

పెండింగ్ బిల్లుల్లో రూ.713 కోట్లు విడుదల

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలోని ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లుల్లో డిసెంబరుకు సంబంధించి రూ.713 కోట్లు బుధవారం విడుదలయ్యాయి. ఉద్యోగ సంఘాలకు ప్రతి నెల రూ.700 కోట్ల చొప్పున మిగతా 2లో..

## పుతిన్ నివాసంపై దాడి..

ఉక్రెయిన్ పనేనని రష్యా ఆరోపణ

2లో..

కొత్త లేబర్ కోడ్‌లు..

## డ్రాఫ్ట్ రూల్స్ నోటిపై చేసిన కేంద్రం

ఏప్రిల్ 1 నుంచి వీటిని దేశవ్యాప్తంగా అమల్లోకి

## గోదావరి జలాల్లో తెలంగాణ వాటాకు కట్టుబడి ఉన్నాం

968 టీఎంసీల పరిరక్షణకు చిత్తశుద్ధితో పని చేస్తున్నాం

- బనకచర్ల, నల్లమలసాగర్ ప్రాజెక్టులు నిబంధనలకు విరుద్ధమని చెప్పాం
- ఇప్పటికే గోదావరి, కృష్ణా బోర్డులు, పోలవరంకు అభ్యంతరం తెలిపాయి
- ఎలాంటి అనుమతులు ఇవ్వొద్దని కేంద్రానికి లేఖలు రాశాం: మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్(జనంసాక్షి):** పోలవరం నుంచి గోదావరి జలాల మళ్లింపునకు ఏపీ సర్కారు ప్రయత్నాల దృష్ట్యా రాష్ట్ర హక్కుల కోసం పోరాడుతున్నామని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వపరంగా, చట్టపరంగా అన్ని రకాలుగా చర్యలు చేపట్టామని చెప్పారు. "బనకచర్ల, నల్లమలసాగర్ ప్రాజెక్టులు నిబంధనలకు విరుద్ధమని చెప్పాం. ట్రైబ్యునల్ తీర్పులు, చట్టాలు, జలసంఘం మార్గదర్శకాలకు విరుద్ధం. ఎలాంటి అనుమతులు ఇవ్వొద్దని కేంద్రానికి లేఖలు రాశాం. రాష్ట్ర చర్యలతో పర్యావరణ శాఖ ఏపీ ప్రతిపాదనను వెనక్కి పంపింది. కేంద్ర జలశక్తిశాఖ, కేంద్ర జల సంఘం అభ్యంతరాలు తెలిపాయి. గోదావరి, కృష్ణా బోర్డులు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ అభ్యంతరం తెలిపాయి. జులై భేటీలో పోలవరం, బనకచర్ల అజెండాగా చేర్చడాన్ని తిరస్కరించాం. పోలవరం, నల్లమలసాగర్ డీపీఆర్‌కు ఏపీ టెండర్లు పిలవగానే సుప్రీంలో పిటిషన్ వేశాం. పోలవరం విస్తరణ పనులను నిలిపివేసేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో కోరాం. గోదావరి జలాల్లో 968 టీఎంసీల పరిరక్షణకు చిత్తశుద్ధితో పని చేస్తున్నాం. కేటాయించని వరదజలాలపై 2 రాష్ట్రాలను సంప్రదించాల్సిందే" అని తెలిపారు.





## ఇస్రో మరో ముందడుగు

ఎస్ఎస్ఎల్వీ మూడో స్టేజ్ పరీక్ష విజయవంతం

**నెల్లూరు(జనంసాక్షి):** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో ముందడుగు వేసింది. స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ మూడో దశ ను విజయవంతంగా పరీక్షించింది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ లోని సాలిడ్ మోటార్ స్టాటిక్ టెస్ట్ కేంద్రంలో మంగళవారం ఈ ప్రయోగం నిర్వహించింది. మూడు-దశల ఆల్-సాలిడ్ లాంచ్ వెహికల్ ఎస్ఎస్ఎల్వీ పనితీరును విశ్లేషించడంతోపాటు డేటాను సేకరించినట్లు ఇస్రో వెల్లడించింది. అంతరిక్షంలోకి చిన్న ఉపగ్రహాలను వేగంగా ప్రయోగించడం కోసం దీనిని రూపొందించారు. అధిక స్థాయిలో ఉత్పత్తికి కూడా ఇది అనుకూలంగా ఉంటుంది. పేలోడ్‌కు మిగతా 2లో..

## ప్రళయ్ టెస్ట్ విజయవంతం

అత్యాధునిక టెక్నాలజీతో 2 క్షిపణులను రూపొందించిన డీఆర్‌డీఓ



9లో..

## ఇండియా-పాక్ యుద్ధం ఆపింది మేమే

ఇరు దేశాల మధ్య వర్తిత్వం వహించాం

చైనా సంచలన ప్రకటన



**బీజింగ్(జనంసాక్షి):** ఆపరేషన్ సిందూర్‌తో భారత్‌కు వచ్చిన గుర్తింపును జీర్ణించుకోలేకో ఏమో తెలియదు గానీ ట్రంప్ తరచుగా భారత్-పాక్ యుద్ధాన్ని తానే ఆపానని వ్యాఖ్యానిస్తూ వచ్చారు. ఈ విషయంపై భారత్ ఎన్నిసార్లు వివరణ ఇచ్చినా ట్రంప్ మామ తన తీరు మార్చుకోవడం లేదు. నిన్న ఇజ్రాయెల్ ప్రధానితో జరిగిన భేటీలో కూడా ఈ వ్యాఖ్యలే చేశారు. ఇది చాలదన్నట్లు తాజా ఆజాబితాలో చైనా దేశం కూడా చేరింది. మిగతా 2లో..

### చైనా వ్యాఖ్యలు నిజం కాదు

- డ్రాగన్ ప్రకటనను తోసిపుచ్చిన కేంద్రం
- చైనా ప్రకటన ఆందోళన కలిగిస్తోంది
- కేంద్రం స్పష్టత నివ్వాలి : కాంగ్రెస్

2లో..








హైదరాబాద్ బేగంపేటలోని ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ క్లబ్‌లో నూతన సంవత్సర వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీనియర్ ఐఏఎస్ అధికారులు, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఇండియా-పాక్ యుద్ధం ఆపింది మేమే..

ఆపరేషన్ సిందూర్ విషయంలో భారత్‌కు తంటాలు తప్పడం లేదు. ఇండియన్ ఆర్మీ ముష్కరుల స్థావరాల్ని వారి స్వస్థలంలోనే ధ్వంసం చేసి ప్రపంచానికి తన సత్తా ఏంటో తెలిసేలా చేసింది. తన జోలికస్తే రిప్లై ఏలా ఉంటుందో చిన్న ట్రైలర్ చూపించింది. దీంతో భారత్‌తో పెట్టుకుంటే ఏమవుతుందో అర్థమైన పాక్ దారికొచ్చింది. ఇరు దేశాలు పరస్పర కాల్పులు విరమణ ఒప్పందంపై సంతకం పెట్టాయి. తాజాగా చైనా ఈ అంశంలో వేలు పెట్టింది. భారత్-పాక్ మధ్య మధ్యవర్తిత్వం వహించి తానే ఈ యుద్ధాన్ని ఆపానని డ్రాగన్ కంట్రీ ప్రకటించింది .ఆ దేశ విదేశాంగ మంత్రి వాంఘ్ యీ మాట్లాడుతూ " చైనా చాలా దేశాల మధ్య వివాదాల్ని పరిష్కరించింది. మయన్మార్‌లో సందిగ్ధతలు, ఇరాన్ న్యూక్లియర్ సమస్య, భారత్-పాకిస్థాన్ సమస్య, కంబోడియా-థాయిలాండ్ వివాదం, పాలస్తీనా-ఇజ్రాయిల్ మధ్య గొడవ ఇలా ప్రపంచ దేశాల మధ్య గొడవలన మధ్యవర్తిత్వం వహించి పరిష్కరించాం" అని చైనా విదేశాంగ శాఖ మంత్రి తెలిపారు.అయితే ఈ వ్యాఖ్యలపై భారత్ తీవ్రంగా స్పందించింది. " మేము ఇదివరకే ఇటువంటి వ్యాఖ్యలను ఖండించాం. భారత్-పాకిస్థాన్ అంశంలో మూడవ పార్టీ జోక్యం లేదు. మా ఇరు దేశాల మధ్య కాల్పుల ఒప్పందం



రెండు దేశాల మధ్యలోనే జరిగిందని" భారత్ హెచ్చరించింది. కాగా ఆపరేషన్ సిందూర్ సమయంలో చైనా పాక్‌కు మద్దతుగా నిలిచింది. పాక్‌కు అవసరమైన యుద్ధ సామాగ్రిని, ఫైటర్ జెట్స్ అందించింది. ఆసమయంలో భారత్ చేసిన దాడులలో డ్రాగన్ కంట్రీకి చెందిన కొన్ని వైమానిక స్థావరాలు ధ్వంసమయ్యాయి.

## చైనా వ్యాఖ్యలు నిజం కాదు

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత్-పాకిస్థాన్ మధ్య తలెత్తిన ఉద్రిక్తతలను తామే చల్లార్చామంటూ చైనా చేసిన ప్రకటనపై భారత్ స్పందించింది. అయితే చైనాకు అంత సీన్ లేదని భారత్ అంటోంది.మధ్యవర్తిత్వం విషయంలో భారత్ ఎప్పుడూ ఒకేరకమైన విధానాన్ని అనుసరిస్తుందని స్పష్టం చేస్తూ.. డ్రాగన్ కంట్రీ ప్రకటనను తోసిపుచ్చింది.చైనా ప్రకటనను కేంద్ర వర్గాలు తోసిపుచ్చినట్లు ఓ జాతీయ మీడియా సంస్థ కథనం ఇచ్చింది. ఆ కథనం ప్రకారం.. భారతదేశం మధ్యవర్తిత్వంపై ఎప్పటినుంచో స్పష్టమైన వైఖరిని అవలంభిసతోంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో.. ఆ తర్వాత ఎలాంటి మధ్యవర్తిత్వం జరగలేదు. కేవలం పాకిస్తాన్ భారత్‌ను సంప్రదించి కాల్పుల విరమణ కోరింది. కాబట్టి.. భారత్ ఎప్పటికీ మూడోపక్ష జోక్యాన్ని అనుమతించదు అని పేర్కొన్నాయి.పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలను భారత వైమానిక దళం ఆపరేషన్ సిందూర్ పేరిట సర్జికల్ స్ట్రయిక్సతో సర్వనాశనం చేసింది. ఈ నేపథ్యంతో మే 7-10వ తేదీల మధ్య ఇరు దేశాల మధ్య యుద్ధ పరిస్థితులు నెలకొన్నాయి. అయితే.. రెండు దేశాల సైనిక డీజీఎంవోల సంప్రదింపుల ఫలితంగా సడలిపోయాయని మోదీ సర్కారు ప్రకటించింది. కానీ,తాజాగా బీజింగ్‌లో జరిగిన ఒక అంతర్జాతీయ సదస్సులో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ మాట్లాడుతూ.. ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా జరిగిన పలు వివాదాలను పరిష్కరించడంలో చైనా కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. మయన్మార్, ఇరాన్ అణు సమస్యలతో పాటు భారత్-పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను కూడా చైనా తన మధ్యవర్తిత్వం ద్వారా తగ్గించిందని ఆయన వెల్లడించారు.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాత్రం తన టారిఫ్ బెదిరింపులతోనే ఇరు దేశాలు దిగొచ్చి కాల్పుల విరమణకు అంగీకరించాయని ప్రకటించుకుంటూ వస్తున్నారు. అంతేకాదు.. దీనికి కారకుడంటూ భారతీయ మూలాలున్న తన ప్రత్యేక సహాయకుడు రికీ గిల్‌ను ట్రంప్ ప్రభుత్వం తాజాగా సత్కరించింది కూడా. ఈ పరిణామాల నడుమే.. మే నెల ఉద్రిక్తతల సమయంలో పాక్‌కు ఆయుధాలను సరఫరా చేసిన చైనా ఇప్పుడు మధ్యవర్తిత్వం నడిపి ఉద్రిక్తతలను చల్లార్చామంటూ ప్రకటించుకోవడం కొసమెరుపు.

## చైనా ప్రకటన ఆందోళన కలిగిస్తోంది



న్యూఢిల్లీ(జనంసాక్షి):

భారత్-పాకిస్థాన్ మధ్య తలెత్తిన ఉద్రిక్తతల నివారణకు తామే మధ్యవర్తిత్వం నడిపామని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ చేసిన ప్రకటనను భారత ప్రభుత్వ వర్గాలు ఖండించిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాల వేళ కాంగ్రెస్ స్పందించింది చైనా ప్రకటన ఆందోళన కలిగిస్తోందని, దీనిపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ జనరల్ సెక్రటరీ జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. "భారత్-పాకిస్థాన్ మధ్య ఘర్షణలను తానే ఆపానని చాలాసార్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించుకున్నారు. పలు అంతర్జాతీయ వేదికలపై ఇప్పటివరకు 65 సార్లు ఆ మాట అన్నారు. అయినా ప్రధాని మోదీ మాత్రం మౌనం వీడటం లేదు. ఇక ఇప్పుడు చైనా విదేశాంగ మంత్రి అదే ప్రకటన చేశారు. ఇవన్నీ ఆందోళనకర ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి" అని పేర్కొన్నారు.

# ఇస్రో మరో ముందడుగు

సె కనుకు 4 కి.మీ వేగాన్ని అందించడంలో ఎస్ఎ స్-3 కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు వెల్లడించారు. పేలోడ్ సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుందన్నారు. ప్రస్తుతం చేసిన అప్‌గ్రేడ్‌లు ఈ దశలో మెరుగైన ఇగ్నైటర్, నాజిల్ డిజైన్ ఉపగ్రహాల సామర్థ్యం, నిర్మాణాత్మక దృఢత్వాన్ని పెంచినట్లు తెలిపారు. ఈ పరీక్షలో ఒత్తిడి, థ్రస్ట్, ఉష్ణోగ్రత, వైబ్రేషన్, యాక్యుయేటర్ పనితీరు వంటి విషయాలను పరిశీలించినట్లు తెలిపారు.

## తెలంగాణ రైజింగ్ విజన్ 2047 లక్ష్య సాధన దిశగా..


కార్మికులు సహా అన్ని వర్గాల ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని గుర్తు చేశారు. కొత్త సంవత్సరంలో ప్రతి కుటుంబం తాము ఆశించిన ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని, ప్రజలందరూ ఆనందంతో, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.

## నూతన సంవత్సరానికి ఘన స్వాగతం

### సంబరాల్లో మునిగిన ప్రపంచ దేశాలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):

న్యూజిలాండ్ కొత్త ఏడాదిలోకి ప్రవేశించింది. 2026కు ఘనంగా స్వాగతం పలికింది. ఈ సందర్భంగా ఆక్లాండ్‌లో పెద్దఎత్తున వేడుకలు (ఔవలి జవజీతీ అవశ్రీవఎతీజీబితినీనిబ 2026) నిర్వహించారు. దేశంలోనే ఎత్తయిన నిర్మాణం (240 మీటర్లు) 'స్కై టవర్' వేదికగా బాణసంచా ప్రదర్శన ఆకట్టుకుంది. అంతకుముందు పసిఫిక్ మహాసముద్రంలోని కిరిబాటి అనే ద్వీప దేశాన్ని న్యూ ఇయర్ పలకరించింది. న్యూజిలాండ్ అనంతరం ఆస్ట్రేలియాలో సంబరాలు మొదలయ్యాయి. ప్రఖ్యాత సిడ్నీ హార్బర్ బ్రిడ్జిపై బాణసంచా వెలుగులు మిరుమిట్లు గొలిపాయి. ఇటీవలి ఉగ్రఘటన నేపథ్యంలో పోలీసులు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేశారు. జపాన్, ఉత్తర కొరియా, దక్షిణ కొరియా, తైవాన్, చైనా, మంగోలియా తదితర దేశాల్లో సంబరాలు ప్రారంభం కానున్నాయి.



## ఉద్యోగులకు తీపి కబురు

### పెండింగ్ బిల్లుల్లో రూ.713 కోట్లు విడుదల

విడుదల చేస్తామని గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ నెల నిధులు విడుదల చేయాలని ఆర్థికశాఖ అధికారులను ఆదేశించారు. కొన్నేళ్లుగా ఉద్యోగుల గ్రాట్యుటీ, జీపీఎఫ్, సరెండర్ లీవ్‌లు, అడ్వాన్స్‌లకు సంబంధించిన పెండింగ్ బిల్లులు పేరుకుపోవడంతో దాదాపు రూ.10 వేల కోట్లకు చేరాయి. దీంతో ఉద్యోగ సంఘాలు జూన్‌లో ఆందోళనకు సిద్ధపడటంతో ప్రతి నెలా రూ.700 కోట్ల చొప్పున విడుదల చేస్తామని అదే నెలలో ప్రభుత్వం ప్రకటించింది. మొదటిసారి జూన్ నెలాఖరులో రూ.183 కోట్లు విడుదల చేసింది. ఆ తర్వాత ఆగస్టు నుంచి రూ.700 కోట్ల చొప్పున విడుదల చేస్తూ వస్తోంది.

## జాత్యహంకారం సమాజానికి పట్టిన అంటువ్యాధి

### ఎంజెల్ చక్మ కిరాతక హత్యపై కెటిఆర్ ఆవేదన

హైదరాబాద్,డిసెంబర్31(జనంసాక్షి):

ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో త్రిపురకు చెందిన ఎంబీఏ విద్యార్థి ఎంజెల్ చక్మ కిరాతక హత్యపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన దేశంలో పెరుగుతున్న విద్వేషానికి, జాత్యహంకారానికి పరాకాష్ట అని ఆయన సోషల్ మీడియా వేదికగా ధ్వజమెత్తారు. జాత్యహంకారం అనేది నాగరిక సమాజానికి పట్టిన అంటువ్యాధి అంటూ కేటీఆర్ స్పష్టం చేశారు. త్రిపురకు చెందిన ఎంజెల్ చక్మ మరియు అతని సోదరుడు మైఖేల్ డెహ్రాడూన్‌లో ఉన్న సమయంలో, కొందరు దుండగులు వారి రూపంపై జాత్యహంకార వ్యాఖ్యలు చేస్తూ అవమానించారు. దీనిపై ప్రతిఘటించినందుకు గాను వారిపై కత్తులు, రాడ్లతో కిరాతకంగా దాడి చేశారు. 'మేము భారతీయులమే.. మా జాతీయతను నిరూపించుకోవడానికి ఇంకేం సర్టిఫికేట్లు చూపాలి?' అని ఎంజెల్ ప్రశ్నించడం ఆ అమానుష దాడికి ముందు అతను చేసిన ఆఖరి నిరసన. ఈ దాడి అనంతరం ఎంజెల్ తీవ్ర గాయాలతో దాదాపు 16 రోజుల పాటు మృత్యువుతో పోరాడి చివరకు ఆసుపత్రిలో కన్నుమూశాడు. అయితే ఈ ఘటనపై సోషల్ మీడియా వేదికగా స్పందించిన కేటీఆర్ కేంద్ర ప్రభుత్వానికి గట్టి హెచ్చరికలు జారీ చేశారు. వైవిధ్యంలో ఏకత్వం కలిగిన భారతదేశం ఇలాంటి ఎంపిక చేసిన విద్వేషాలను భరించలేదని, ఇటువంటి విష సంస్కృతి దేశ మనుగడకే ప్రమాదమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జాత్యహంకారం ఏ రూపంలో ఉన్నా దానిపై కఠిన విధానాలు పాటించాలని, బాధితుడికి న్యాయం జరగడం విషయంలో ఎటువంటి రాజీ ఉండకూడదని ఆయన డిమాండ్ చేశారు. కేవలం ఖండనలతో సరిపెట్టకుండా, జాత్యహంకార వ్యాఖ్యలు మరియు హింసకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించేలా ప్రభుత్వం స్పష్టమైన, కఠినమైన చట్టాలను తీసుకురావాలని కేటీఆర్ కోరారు. ఇలాంటి ఘటనలు విడిగా జరిగేవి కావని, సమాజంలో ద్వేషం సాధారణీకరించబడుతుందనడానికిది ఒక హెచ్చరిక అని కేటీఆర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఒక బీఎస్ఎఫ్ జవాను కుమారుడైన ఎంజెల్ చక్మ ఇలా జాత్యహంకారానికి బలికావడంపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. కేటీఆర్‌తో పాటు పలువురు జాతీయ నేతలు ఈ ఘటనను ఖండించారు. ఈ కేసులో ఇప్పటికే ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేయగా, ప్రధాన నిందితుడి కోసం గాలింపు కొనసాగుతోంది.

## ఉక్రెయిన్‌లో బఫర్ జోన్ విస్తరించండి

### పుతిన్ ఆదేశాలు

మాస్కో(జనంసాక్షి):కొన్ని రోజులుగా ఉక్రెయిన్‌పై భారీగా విరుచుకుపడుతున్న రష్యా తాజాగా ఆ దేశంపై మరిన్ని చర్యలకు ఉపక్రమించింది. ఉక్రెయిన్‌కు చెందిన భూభాగాన్ని మరింత ఆక్రమించుకోవడానికి చర్యలు చేపట్టింది. వచ్చే ఏడాదిలో ఉక్రెయిన్‌లో బఫర్ జోన్ పెంచమని తమ దేశాధ్యక్షుడు పుతిన్ ఆదేశించినట్లు రష్యా జనరల్ వాలేరి గెరసిమోవ్ వెల్లడించారు. దీంతో రష్యా దళాలు సుమీ, ఖర్కీవ్ ప్రాంతాల్లోని గ్రామాలను ఆక్రమించుకుంటూ మరింత ముందుకుసాగడానికి ప్రయత్నిస్తున్నాయన్నారు.

## కాంగ్రెస్ వైఖరితో నేత కార్మికులకు అన్యాయం

"అపారెల్ పార్క్‌లో మా హయాంలో వచ్చిన రెండు పరిశ్రమలు మినహా ఇప్పటి వరకు కొత్తగా ఒక్కటీ రాలేదు. 25వేల మంది మహిళలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో పార్క్ ఏర్పాటు చేశాం. సంక్రాంతి లోపు వర్కర్ టూ ఓనర్ పథకం లబ్ధిదారులను ప్రకటించాలి. లేదంటే 10వేల మందితో నిరసన కార్యక్రమం చేస్తాం. మా ప్రభుత్వం ఉన్నప్పుడు కార్మికులను కంటికి రెప్పలా కాపాడుకున్నాం. రూ.400 కోట్లతో అపారెల్ పార్క్ ఏర్పాటు చేసిది మేమే.. ఈ ప్రభుత్వం ఏం చేయలేదు" అని కేటీఆర్ అన్నారు. సిరిసిల్ల పట్టణ ఎస్సీ బాలుర హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి కేటీఆర్ న్యూ ఇయర్ వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. అంతకుముందు జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.





## కొత్త లేబర్ కోడ్‌లు.. డ్రాఫ్ట్ రూల్స్ నోటిఫై చేసిన కేంద్రం..

న్యూఢిల్లీ(జనంసాక్షి):కొత్తగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లకు సబంధించి డ్రాఫ్ట్ రూల్స్‌ను కేంద్రం నోటిఫై చేసింది. వేతనాలు; సామాజిక భద్రత; పారిశ్రామిక సంబంధాలు; వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితులకు సంబంధించిన కోడ్‌ల ముసాయిదా నిబంధనలపై అభిప్రాయ సేకరణ చేపట్టనుంది. 2026 ఏప్రిల్ 1 నుంచి వీటిని దేశవ్యాప్తంగా అమల్లోకి తీసుకొచ్చే ఉద్దేశంతో డ్రాఫ్ట్ రూల్స్‌ను ప్రచురించింది. ఉమ్మడి జాబితాలోకి వచ్చే అంశం కావడంతో ఆయా రాష్ట్రాలు కూడా ఈ నిబంధనలను నోటిఫై చేయాల్సి ఉంటుంది. ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్, 2020కి 30 రోజులు, మిగిలిన మూడు కోడ్‌లకు 45 రోజులు గడువు ఇచ్చింది. గతంలో రాష్ట్రాలు డ్రాఫ్ట్ రూల్స్‌ను ప్రచురించినప్పటికీ.. కొన్ని నెలలు గడిచి పోయిన నేపథ్యంలో ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా మరోసారి ముసాయిదా రూల్స్‌ను ప్రచురించాల్సి ఉంటుంది. కొత్త లేబర్ కోడ్‌లను నోటిఫై చేసేంత వరకు పాత చట్టాలు అమల్లో ఉంటాయి. ఈ కోడ్‌లలో వేజ్, అలవెన్స్, గ్రాట్యుటికీ సంబంధించిన నిబంధనలను పొందుపరిచారు.కొత్త లేబర్ కోడ్‌లలో 'వేజ్' అనే దానికి నిర్వచనం ఇచ్చారు. ఇందులో బేసిక్ పే, డియర్‌నెస్ అలవెన్స్, రిటైనింగ్ అలవెన్సు ఉంటాయి. మిగిలినవి అలవెన్సు రూపంలో ఉంటాయి. ఉద్యోగికి చెల్లించే మొత్తం వేతనంలో అలవెన్సులు 50 శాతం మించకూడదు. అంటే ఇకపై తక్కువ బేసిక్ పే చూపించడానికి వీల్లేదు.పర్ఫార్మెన్స్ బేస్డ్ ఇన్సెంటివ్స్, ఎంప్లాయీ స్టాక్ ఆప్షన్స్ వేరియబుల్ పే, రీయింబర్స్‌మెంట్స్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వంటి 50 శాతం నిబంధన పరిధిలోకి రావు. వీటిని వేజెస్‌గా పరిగణించరు.ఉదాహరణకు ఒక వ్యక్తి వేతనం రూ.70 వేలు అనుకుందాం. ప్రస్తుతం రూ.20 వేలు బేసిక్+ డీఏ, మిగిలిన రూ.50వేలు అలవెన్సుల రూపంలో చెల్లిస్తున్నారనుకుందాం. అలవెన్సులపై 50 శాతం పరిమితి కారణంగా రూ.35వేలు వేతనంగా చెల్లించి.. మిగిలిన రూ.15వేలు వేజెస్‌లో కలపాలి.పనిచేసిన కాలానికి గానూ ఏడాదికి 15 రోజుల చొప్పున చివరి వేతనాన్ని గ్రాట్యుటీ కింద చెల్లించాలి. ఉద్యోగి రాజీనామా, తొలగింపు, రిటైర్మెంట్, ఫిక్స్‌డ్ టర్మ్ కాంట్రాక్ట్ ముగిసినప్పుడు గ్రాట్యుటీని చెల్లించాలి. ఉద్యోగి మరణించినప్పుడు, వైకల్యానికి గురైనప్పుడు, కాంట్రాక్ట్ ముగిసినప్పుడు ఐదేళ్లు పని చేసివుండాలన్న నిబంధన వర్తించదు. 2025 నవంబర్ 21 నుంచి గ్రాట్యుటీ నిబంధనలు అమల్లోకి వచ్చాయి.

తెలంగాణ ప్రభుత్వం
కలెక్టర్ / స్పెషల్ డిప్యూటీ కలెక్టర్
(భూసేకరణ)
**ఫారం -VII**
(చట్టం-2013/30 లోని సెక్షన్ 19(1)ని సబ్ రూల్ (1) రూల్ 25 ప్రకారం)
**రూడీ ప్రకటన**

ఫైల్ నెం.బి/143/2025 తేది: 15.12.2025

తెలంగాణ ప్రభుత్వము / జిల్లా కలెక్టరు నల్లగొండ గారి ఆదేశానుసారం ఈ దిగువ నిర్దిష్టపరచిన **పెద్ద దేవులపల్లి** గ్రామము, **త్రిపురారం** మండలము **నల్గొండ** జిల్లాలో విస్తీర్ణం **ఎ. 0.14 గుంటల** భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా for LLC Package-110 of AMRP కొరకు అవసరము అయియున్నదని భావించబడినది.

కావున ఇట్టి రూడి ప్రకటన **పెద్ద దేవులపల్లి** గ్రామము **త్రిపురారం** మండలము **నల్గొండ** జిల్లాలో విస్తీర్ణం **ఎ.0.14 గుంటలు** గల భూమి పైన తెలిపిన ప్రాజెక్టు నిమిత్తం భూసేకరణ అవసరమైనందున ఈ క్రింది చూపిన విధముగా జారీ చేయడమైనది.

గ్రామం: పెద్ద దేవులపల్లి మండలం: త్రిపురారం

| క్రమ సంఖ్య | సర్వే నెం. | టైటిల్ స్వభావము | భూమి స్వభావము | విస్తీర్ణము | పట్టాదారు పేరు/ తండ్రి పేరు | సరిహద్దులు ఉ | ద | తూ | ప | [illegible] |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 128 | పట్టా | మెట్ట | 0.14 | గడ్డం మహేష్ తండ్రి ఏడు కొండలు | 126 | 30 | 115 | 40 | - |

మొత్తం విస్తీర్ణం ఎ. 0.14 గుంటలు

ఇట్టి రూడి ప్రకటన, చట్టం 30/2013లోని సెక్షన్ 15 క్రింద ఎట్టి అభ్యంతరాలు రాలేనందున జారీ చేయడమైనది. ఈ భూసేకరణ వలన నిర్వాసితులు కానందున పునరావాసం మరియు జీవనోపాధి కల్పించబడు విస్తీర్ణము శూన్యం.

భూసేకరణ తలపెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.

పై భూసేకరణ చేయు భూముల యొక్క నమూన భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టరు, ఎ.యం.ఆర్. ప్రాజెక్ట్, విభాగము -1, నల్లగొండ నందు కార్యాలయపు పనివేళల నందు చూసుకొనవచ్చును.

సం/- ప్రత్యేక ఉప కలెక్టరు, ఆర్ఆర్.ఎల్.ఎ., యూనిట్-1, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, నల్గొండ
సం/- అదనపు కలెక్టర్ నల్గొండ
సం/- జిల్లా కలెక్టర్ నల్గొండ

DIPR RO.No.977/LA/PP/Advt/Pub/2025-26

## ఇంటర్ మ్యాథ్స్‌లో ఇంటర్నల్స్

### వచ్చే ఏడాది నుంచి అమలుకు బోర్డు కసరత్తు

హైదరాబాద్,డిసెంబర్31(జనంసాక్షి):ఇంటర్మీడియెట్ మ్యాథమెటిక్స్ పరీక్షల విధానం, సిలబస్ లో ఇంటర్ బోర్డు భారీ మార్పులు చేస్తోంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి 'కొత్త లెక్క'లను అమలు చేయబోతోంది. ఇప్పటి వరకు మ్యాథ్స్ పేపర్ అంటే 75 మార్కులకు రాత పరీక్ష ఉంది. వచ్చే ఏడాది నుంచి ఇది మారనుంది. సీబీఎస్ఈ తరహాలో ఇంటర్నల్ మార్కుల విధానాన్ని తీసుకురావాలని బోర్డు నిర్ణయించింది. వచ్చే అకాడమిక్ ఇయర్ నుంచి థియరీ పరీక్షను 60 మార్కులకు కుదించనున్నారు. మిగిలిన 15 మార్కులను 'ఇంటర్నల్స్' కు కేటాయించనున్నారు. అంటే కాలేజీల చేతిలో ఈ 15 మార్కులు ఉండనున్నాయి. విద్యార్థి సామర్థ్యం, ప్రాజెక్టులు, అటెండెన్స్ వంటి అంశాల ఆధారంగా ఇంటర్నల్స్?లో మార్కులు వేస్తారు. దీంతో విద్యార్థులపై పరీక్షల ఒత్తిడి కొంత తగ్గే అవకాశం ఉంది. ఇప్పటివరకూ ఎంపీసీ, ఎంఈసీ విద్యార్థులకు మ్యాథ్స్ పేపర్ ఒకేలా ఉంది. రెండు పేపర్లకు వచ్చే 150 మార్కులను శాతంగా తీసుకొని వంద మార్కులకు కుదించారు. ఇకపై ఈ విధానానికి చెక్ పడనున్నది. ఎంఈసీ విద్యార్థులకు మ్యాథ్స్ పేపర్ ను వంద మార్కులకు నిర్వహించనున్నారు.

# పుతిన్ నివాసంపై దాడి..

### ఉక్రెయిన్ పనేనని రష్యా ఆరోపణ

మాస్కో(జనంసాక్షి):ఉక్రెయిన్‌తో ఘర్షణలను ముగించే దిశగా ప్రయత్నాలు జరుగుతోన్న సమయంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ నివాసంపై దాడికి యత్నం జరిగింది 91 దీర్ఘశ్రేణి డ్రోన్లను ఉక్రెయిన్ ప్రయోగించిందని రష్యా విదేశాంగశాఖ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం ఆ దృశ్యాలు విడుదలయ్యాయి. రష్యా రక్షణశాఖ వాటిని బయటపెట్టింది. ఈ వీడియో ప్రారంభంలో కూలిన డ్రోన్ ఒకటి కనిపిస్తోంది.నోవ్‌గొరొడ్ ప్రాంతంలో పుతిన్ వ్యక్తిగత నివాసంపై ఆదివారం రాత్రి, సోమవారం తెల్లవారుజామున డ్రోన్లతో దాడికి ఉక్రెయిన్ ప్రయత్నించిందని రష్యా వెల్లడించింది దీనిని ఉగ్రదాడిగా పేర్కొంది. ఉక్రెయిన్ ప్రయోగించిన డ్రోన్లను అన్నింటినీ నిర్వీర్యం చేశామని, నివాసానికి ఎటువంటి నష్టం కలగలేదని పేర్కొంది. ఉక్రెయిన్‌పై సరైన సమయంలో దాడిచేసే హక్కు తమకు ఉందని, శాంతి చర్చలకు విఘాతం కలిగించే దాడి అని



విదేశాంగశాఖ మంత్రి లావ్రోవ్ హెచ్చరించారు. అయితే ఈ వ్యాఖ్యలను ఉక్రెయిన్ ఖండించింది. ఇదంతా అవాస్తవమని పేర్కొనింది. కాగా.. అధ్యక్షుడి నివాసాన్ని లక్ష్యంగా చేసుకున్నారనే నివేదికలు తీవ్ర ఆందోళన కలిగించాయని భారత ప్రధాని మోదీ పేర్కొన్న సంగతి తెలిసిందే. ఘర్షణలకు ముగింపు పలకడం, శాంతి సాధనకు ప్రస్తుతం కొనసాగుతోన్న దౌత్య ప్రయత్నం అత్యంత ఆచరణీయ మార్గమని సూచించారు.

## 'స్వచ్ఛనగరం'లో కలుషిత జలాలు తాగి

- ఏడుగురు మృతి!
- వారం రోజుల్లో 1100 మందికిపైగా అస్వస్థత

ఇందౌర్(జనంసాక్షి):దేశంలోనే స్వచ్ఛ నగరంగా పేరొందిన మధ్యప్రదేశ్‌లోని ఇందౌర్‌లో కలుషిత జలాలు ప్రజల పాలిట ప్రాణాంతకంగా మారాయి. మురుగు కలిసిన నీళ్లు తాగడంతో డయేరియా, వాంతుల బారిన పడి నగరంలో ఇప్పటివరకు ఏడుగురు మృతి చెందారు. మేయర్ పుష్యమిత్ర భార్గవ ఈ విషయాన్ని ధ్రువీకరించారు. భాగీరథ్‌పుర ప్రాంతంలో లీకేజీ కారణంగా మురుగునీరు తాగునీటి పైప్‌లైన్‌లోకి ప్రవేశించినట్లు ప్రాథమికంగా తేలిందని చెప్పారు. మరో 149 మంది బాధితులు నగరంలోని 27 ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.కలుషిత జలాలతో గత వారం రోజుల్లో 1,100 మందికిపైగా అస్వస్థత పాలైనట్టు అంచనా. ఈ ఘటనపై ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌గ్భ్భాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. చికిత్స పొందుతున్నవారి ఆస్పత్రి ఖర్చులు భరిస్తామన్నారు. సీఎం ఆదేశాల మేరకు మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన ఓ జోనల్ అధికారి, ఓ సహాయ ఇంజినీర్‌పై సస్పెన్షన్ వేటు వేసినట్లు ఓ ఉన్నతాధికారి వెల్లడించారు. ఓ ఇన్‌ఛార్జ్ సబ్-ఇంజినీర్‌పైనా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. భాగీరథ్‌పురలోని నీటి సరఫరా ప్రధాన పైప్‌లైన్‌లో ఒక చోట లీకేజీ బయటపడిందని, దాని కారణంగానే నీళ్లు కలుషితమై ఉండొచ్చని మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ యాదవ్ తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర విచారణకు ఐఏఎస్ అధికారి నేతృత్వంలో ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశారు.

## నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించే లేదు

### - మద్యం తాగి పట్టుబడితే భారీ జరిమానా..

### వాహనాల జప్తు: సీపీ సజ్జనార్ వార్నింగ్

హైదరాబాద్(జనంసాక్షి): న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో మందుబాబులకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ హెచ్చరికలు జారీ చేశారు. నూతన సంవత్సరం బందోబస్తు ఏర్పాట్లపై సీపీ సజ్జనార్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భద్రతా ఏర్పాట్లపై కీలక ఆదేశాలను జారీ చేశారు. మద్యం తాగి వాహనాలతో రోడ్ల పైకి వస్తే ఉపేక్షించేది లేదన్నారు. నగరంలోని 120 ప్రాంతాల్లో ఇవాళ రాత్రి ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడతామని చెప్పారు. మద్యం తాగి పట్టుబడితే భారీ జరిమానాతో పాటు వాహనాలను జప్తు



చేస్తామన్నారు. జైలు శిక్ష, డ్రైవింగ్ లైసెన్స్ రద్దు తదితర చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ర్యాష్ డ్రైవింగ్, బహిరంగ ప్రదేశాల్లో న్యూసెన్స్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు."రాత్రి 7 గంటల నుంచే డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ఉంటాయి. అర్ధరాత్రి ఒంటిగంట వరకే ఈవెంట్లకు అనుమతి ఇస్తాం. సమయం దాటి వేడుకలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. నిబంధనలకు విరుద్ధంగా సౌండ్ సిస్టమ్స్ వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవు. బ్యాక్‌డోర్ ద్వారా మద్యం విక్రయించడం పూర్తిగా నిషేధం. క్యాబ్‌లు, ఆటో డ్రైవర్లు రైడ్ నిరాకరిస్తే ఉపేక్షించబోం. పోలీసులు అనాథాశ్రమాల్లో, వృద్ధాశ్రమాలు, ఆసుపత్రుల్లో నూతన సంవత్సర వేడుకలు చేసుకోవాలి" అని సజ్జనార్ వెల్లడించారు.

**ఫ్లైఓవర్ల మూసివేత.. భారీ వాహనాలపై నిషేధం**

న్యూఇయర్ వేడుకల నేపథ్యంలో నగరంలో పోలీసులు ఆంక్షలు విధించారు. ఫ్లైఓవర్లు మూసివేయనున్నారు. భారీ వాహనాల ప్రవేశంపై రాత్రి నుంచి నిషేధం అమలు చేయనున్నారు. ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్‌లో వాహనాలకు అనుమతి లేదని పోలీసులు తెలిపారు. ఈవెంట్స్ జరిగే ప్రాంతాల్లోనూ ట్రాఫిక్ ఆంక్షలు అమలు కానున్నాయి. ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని పోలీసులు సూచించారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు చేపట్టనున్నారు. మహిళల భద్రతకు షీటీమ్స్ విధుల్లో ఉండనున్నాయి.

# వార్డెన్ భవానిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

**చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ జ్యోతి, కో-కనీర్వనర్లు శ్రీదేవి, రాధ**

**హైదరాబాద్ (జనంసాక్షి) :** జయశంకర్‌భూపాలపల్లి జిల్లాలోని ఎస్సీ బాలికల గురుకులంలో విద్యార్థినిని విచక్షణారహితంగా కొట్టిన వార్డెన్ భవానిపై ప్రభుత్వం చట్ట పరమైన చర్యలు తీసుకుని, విద్యార్థులకు పూర్తి రక్షణ కల్పించాలని చైతన్య మహిళా సంఘం డిమాండ్ చేసింది. చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ జ్యోతి, కో-కనీర్వనర్లు శ్రీదేవి, రాధ మాట్లాడుతూ భూపాలపల్లి ఎస్సీ బాలికల గురుకుల విద్యాలయంలో వార్డెన్ భవాని బాలికను కర్రతో చేతులతో విపరీతంగా కొట్టడమే కాకుండా బూతులు కూడా తిట్టినట్లు మనకు సోషల్ మీడియాలో వచ్చిన వీడియో లో కనిపించిందని, ఆ అమ్మాయి ఎంత బ్రతిమిలాడినా వినిపించుకోకుండా మూర్ఖంగా మిగతా విద్యార్థులు చూస్తుండగానే తన రూములో తలుపులు బంధించి కొట్టిన వీడియో చూస్తుంటే మనం నాగరికత సమాజంలో ఉన్నామా లేక ఆటవిక సమాజంలో ఉన్నామా అనే సందేహం కలుగుతోందని, పిల్లల మీద తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుని మంచిగా చదివి,వాళ్ళ కాళ్ళ మీద వాళ్ళు నిలబడాలని కోరికతో ప్రభుత్వ హాస్టల్లో చేరిస్తే అక్కడ వారి పిల్లలను హాస్టల్ వార్డెన్ క్రమశిక్షణ పేరుతో వారిని గోడ్డును బాదినట్లు కొట్టడం చూసిన తల్లిదండ్రులు తట్టుకుని ఇక నుండి గురుకులాల్లో చదివించుటకు సుముఖత చూపించలేక పోతారని, ఇప్పటికే అమ్మాయిలు అక్షరాస్యత శాతంలో వెనుకబడి ఉన్నారని, మరి ఇలాంటి సంఘటనలు జరిగితే ఇంకా అమ్మాయిలలో అక్షరాస్యత శాతం తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు. క్రమశిక్షణ పేరుతో బంధికానాలను చేస్తున్న ప్రభుత్వ విధానాలలో మార్పులు రావాలని, ప్రభుత్వ పాఠశాలలో వేలవేల ఫీజులు కట్టలేక విద్యార్థులు చదువుకోవడానికి ప్రభుత్వ గురుకులాల్లో చదివి తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని కోరికతో చదువుకోవడానికి వచ్చే అమ్మాయిల మీద ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్న వార్డెన్లను ఏరి పారేయాలని, ఉచిత నిర్బంధ విద్య హక్కు చట్టం 2009 ప్రకారం బాలబాలికలకు ఎన్నో హక్కులు కల్పించిందని, బాలికను విచక్షణారహితంగా కొట్టిన వార్డెన్ భవానిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఆ బాలికకు పూర్తి రక్షణ కల్పించి విద్యను కొనసాగించేటట్లు చూడాలని, గురుకుల విద్యను పేదలకు దూరం చేయకుండా వాళ్ల భవిష్యత్తుకు భరోసానిచ్చే గురుకుల విద్యాసంస్థలను కాపాడవలసిందిగా ప్రభుత్వాన్ని కోరారు.

# రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

**వరంగల్, డిసెంబర్31 (జనంసాక్షి) :** గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొని మృతి చెందిన సంఘటన బుధవారం తెల్లవారు జామున వరంగల్-చింతలపల్లి రైల్వే స్టేషన్‌ల మధ్య జరిగింది. వరంగల్ జీఆర్పీ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఎస్ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందిన ఘటన బుధవారం తెల్లవారు జామున జరిగింది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం. సుమారు 45 ఏళ్ల వయసున్న వ్యక్తి అబ్బనికుంట మైసమ్మ దేవాలయం సమీపంలో గుర్తుతెలియని రైలు ఢీ కొట్టింది. మృతుడు బ్లాక్ అండ్ వైట్ షేడ్స్ జీన్స్ ప్యాంట్, వైట్ కలర్ ఫుల్ షర్ట్ ధరించి ఉన్నాడు. మృతుని వద్ద ఎలాంటి గుర్తింపు ఆధారాలు లభించలేదు. రైల్వే అధికారులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ మార్చురీ గదిలో భద్రపరిచి దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు ఎంజీఎం దవాఖానా మార్చురీలో గాని లేదా వరంగల్ ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని సూచించారు.



# డీఎస్పీ ములుగు ఎన్.రవీందర్‌కు రాష్ట్ర ప్రభుత్వ శౌర్య పథకం

- **ఘనంగా అభినందించిన ములుగు ఎస్పీ**

**ములుగు బ్యూరో,డిసెంబర్31(జనం సాక్షి):** ములుగు జిల్లా డీఎస్పీ ఎన్.రవీందర్ కి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన శౌర్య పథకంను ప్రదానం చేసింది.తన సేవా కాలంలో చూపిన అసాధారణ ధైర్యసాహసాలు, కర్తవ్య నిష్ఠకు గాను ఈ పురస్కారం అందించబడింది.ఈ సందర్భంగా ములుగు జిల్లా ఎస్పి సుధీర్ రామనాథ్ కేకాన్,డీఎస్పీ ఎన్.రవీందర్ ని ప్రత్యేకంగా అభినందించి ఘనంగా సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం డిఎస్పి చేసిన కఠినమైన అటవీ ప్రాంతాల్లో మావోయిస్టు నిరోధక చర్యల్లో చేసిన కృషికి, వరద సహాయక చర్యల్లో,ఎమ్మెల్యే,ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల బందోబస్తు నిర్వహణలో, గ్రామపంచాయతీ ఎన్నికలు మరియు మేడారం మహాజాతర నిర్వహణలో డీఎస్పీ రవీందర్ చూపిన ధైర్యం,సమర్థత ప్రశంసనీయమని ఎస్పీ పేర్కొన్నారు.ఇలాంటి అధికారులు జిల్లా పోలీస్ విభాగానికి గర్వకారణమని, యువ పోలీస్ అధికారులకు ఆదర్శంగా నిలుస్తారని ఎస్పీ తెలిపారు.

# బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలి

- **జిల్లా ఎస్పీ డాక్టర్ జి.జానకి షర్మిల**
- **భైంసా గ్రీవెన్స్‌లో ఆర్జిదారుల ఫిర్యాదులు స్వీకరణ**




**భైంసా డిసెంబర్ 31 (జనం సాక్షి) :** నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో బుధవారం భైంసా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలోఎస్పీ డా. జి. జానకి షర్మిల పాల్గొన్నారు. ఈ సందర్భంగా భైంసా సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన తొమ్మిది మంది ఆర్జిదారుల ఫిర్యాదులను స్వీకరించి, ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించారు. ఫిర్యాదు దారుల ఎదుటే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, బాధితులకు చట్టపరంగా అవసరమైన సహాయాన్ని వెంటనే అందించాలని సూచించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**కుటుంబ వివాదాల పరిష్కారంలో 'షీ టీం' పాత్ర**

ఈ కార్యక్రమంలో వచ్చిన కొన్ని కుటుంబ సమస్యలపై షీ టీం సిబ్బంది ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సిలింగ్ ద్వారా కుటుంబాలు తిరిగి కలుసుకోవడం జరిగింది. ప్రజలు "నిర్మల్ వరకు రావడం కష్టంగా ఉండగా, భైంసాలోనే కౌన్సిలింగ్ కల్పించడం పై ఎస్పీ గారు చూపిన ఆలోచనను బాధితులు సంతృప్తిని వ్యక్తం చేశారు.

**పెండింగ్ ఫిర్యాదులపై సమీక్ష**

ఈ సందర్భంగా గతంలో గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కార స్థితి, ఇంకా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని పెండింగ్ లో ఉన్న వాటిని వేగంగా పరిష్కరించాలన్నారు.

# వన సంరక్షణ సమితితో అటవీ సంరక్షణ

- **రాష్ట్ర రెవెన్యూ,శాఖ పొంగులేటి శ్రీనివాసరెడ్డి**
- **వన సంరక్షణ సమితి సమావేశ మందిరాన్ని ప్రారంభించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**కల్లూరు, డిసెంబర్31 (జనంసాక్షి) :** వన సంరక్షణ సమితితో అటవీ సంరక్షణ, అభివృద్ధికి అటవీ శాఖ కు చక్కటి సహకారం లభిస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయ ఆవరణలో నిర్మించిన వన సంరక్షణ సమితి సమావేశ మందిరాన్ని మంత్రి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ.. కనకగిరి, పులిగుండాల తదితర అటవీ ప్రాంతాల్లో 4 నుండి 5 వన సంరక్షణ సమితులు క్రియాశీలకంగా పనిచేస్తున్నట్లు ఆయన అన్నారు. ఇందులో నుండి గుర్తించిన ఒక సమితిని పైలట్ ప్రాజెక్ట్ గా తీసుకొని వారిని ఆర్థికంగా ప్రోత్సహించడానికి రూ. 20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. విదేశాలకు విహారాలకు కోట్లు పెట్టి వెళతారని, మన చుట్టూ విహారానికి అద్భుతమైన ప్రదేశాలు ఉన్నాయని అన్నారు. జిల్లాలో పులిగుండాల, కనకగిరి హిల్స్ సుమారు 35 వేల ఎకరాలకు ఒకే బిట్ గా అటవీ ప్రాంతం విస్తరించివుందని తెలిపారు. ఈ ప్రాంతం ఎంతో బాగుందని, విదేశాల్లో ఉన్న పర్యాటక ప్రాంతాల రేంజ్ లో వీటిని తీర్చిదిద్దే అవకాశం ఉందని అన్నారు. అడవులను రక్షించుకుంటూ, వన్యప్రాణులను కాపాడుకుంటూ, వినోదానికి, గిరిజనులకు ఉపయోగపడి, లబ్ధి కలిగే విధంగా ప్రోత్సహిస్తూ ప్రణాళిక చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి కార్యాచరణకు కావాల్సిన నిధులు మంజూరు చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ 13 లక్షల వ్యయంతో వన సంరక్షణ సమితి సమావేశ మందిరాన్ని నిర్మించి, ప్రారంభించుకున్నామన్నారు. 35 వేల ఎకరాల అటవీ ప్రాంతాన్ని కబ్జా, ఆక్రమణ నుండి కాపాడడంలో వన సంరక్షణ సమితి పాత్ర కీలకంగా ఉందన్నారు. వన సంరక్షణ సమితి ఆర్థికాభివృద్ధికి జిల్లా యంత్రాంగం నుండి అన్ని విధాలా సహకారం ఇస్తామన్నారు. కనకగిరి, పులిగుండాల, నీలగిరి పార్క్ లలో వారాంతం గడిపేలా అభివృద్ధికి చర్యలు చేపడతామన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు అడవులు ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఏసీపీ వసుంధర యాదవ్, ఎఫ్ డిఓ మంజుల, కల్లూరు ఫారెస్ట్ ఆఫీసర్ రామ్ సింగ్.కల్లూరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నీరజ ప్రభాకర్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు భాగం ప్రభాకర్ చౌదరి, ఆలకుంట నరసింహారావు, పసుమర్తి చంద్రరావు, లక్కినేని కృష్ణ, బొల్లం రామారావు, ధరావత్ మోహన్ నాయక్, రవికుమార్, గూగులోతుప్రసాద్ , నోటి కృష్ణారెడ్డి,వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**పులిగుండాలను అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం : మంత్రి పొంగులేటి**

అడవుల సంరక్షణ, అభివృద్ధిలో వన సంరక్షణ సమితుల (వీఎస్ఎస్) పాత్ర కీలకమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు మండల పరిషత్తు ఆవరణలో నూతనంగా నిర్మించిన వీఎస్ఎస్ సమావేశ మందిరాన్ని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కనకగిరి, పులిగుండాల అటవీ ప్రాంతం సుమారు 35 వేల ఎకరాల్లో విస్తరించి ఉందన్నారు. విదేశాల్లోని పర్యాటక ప్రాంతాలకు దీటుగా వీటిని అభివృద్ధి చేసే అవకాశం ఉందని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అడవులను కాపాడుకుంటూనే, స్థానిక గిరిజనులకు లబ్ధి చేకూర్చేలా ఎకో-టూరిజం ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వన సంరక్షణ సమితుల ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహించేందుకు ఒక సమితిని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి రూ. 20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. అనంతరం పులిగుండాల విహార యాత్ర కోసం రెండు వాహనాలను ప్రారంభించి, సమితి సభ్యులకు కుటీర పరిశ్రమల యూనిట్లను అందజేశారు.

# అయ్యప్ప స్వామికి మండల దీక్షలు ప్రారంభం హాజరైన ఉప్పల



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మొగుళ్ళపల్లి యువసేన ద్యాస ఆంజనేయ స్వామి దేవాలయ కమిటీ డాక్టర్ మొగుళ్ళపల్లి ఉపేందర్ గుప్త గురుస్వామి (27వ మాలాధారణ) సెంట్రల్ సెన్సార్ బోర్డ్ మెంబర్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి అయ్యప్ప స్వామి భక్తుల ఆధ్వర్యంలో దాస ఆంజనేయ స్వామి దేవాలయంనాగేశ్వర్ రావు నగర్ కాలనీ, రోడ్ నెం. 6, రామలింగేశ్వర కాలనీ కమాన్ దగ్గర, సాయిబాబా దేవాలయం వెనుక, మోహన్ నగర్ రోడ్, యస్. మార్ట్ ఎదురు గల్లీ, పాత ఆంధ్రాబ్యాంక్ ఎటియం, ప్రక్కన సందు నిర్వహిస్తున్న 41 రోజుల మండల దీక్షల కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమాలకు ప్రముఖ సామాజిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి ఆశీస్సులు పొందారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొని అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భక్తి, నియమ నిష్ఠలతో కూడిన అయ్యప్ప స్వామి మండల దీక్షలు సమాజంలో శాంతి, ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు యువతను సన్మార్గంలో నడిపించేందుకు దోహదపడతాయని తెలిపారు.అన్నప్రసాద వితరణ లో పాల్గొని అన్నప్రసాదం వడ్డించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానికులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# జర్నలిస్టుల పిల్లలకు ప్రశంసా పత్రాలు అందజేసిన డిజిపి బి శివధర్ రెడ్డి




**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా బుధవారం రాత్రి జలవిహార్ లో జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శ్రీ బి.శివధర్ రెడ్డి అభినందన పత్రాలు మరియు నగదు బహుమతులను జర్నలిస్టుల పిల్లలకు అందజేశారు. వారిని హృదయపూర్వకంగా అభినందించారు. కష్టపడి ప్రతిభను చాటిన వారికి ఈ గౌరవం మరింత ప్రోత్సాహంగా నిలుస్తుందని, భవిష్యత్తులోనూ ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రెస్ క్లబ్, హైదరాబాద్ చాలా మంచి పేరు సంపాదించుకుందని, అధిక సంఖ్యలో సభ్యులు కలిగిన ప్రెస్‌క్లబ్ ప్రయోజనకరమైన కార్యకలాపాలు నిర్వహిస్తోందని ప్రశంసించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని, ప్రజలకు సమాచారం అందించడం ద్వారా సమాజానికి వారు సేవ చేస్తున్నారని పేర్కొన్నారు. జర్నలిస్టుల కుటుంబాలలోని ప్రతిభావంతులైన పిల్లలను గుర్తించి ప్రోత్సహించే కార్యక్రమాలు, జర్నలిస్టుల సంక్షేమం పట్ల ప్రెస్ క్లబ్ చూపుతున్న నిబద్ధతకు నిదర్శనమని తెలిపారు.నూతన సంవత్సరం వేడుకల వంటి కార్యక్రమాలు పరస్పర అవగాహన, సాన్నిహిత్యం, స్నేహభావాన్ని పెంపొం దించేందుకు దోహదపడతాయని చెప్పారు. ప్రెస్ క్లబ్ హైదరాబాద్ నూతన సంవత్సరం వేడుకలు విజయవంతంగా నిర్వహిం చాలని ,రాబోయే సంవత్సరంలో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, జర్నలిస్టులు జ్వాల నరసింహారావు, అమర్, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు విజయకుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల, ట్రెజరర్ రమేష్ వైట్ల, కామేష్ , జర్నలిస్టులు , వారి కుటుంబ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆగని యూరియా కష్టాలు

**చల్లటి చలిలో క్యూలైన్లు**

**వరంగల్, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** యూరియా కోసం రైతులు నరకయాతన పడుతున్నారు. ఎముకలు కొరికే చలిలోనే అవస్థలు పడుతూ రైతు వేదికల వద్ద పడిగాపులు కాస్తున్నారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి గ్రామంలో రైతు వేదిక వద్ద రాత్రి నుంచే ఎరువుల కోసం బారులు తీరారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండల కేంద్రంలోని గ్రోమోర్ రైతు సేవా కేంద్రం వద్ద తెల్లవారుజాము 3 గంటల నుంచే రైతులు క్యూలైన్లలో నిలబడ్డారు. చలికి దుప్పట్లు కప్పుకొని, స్వెటర్లు వేసుకుని టోకెన్ల కోసం రాత్రంతా ఉప్పరపల్లి రైతు వేదిక వద్ద జాగరణ చేశారు. వర్షాకాలంలో ఇబ్బందులు పడ్డా యాసంగి పంటకైనా సరిపడా యూరియా అందుతుందని ఆశతో మక్క, వరి పంటలు వేశామని, అయినప్పటికీ తిప్పలు తప్పడంలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్రంలో యూరియా కొరత లేదని.. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించినా, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. కేసీఆర్ పాలనలో నిరంతరం నిల్వ చేసే బఫర్ స్టాక్ 3.50 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 4 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ఉండేది. కానీ యూరియా సరఫరా చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం చావు తెలివితేటలను ప్రదర్శించింది. యూరియా నిల్వలను బస్తాల లెక్కలో 47,68,000 బస్తాలు ఉన్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. అంటే అంతా కలిపి 2.15 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే అవుతుంది. ఈ లెక్కన రాష్ట్రంలో 12,700 గ్రామాలకు గానూ ఒక్కో గ్రామానికి అందుబాటులో ఉన్నది 376 యూరియా బస్తాలు మాత్రమే. ఇంతలా యూరియా కొరత ఉండటం కారణంగా రైతులు చలికి వణుకుతూ రైతు వేదికలు, సహకర సంఘాల వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి వచ్చింది.

# అగ్రంపహాడ్‌లో సమ్మక్క-సారలమ్మ జాతర

- **అమ్మవార్లను దర్శించుకున్న ఎమ్మెల్యే**

**హన్మకొండ, డిసెంబర్31 (జనంసాక్షి) :** మినీ మేడారంగా పేరొందిన హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్‌లో సమ్మక్క-సారలమ్మ జాతరను విజయవంతం చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం అగ్రంపహాడ్‌లో సమ్మక్క-సారలమ్మను ఎమ్మెల్యే దర్శించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. పారిశుధ్యంలో నిర్లక్ష్యం వహించవద్దని, రహదారికి ఇరువైపులా విద్యుత్తు ద్వీపాలు ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# జనగామలో రోడ్డు ప్రమాదం

- **విజయవాడకు చెందిన వ్యక్తి మృతి**

**జనగామ, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** జనగామ- సూర్యాపేట జాతీయ రహదారిపై లింగాల గణపురం మండలం వడిచర్ల సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీలోని విజయవాడకు చెందిన సయ్యపురాజు, రాంప్రసాద్, లవ కుమార్, శరత్ కుమార్ రామగుండంలో జరిగిన ఈవెంట్‌కు వెళ్లి తిరిగి వస్తున్నారు. వడిచెర్ల సమీపంలో జనగామ వైపు వెళ్తున్న డీసీఎం వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపారు. ఈ క్రమంలో నిద్రమత్తులో ఉన్న కారు డ్రైవర్ డీసీఎంను గమనించకుండా ఎదురుగా వెళ్లి ఢీకొట్టాడు. ఈ సంఘటనలో కారులో ఉన్న విజయవాడ చెందిన సయ్యపురాజు విష్ణువర్ధన్ అలియాస్ బబ్లు(32) అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా జనగామ హాస్పిటల్‌కు తరలించారు. సంఘటన స్థలాన్ని జనగామ రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

# గ్రామంలో పారిశుద్ధ్యానికి శ్రీకారం

- **సర్పంచ్‌తో కలిసి చీపురు పట్టిన జనం**

**హన్మకొండ, డిసెంబర్31 (జనంసాక్షి) :** గ్రామాభివృద్ధిలో పారిశుద్ధ్యం, పరిశుభ్రతకు మొదటి ప్రాధాన్యం కల్పిస్తూ గ్రామ సర్పంచ్, పాలకవర్గం సభ్యులు నడుం బిగించారు. ఊరంత చీపురు పట్టి వీధులు, రోడ్లు శుభ్రం చేసి పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామంలో బుధవారం సర్పంచ్ గుంటిపల్లి రేణుక ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు, అధికారులు ఊరంత ఊడ్చి, డ్రైనేజీలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మండల అధికారులు సైతం భాగస్వాములై కదిలారు. కొత్త సంవత్సరంలో కొత్త ఆలోచనలు, సరికొత్త సంస్కరణలతో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామని సర్పంచ్ రేణుక స్పష్టం చేశారు.

# మంచు కురిసే వేళలో...!



**చెన్నారావుపేట, డిసెంబర్ 31 (జనంసాక్షి):** అసలే వినిపిస్తున్న చలికాలం... ఆపై విపరీతంగా మంచు కురుస్తుంది. బుధవారం తెల్లవారు జామున ఎటు చూసినా మంచు విపరీతంగా కురుస్తూ మంచి దుప్పటి కప్పేసినట్లుగా కనిపించింది. దీంతో గ్రామాల్లోని ప్రజలు, విద్యార్థులు, రైతులు ఉదయం వేళలో అనేక ఇబ్బందులు పడ్డారు. వాహనదారులు తమ వాహనాల లైట్లను వేసుకొని ఇబ్బందుల నడుమ ప్రయాణం చేయాల్సి వచ్చింది. ఉదయం 10:30 గంటల వరకు కూడా వాతావరణ మంతా చల్లబడి మంచుతో కమ్మేసినట్లుగా కనిపించింది.




# ఈ ఏడాదిలో అయినా కాలుష్యంపై దృష్టిపెడదామా?

**మానవాళి అభివృద్ధిలో పర్యావరణం కీలకపాత్ర పోషిస్తుంది. పర్యావరణం ఎంత ఆరోగ్యంగా ఉంటే, మనం కూడా అంత ఆరోగ్యంగా ఉంటాం. మన చుట్టూ ఉన్న జీవ, నిర్జీవ అంశాలన్నింటినీ పర్యావరణం అంటారు. పర్యావరణ ఆరోగ్యం అనేది ప్రజారోగ్యంలోని అతిపెద్ద రంగాలలో ఒకటి. ఒక ప్రాంతంలోని భౌతిక, రసాయన, సాంస్కృతిక వాతావరణం, ఆ ప్రాంత పర్యావరణ ఆరోగ్యాన్ని సూచిస్తుంది. ఇది ఆ ప్రాంతంలోని కాలుష్య స్థాయి, జీవావరణ వైవిధ్యం, పరిశుభ్రమైన తాగునీరు లభ్యత, పారిశుద్ధ్య పరిస్థితులు, వ్యవసాయ ఉత్పాదకత వంటి వాటిపై ఆధారపడి ఉంటుంది. పర్యావరణ సమస్యల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం 1.6 కోట్లకు పైగా మరణాలు సంభవిస్తున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదించింది. అంతేకాక, వందకు పైగా అనారోగ్యాలు పర్యావరణ ఆరోగ్య సమస్యలతో నేరుగా ముడిపడి ఉన్నాయని కూడా ఆ నివేదిక పేర్కొంది.**

ప్రపంచవ్యాప్తంగా 155 దేశాలు తమ పౌరులకు ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించే హక్కును కల్పించినప్పటికీ, భూమి, గాలి, నీరు, రసాయన కాలుష్యం వంటి "పర్యావరణ ప్రమాదాల" వల్ల 23 శాతం మరణాలు సంభవిస్తున్నాయి. పర్యావరణంలో మార్పులు ప్రజల జీవనోపాధికి, ఆహార భద్రతకు ముప్పు తెస్తున్నాయి. గత పదేళ్లుగా వాతావరణంలో వేడి పెరుగుతోంది. శిలాజ ఇంధనాల వాడకం పెరగడం వల్ల భూతాపం పెరుగుతోంది. ప్రపంచ సగటు ఉష్ణో?గ్రత 1.15 డిగ్రీల సెంటీగ్రేడ్ పెరిగింది. అడవులు తగలబడటం, అకాల వరదలు, తుఫానులు సాధారణం అయ్యాయి. వాతావరణ మార్పులు సూక్ష్మజీవుల మనుగడకు, వైరస్‌ల వ్యాప్తికి కారణమవుతున్నాయి.

**పర్యావరణంలో సవాళ్లు :** వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ పెరగడం, అంటార్కిటికాలో ఉష్ణో?గ్రతలు పెరగడం, అలాగే ఆర్కిటిక్ ప్రాంతాలలో శాశ్వత మంచు కరగడం వంటివి పర్యావరణానికి ప్రధాన సవాళ్లుగా నిలుస్తున్నాయి. ప్రపంచ వన్యప్రాణి నిధి ఇటీవల ఒక నివేదికలో క్షీరదాలు, చేపలు, పక్షులు, సరీస ృపాలు, ఉభయచరాల జనాభా 1970 నుంచి 2016 మధ్య సగటున 68 శాతం క్షీణించాయని తెలిపింది. ఇది జీవవైవిధ్యానికి తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తుంది. అలాగే పట్టణీకరణ, పంటలు, పశువుల పెంపకం, కాగితాల తయారీ కోసం ప్రతి సంవత్సరం కోటి హెక్టార్లకు పైగా చెట్లను నరుకుతున్నారు. దీనివల్ల అటవీ నిర్మూలన జరుగుతోంది.

ప్రపంచంలోని అతిపెద్ద పర్యావరణ సమస్యలలో వాయు కాలుష్యం ఒకటి. దీని కారణంగా ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం 42 లక్షల నుంచి 70 లక్షల మంది మరణిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, ప్రతి పది మందిలో తొమ్మిది మంది అధిక కాలుష్య కారకాలను కలిగి ఉన్న గాలిని పీల్చుకుంటున్నారు. మరో ముఖ్యమైన సమస్య ఏమిటంటే, భూమిపై సముద్ర మట్టం సంవత్సరానికి సగటున 3.2 మి.మీ పెరుగుతోంది. ఈ శతాబ్దం చివరి నాటికి అది దాదాపు 0.7 మీటర్ల వరకు పెరిగే అవకాశం ఉందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ



పెరుగుదల వల్ల సముద్ర తీరప్రాంతాలు ముంపునకు గురై, సుమారు 34 కోట్ల నుంచి 48 కోట్ల మంది సురక్షిత ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వస్తుంది.

ప్రతి గంటకు 300 ఫుట్‌బాల్ మైదానాల పరిమాణంలో అడవులు నరికివేయబడుతున్నాయి. ఇలాగే కొనసాగితే, 2030 నాటికి ఇప్పుడున్న అడవులలో కేవలం 10% మాత్రమే మిగిలి ఉండవచ్చు. మహాసముద్రాలు భూమి వాతావరణంలోకి విడుదలయ్యే కార్బన్ డయాక్సైడ్‌లో 30% గ్రహిస్తాయి. అధిక కార్బన్ డయాక్సైడ్ వల్ల సముద్ర జలాలు ఆమ్లీకరణకు గురవుతున్నాయి. దీనివల్ల 2050 నాటికి పగడపు దిబ్బలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఆరోగ్యకరమైన నేలలో కనీసం 3 నుంచి 6% సేంద్రీయ పదార్థం ఉంటుంది. కానీ ప్రపంచంలో చాలా చోట్ల ఇది ఉండాల్సిన దాని కంటే చాలా తక్కువగా ఉంది. ఇది నేల కోతకు సంకేతం.

**పరిష్కారాలు :** మన దేశంలో పర్యావరణ పనితీరును మెరుగుపరచడానికి ప్రభుత్వానికి, పరిశ్రమలు, ప్రజలు కలిసి కృషి చేయాలి. ఈ పని కోసం అనేక కోణాల నుండి ప్రయత్నాలు అవసరం. ఈ ప్రయత్నాలు కొన్ని ముఖ్యమైన రంగాలలో చేపడితే మంచి ఫలితాలు వస్తాయి.

**విధానాలు – పాలన :** పర్యావరణాన్ని పరిరక్షించడానికి ప్రభుత్వం కొత్త నియమాలను రూపొందించాలి. ప్రస్తుతం ఉన్న చట్టాలను కచ్చితంగా అమలు చేయాలి. గాలి, నీటి కాలుష్యం, వ్యర్థ పదార్థాల నిర్వహణ, జీవవైవిధ్యం వంటి విషయాలకు సంబంధించిన నియమాలను మరింత పటిష్టం చేయాలి. పర్యావరణ పనితీరు సూచిక వంటి సంస్థల నుండి లభించిన డేటాను ఉపయోగించుకుని కాలుష్యానికి సంబంధించిన బలహీనమైన ప్రాంతాలను గుర్తించి, వాటికి తగిన పరిష్కారాలను కనుగొనాలి.

**శక్తి – వాతావరణ చర్యలు :** శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించడానికి పునరుత్పాదక ఇంధన వనరుల వాడకాన్ని వేగవంతం చేయాలి. సౌర శక్తి, పవన శక్తి, గ్రీన్ హైడ్రోజన్ వంటివాటిలో పెట్టుబడులు పెంచడం చాలా ముఖ్యం. 'నేషనల్ సోలార్ మిషన్', 'నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్' వంటి కార్యక్రమాలు ఇప్పటికే బాగా పనిచేస్తున్నాయి. ఇంధన సామర్థ్యాన్ని పెంచడానికి, 'ఉజాల' వంటి పథకాలను ప్రోత్సహించాలి. బొగ్గు వంటి ఇంధనాల వాడకాన్ని దశలవారీగా తగ్గించి, దాని స్థానంలో కాలుష్య రహిత సాంకేతికతను ప్రోత్సహించాలి.

**కాలుష్య నియంత్రణ :** గాలి నాణ్యతను మెరుగుపరచడానికి 'నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్'ను మరింత సమర్థవంతంగా అమలు చేయాలి. దీనిలో పారిశ్రామిక ఉద్గారాలను నియంత్రించడం, ప్రజా రవాణా, ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడం, వ్యవసాయ వ్యర్థాలను కాల్చడాన్ని నివారించడం వంటి చర్యలు ఉంటాయి. నదుల కాలుష్యాన్ని తగ్గించడానికి 'నమామి గంగే' వంటి పథకాలను విస్త ృతం చేయాలి. మురుగునీటి శుద్ధి ప్లాంట్లను నిర్మించడం, వ్యవసాయంలో రసాయనాల వాడకాన్ని తగ్గించడం, చెరువులు, నదుల వంటి నీటి వనరులను కాపాడటం కూడా అవసరం. వ్యర్థ పదార్థాల నిర్వహణకు 'ఎక్స్టెండెడ్ ప్రొడ్యూసర్ రెస్పాన్సిబిలిటీ' వంటి విధానాలను కచ్చితంగా అమలు చేయాలి.

**జీవవైవిధ్యం – అడవుల సంరక్షణ :**

'నగర్ వన్ యోజన' వంటి పథకాల ద్వారా పట్టణ ప్రాంతాలలో పచ్చదనాన్ని పెంచాలి. అలాగే, 'మిష్టీ' వంటి కార్యక్రమాలతో తీర ప్రాంతాలలో మడ అడవులను కాపాడాలి. వ్యవసాయంలో పర్యావరణానికి హాని కలిగించని విధానాలను, అంటే సేంద్రీయ వ్యవసాయం, పంటల మార్పిడిని ప్రోత్సహించాలి. అడవులను, వాటిలోని జీవవైవిధ్యాన్ని కాపాడటానికి 'ప్రాజెక్ట్ టైగర్', 'ప్రాజెక్ట్ ఎలిఫెంట్' వంటి ప్రాజెక్టులను కొనసాగించాలి.

**ప్రజలు, వ్యాపార సంస్థల పాత్ర:**

పర్యావరణ సమస్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలి. వ్యర్థ పదార్థాలను వేరు చేయడం, నీటిని పొదుపుగా వాడటం, వినియోగాన్ని తగ్గించడం వంటి వాటిని ప్రోత్సహించాలి. కంపెనీలు కూడా పర్యావరణ హితమైన ఉత్పత్తి విధానాలను అవలంబించాలి. కాలుష్యాన్ని తగ్గించడానికి, వ్యర్థాలను పునర్వినియోగం చేయడానికి సాంకేతికతను ఉపయోగించాలి. స్థానిక ప్రజలను పర్యావరణ పరిరక్షణలో భాగం చేయడం ద్వారా, ఈ ప్రయత్నాలు మరింత విజయవంతం అవుతాయి.



**జనక మోహన రావు దుంగ**
**8247045230**

# ఓయూ పార్ట్ టైమ్ అధ్యాపకుల నియామకాల్లో అవకతవకలు..?



ఓయూ.. అంటేనే ఓ యుద్ధభూమి. అనేక సామాజిక ఉద్యమాలకు పురిటిగడ్డ. వందేమాతర ఉద్యమం నుండి మొదలుకుని తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు సాగిన మలిదశ ఉద్యమానికి సారథి. ఇక్కడ చదివే విద్యార్థుల్లో ఎక్కువ శాతం బడుగు బలహీన వర్గాల నుండి వచ్చిన వారే.. రాష్ట్రంలోని నలుమూలల నుండి నాణ్యమైన విద్యను అభ్యసించడానికి ఇక్కడికి వస్తుంటారు. అటువంటి యూనివర్సిటీల్లో అధ్యాపక పోస్టులు భర్తీ చేయక పుష్కర కాలం దాటింది. దాదాపు 75% పోస్టులు ఖాళీగా ఉన్నాయని, త్వరలో నియామకాలు ఉంటాయన్న వార్తలు నిత్యకృత్యం అయ్యాయి. కానీ కార్యరూపం దాల్చడం లేదు. ఇటీవలే ఉస్మానియా యూనివర్సిటీలో పార్ట్ టైమ్ అధ్యాపకుల కోసం నోటిఫికేషన్ జారీ చేశారు. అందులో విధి విధానాలపై స్పష్టత లేదు. ఏదో నోటిఫికేషన్ ఇచ్చామంటే ఇచ్చామన్నట్టు ఉంది.

సిలబస్ లేకుండా పరీక్షల్ని నిర్వహించారు. సబ్జెక్టుల వారీగా నిర్వహించిన పరీక్షల్లో అభ్యర్థికి వచ్చిన మార్కుల ఆధారంగా కాకుండా, హాజరైన ప్రతి ఒక్కర్ని ఇంటర్వ్యూకు పిలవడం జరిగింది. అసలు పెట్టిన పరీక్షకు ఎన్ని మార్కులు కేటాయించారు.? పీజీ, పీహెచ్డీ తో పాటు నెట్/సెట్ లాంటి వాటికి ఎన్ని మార్కులను కేటాయించారో స్పష్టత లేదు. వాస్తవానికి యూనివర్సిటీల్లో అధ్యాపకుల పోస్టుల్ని యూజీసీ నియమ, నిబంధనల ప్రకారం భర్తీ చేయాల్సి ఉంటుంది. కానీ వాటిని పట్టించు కున్న దాఖలాలు లేవు. చాలా డిపార్ట్మెంట్లల్లో పీహెచ్డీ పూర్తి చేసి నెట్/ సెట్ వంటి వాటిల్లో అర్హత సాధించిన వారికి కాకుండా సామాజిక సమీకరణల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసినట్టు ఉందని పలువురు అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే ఓయూ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి పలు హామీలు ఇవ్వడం జరిగింది. అందులో ప్రధానంగా ఉస్మానియా యూనివర్సిటీ తెలంగాణ రాష్ట్రానికి గుండెకాయ లాంటిదని దాన్ని కాపాడుకోవాలని చెప్తూ అభివ ృద్ధికి 1000 కోట్ల రూపాయల్ని మంజూరు చేస్తూ జీవో ను కూడా విడుదల చేశారు.రానున్న రోజుల్లో వీటిని ఏ మేరకు సద్వినియోగం చేస్తారో చూడాలి. ఇక నియామకాల్ని అవినీతి, బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం లేకుండా, కుల, మతాలకు అతీతంగా చేపట్టాలని తెలిపారు. రెగ్యులర్ పోస్టులు దేవుడెరుగు.. కనీసం పార్ట్ టైమ్ అధ్యాపకుల నియామకాల్ని కూడా కుల, వర్గ ప్రాతిపదికన ఎంపిక చేస్తున్నారంటే సీఎం రేవంత్ రెడ్డి మాటలకు తను నమ్మి ఏరి కోరి తెచ్చుకున్న యూనివర్సిటీ అధికారులు ఇచ్చే విలువ ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఈ ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వం యూనివర్సిటీల్లో అధ్యాపకుల భర్తీకి జీవో నం. 21 తీసుకువచ్చింది. ఈ జీవో లో వంద మార్కులకు గాను డిగ్రీ, పీజీ లతో పాటు పీహెచ్డీకి కూడా మార్కుల్ని కేటాయించారు. వివిధ సబ్జెక్టుల్లో జాతీయ స్థాయిలో నెట్ ఉత్తీర?తకు, రాష్ట్ర స్థాయిలో సెట్ ఉత్తీర్ణతకు కూడా మార్కుల్ని కేటాయించారు. వాస్తవానికి దేశ వ్యాప్తంగా నిర్వహించే నెట్‌లో ఉత్తీర్ణత సాధించడం, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే సెట్ తో పోల్చితే కొంత కఠినంగా ఉంటుంది.కనీసం ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ జీవో 21 ప్రకారం పార్ట్ టైమ్ అధ్యాపకుల నియామకాల భర్తీ చేయకపోవడం శోచనీయం.

నియామకాలు పారదర్శకంగా, పోటీ ఆధారంగా జరగాలి. ఇలా జరగకుంటే యూజీసీ నిబంధనల ప్రకారం నెట్/సెట్, పీహెచ్డీ వంటి అర్హతలు సాధించిన అభ్యర్థులకు అవకాశాలు లేకుండా పోతాయి. తెలంగాణలో వేలాది మంది అభ్యర్థులు జేఆర్ఎఫ్, నెట్ ఉత్తీర?తతో పాటు పీహెచ్డీ పూర్తి చేసి అధ్యాపక ఉద్యోగాల కోసం ఏండ్ల తరబడి ఎదురు చూస్తున్నారు. వారికి కాదని ఇంటర్వ్యూ ప్యానెల్లో ఉన్న వారు మా కులం వాడని, మా మతం వాడని, మా ప్రాంతం వాడని,లేదా మా భావజాలం వాడని ఇష్టం వచ్చినట్టు అభ్యర్థుల్ని ఉద్యోగాలకు ఎంపిక చేస్తే ఇక మెరిట్ సాధించిన వారి పరిస్థితి..? ఇది ఇలా ఉంటే ప్రభుత్వం రెగ్యులర్ అధ్యాపకుల భర్తీ కోసం తీసుకువచ్చిన జీవో 21 లో కొన్ని మార్పులు చేయాలని ఉద్యోగార్థులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. వారి సూచనలకు సానుకూలంగా స్పందించి యూజీసీ నిబంధనలకు అనుగుణంగా మార్పులు చేస్తే వేలాది మంది అభ్యర్థులకు మేలు జరిగే అవకాశం ఉంటుంది. తెలంగాణ యూనివర్సిటీలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడాలంటే, అత్యుత్తమ ప్రతిభావంతులైన అధ్యాపకు లను భర్తీ చేయాల్సి ఉంటుంది. లేదంటే ప్రభుత్వ యూనివర్సిటీలు రాజకీయ నిరుద్యోగ పునరావాస కేంద్రాలుగా మిగిలే ప్రమాదం ఉంది. ఇంతవరకు అన్ని వర్సిటీల్లో పూర్తి స్థాయి పాలక మండళ్లు కొలువుతీరలేదు. అన్ని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న వేలాది ఉద్యోగాలు కాకుండా 450 అధ్యాపకుల పోస్టుల్ని మాత్రమే భర్తీ చేస్తారని పలు పత్రికల్లో వార్తలు వస్తున్నాయి, అది కూడా కాంట్రాక్ట్, పార్ట్ టైం అధ్యాపకులను మినహాయించి అంటే ఇక నిరుద్యోగులకు మిగిలే పోస్టులు ఎన్ని..? అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ఈ నేపథ్యంలో మరోక సారి ఖాళీలను గుర్తించి పూర్తి స్థాయిలో యూనివర్సిటీ అధ్యాపకుల్ని భర్తీ చేసినపుడే బడుగు, బలహీనవర్గాలకు నాణ్యమైన విద్యను అందించినట్లు అవుతుంది. కేంద్రం, యూజీసీ నుండి రావాల్సిన నిధులు కూడా సకాలంలో విడుదలయ్యే అవ కాశం ఉంటుంది. రాజ్యాంగ మౌలిక సూత్రాలకు లోబడి పారదర్శకంగా, రాజకీయాలకు అతీతంగా,ఆశ్రిత పక్షపాతం లేకుండా యూనివర్సిటీల్లో ఆచార్యుల నియామకాలు చేపట్టాలన్న నిరుద్యోగ యువత ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం అడుగులు వేయాలి. అదే విధంగా ఇటీవల జరిగిన పార్ట్ టైమ్ అధ్యాపకుల నియామకాల్లో అవకత వకలు జరిగాయన్న అంశంపై యూనివర్సిటీ అధికారులు స్పందించి అర్హులైన ఉద్యోగార్థులకు న్యాయం చేయాలి.

**యం.అర్జున్, హైదరాబాద్**

# జ్ఞాన భారతం.. భవిష్యత్తుకు ప్రాచీన జ్ఞానం

భారతదేశం ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన,సమృద్ధిగా నిల్వ చేయబడిన వ్రాతప్రతుల సంపదను కలిగి ఉంది. వీటిపై సుమారు 80 భాషలలో వివిధ రంగాలైన తత్వశాస్త్రం, వైద్యం, ఖగోళశాస్త్రం, గణితశాస్త్రం, కళలు, సాహిత్యం వంటి విషయాల జ్ఞానం భద్రపరచబడింది. కానీ ఈ అపారమైన జ్ఞాన భాండాగారం దేశవ్యాప్తంగా చెదిరిపోయి, సంస్థలు, గ్రంథాలయాలు, ఆలయాలు మరియు వ్యక్తిగత సేకరణలలో ఉంది. ఈ ఖజానాను రక్షించి, ప్రపంచానికి అందుబాటులో ఉంచడానికి భారత ప్రభుత్వం 'జ్ఞాన భారతం' మిషన్‌ను 2025–26 బడ్జెట్‌లో ప్రకటించింది. ఈ మిషన్ భారత జ్ఞాన వారసత్వాన్ని సంరక్షించడమే కాకుండా, ఆధునిక డిజిటల్ సాంకేతికతల ద్వారా దానిని ప్రతి ఒక్కరికీ తెరిచి ఇస్తుంది.

**మిషన్ లక్ష్యాలు– వ్యూహం:**

జ్ఞాన భారతంమిషన్ ఒక సమగ్రమైన దృక్పథంతో రూపొందించబడింది. ఇది 2024–31 కాలానికి రూ. 482.85 కోట్ల బడ్జెట్‌తో కేంద్ర ప్రభుత్వ పథకంగా నిర్వహించబడుతోంది.

**దీని ప్రధాన లక్ష్యాలు :**

దేశవ్యాప్త సర్వే: దేశంలోని ప్రతి వ్రాతప్రతిని గుర్తించడం. వాటి వివరాలను (మెటాడేటా) రికార్డు చేయడం. విజ్ఞాన సంరక్షణ–శాస్త్రీయ మరియు సంప్రదాయ పద్ధతుల ద్వారా శారీరకంగా దుర్బలమైన వ్రాతప్రతులను పునరుద్ధరించి, సంరక్షించడం.

**డిజిటల్ మార్పిడి :** ఏఐ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) (కృత్రిమ మేధస్సు) జనిత హస్తలిఖిత పాఠ గుర్తింపు వంటి ఆధునిక సాంకేతికతలను ఉపయోగించి, 1 కోటి వ్రాతప్రతులను డిజిటల్ రూపంలోకి మార్చడాన్ని లక్ష్యంగా పెట్టుకొంది. ఈ డిజిటల్ సంపద 'జాతీయ డిజిటల్ రిపోజిటరీ' (ఎన్.డీ.ఆర్.)లో నిల్వ చేయబడుతుంది.

**ప్రాప్యత, పరిశోధన :** ఈ డిజిటల్ గ్రంథాలయాన్ని పరిశోధకులు, విద్యార్థులు మరియు సామాన్య ప్రజలు ఉచితంగా లేదా నియంత్రితంగా (పరిమితంగా) ఉపయోగించుకోవచ్చు. అనువాదం, ప్రచురణలు అలాగే పరిశోధనను ప్రోత్సహించడం కూడా లక్ష్యంగా పెట్టుకొంది.

**సాంకేతికత, భవిష్యత్తు :** ఈ మిషన్ కేవలం పురాతన డాక్యుమెంట్‌లను స్కాన్ చేయడం కంటే మించినది. ఇది భారతదేశం యొక్క వారసత్వాన్ని ఆధునిక యుగంతో అనుసంధానించే పరివర్తనాత్మక, పరిశోధనాత్మక ప్రయత్నం.

**ఏఐ, యువత :** మిషన్ 'జ్ఞాన–సేతు' వంటి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ )ఆధారిత సవాళ్లను ప్రారంభించింది. ఇది యువతను వ్రాతప్రతులను డీకోడ్ చేయడానికి, వ్యాఖ్యానించడానికి సాంకేతికతను ఉపయోగించుకునేలా ప్రోత్సహిస్తుంది.

**సహకార నెట్వర్క్ :** సంస్కృతి మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా 50 కంటే ఎక్కువ విద్యా సంస్థలతో ఒప్పందాలపై సంతకాలు చేస్తోంది. ఇందులో కోల్ కతా యొక్క ఏషియాటిక్ సొసైటీ, శ్రీనగర్ విశ్వవిద్యాలయం వంటి ప్రతిష్టాత్మక సంస్థలు ఉన్నాయి. ఈ సంస్థలు వ్రాతప్రతుల సంరక్షణ, డిజిటల్ మార్పిడి మరియు పరిశోధన కేంద్రాలుగా పని చేస్తాయి.

**ప్రధాన మంత్రి దృష్టి కోణం :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గారు ఈ మిషన్‌ను "భారతదేశ సంస్కృతి, సాహిత్యం మరియు చైతన్యం యొక్క ప్రకటన"గా పేర్కొన్నారు. వారు దీనిని 'విరాసత్ ఔర్ వికాస్' (వారసత్వం మరియు అభివృద్ధి) మరియు 'విక్సిత్ భారత్' అనే దృష్టితో అనుసంధానించారు.

**ప్రజల పాత్ర :** జ్ఞాన భారతంమిషన్ విజయం కేవలం ప్రభుత్వం మరియు సంస్థలపై మాత్రమే ఆధారపడి ఉండదు. దేశంలోని లక్షలాది మంది వ్యక్తులు,కుటుంబాలు తమ వద్ద ఉన్న పురాతన వ్రాతప్రతులను ఈ జాతీయ ఉద్యమంలో భాగం చేయడం చాలా ముఖ్యం. ప్రతి ఒక్కరు ఈ భారత జ్ఞాన వారసత్వాన్ని కొనసాగిస్తూ కాపాడుకునేవారు అలాగే ప్రచారం చేసే వారుగా మారవచ్చు.

సారాంశంలో, జ్ఞాన భారతం మిషన్ అనేది ఒక చారిత్రక పునరుద్ధరణ ప్రక్రియ. ఇది మన పూర్వీకులు కృషి చేసి ఇచ్చిన జ్ఞానదీపాన్ని, డిజిటల్ యుగంలో మళ్లీ ప్రజ్వలిస్తుంది. ఈ ప్రయత్నం ద్వారా భారతదేశం తన జ్ఞానాన్ని ప్రపంచానికి అందించే 'విశ్వగురు'గా తిరిగి నిలవడానికి దోహదపడుతుంది. ఇది కేవలం చరిత్రను సంరక్షించడం మాత్రమే కాదు, భవిష్యత్తును నిర్మించడం కూడా.ఇది మనందరి బాధ్యత.



**డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్**
**9849328496**

## ఉత్తరాల పెట్టె..

బీరువా నిండా
ఆమె బట్టలు నింపుకున్నట్లు
అట్టపెట్టె నిండా
పావలా నుండి ప్రారంభమైన
ఉత్తరాలను దాచుకున్నాను.
ప్రాణమున్న బంధాలు
నిర్మానుష్య వీధుల్లో
విహరిస్తుంటే
జీవమున్న అక్షరాలు
సెకండుకొక
అనుభూతినిస్తాయి .
పండగ వస్తోందని
ఇంటి బూజు దులపడానికి
నా ఉత్తరాల పెట్టె అడ్డుగా
ఉందని
బీరువా పై నుండి కింద
పెట్టబోతే
జారిపడి,
లేఖలన్నీ చిందరవందర
అయ్యాయి
హృదయం గాజు
ముక్కలాంటిది కదా
బాల్యంలో బడి పంతులు
బెత్తం దెబ్బలు ఇప్పటికీ
మెత్తగా తగులుతూనే
ఉంటాయి
ప్రతీ పోస్ట్ కార్డ్ మీద
బంధాల విలువ
పదిలంగానే ఉంది !

**మందాది గోపీనాథ్**
**ముక్కుడు దేవులపల్లి**
**సెల్ – 98850 45344**

## ఒంటరిగా వెళ్లను

కూరగాయలమార్కెట్టులో
చచ్చువి పుచ్చువి నీళ్ళు జల్లి తాజా
అంటాడు
కిరాణాకొట్టులో
రెండుకిలోల చక్కెరకి
వందగ్రాములు కొట్టేస్తాడు
నాసిరకం సబ్బులు సంచిలో
వేస్తాడు
హోటల్లో
నిన్నటి భోజనం వేడి చేసి పెడ్తాడు
టేబుల్ క్లీన్ చెయ్యడు ప్లేట్ గ్లాస్
యేవి కడ్గడు
బట్టలషాపులో
ప్యాంట్ షర్ట్ పాలిస్టర్వి పెట్టి
కాటన్వని నమ్మిస్తాడు
మందులస్టోర్లో
మాటలు కలిపి నకిలివి అందిస్తాడు
ఎప్పుడూ నేను వొంటరిగా వెళ్లను
ఆమె లేకుండా తోడు రాకుండా
నేను వెళ్ళను గాక వెళ్లను
ఎవ్వరి మోసాలకు బలికాను
నా భావన ముందుకు
వెళ్ళనా వ్యూహాత్మకం
కాదు
ఆమె తప్పనిసరి
నా ఆలోచన పోరాటం
దాల్చదు
ఆమె నను కాచేగురి
ఎల్లవేళలా అందుకే నేను
క్షేమంమరి

**కోటం చంద్రశేఖర్**
**9492043348**

# వ్యవసాయం ఆహారం ఆరోగ్యం- మానవ సమాజం

వ్యవసాయము ఆహారము ఆరోగ్యం పరస్పరంగా విడదీయలేని జీవన మూలకాలుగా మానవ నాగరికత ప్రారంభం నుండి కొనసాగుతున్నాయి. భూమి సారంపై ఆధారపడి సాగిన ప్రాచీన వ్యవసాయం ఆహార భద్రతకు పునాది వేసింది. ఆహార నాణ్యత ప్రజల శారీరక స్థితిని నిర?యించింది. ఆరోగ్యం బలంగా ఉన్న సమాజమే స్థిరమైన అభివ ృద్ధి సాధించింది. భారతదేశంలో 1950ల వరకు కొనసాగిన వ్యవసాయ విధానం ప్రధానంగా సేంద్రీయ ఆధారితమైనది. ఆ కాలంలో పశువుల ఎరువు, పంట అవశేషాలు, పచ్చి ఎరువులు వినియోగం అధికంగా ఉండేది. 1950 సంవత్సరంలో భారతదేశంలో సుమారు 95 శాతం వ్యవసాయ భూమి సేంద్రీయ పద్ధతులకే ఆధారంగా సాగు చేయబడింది. రసాయన ఎరువుల వినియోగం హెక్టారుకు సగటున 1 కిలోగ్రాముకు మించేది కాదు. ఆహార ఉత్పత్తులు సహజ పోషకాలతో సమ ృద్ధిగా ఉండేవి. జీవన శైలీ వ్యాధులు చాలా అరుదుగా ఉండేవి. 1960లో మధుమేహ వ్యాప్తి శాతం 2 కన్నా తక్కువగా నమోదు అయింది. గుండె సంబంధిత వ్యాధులు 1000 మందిలో 15 మందికే పరిమితమయ్యాయి.



1965 తరువాత హరిత విప్లవం భారత వ్యవసాయంలో కీలక మలుపు తీసుకొచ్చింది. అధిక దిగుబడుల విత్తనాలు, రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం వేగంగా పెరిగింది. 1970 నాటికి రసాయన ఎరువుల వినియోగం హెక్టారుకు 15 కిలోగ్రాములకు చేరింది. 1990 నాటికి ఇది 85 కిలోగ్రాములకు పెరిగింది. 2020 నాటికి దేశ సగటు వినియోగం హెక్టారుకు 140 కిలోగ్రాములను దాటింది. ఈ మార్పుతో ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. 1960లో 82 మిలియన్ టన్నులుగా ఉన్న ఆహార ధాన్యాల ఉత్పత్తి 1990లో 176 మిలియన్ టన్నులకు చేరింది. 2022లో ఇది 315 మిలియన్ టన్నుల స్థాయిని దాటింది. ఆహార లభ్యత పెరిగినప్పటికీ ఆహార నాణ్యతలో మార్పులు చోటు చేసుకున్నాయి. మట్టి సారత 1970 నుంచి 2015 మధ్య కాలంలో సుమారు 25 శాతం తగ్గినట్టు వ్యవసాయ గణాంకాలు సూచిస్తున్నాయి.

రసాయన వ్యవసాయ విధానం ఆరోగ్యంపై దీర్ఘకాలిక ప్రభావాలను కలిగించింది. పురుగుమందుల అవశేషాలు ఆహార గొలుసులో ప్రవేశించాయి. 1980లో భారతదేశంలో సగటు పురుగుమందుల వినియోగం హెక్టారుకు 0.3 కిలోగ్రాములుగా ఉండగా 2018 నాటికి ఇది 0.6 కిలోగ్రాములకు చేరింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం భారతదేశంలో జీవన శైలీ వ్యాధులు 1990లో మొత్తం మరణాలలో 37 శాతంగా ఉండగా 2020లో ఇది 63 శాతానికి పెరిగింది. మధుమేహ వ్యాప్తి శాతం 1975లో 2.4గా ఉండగా 2019లో 8.9 శాతానికి చేరింది. అధిక రక్తపోటు సమస్య 1980లో పెద్దలలో 5 శాతం మాత్రమే ఉండగా 2020లో 25 శాతానికి పెరిగింది. క్యాన్సర్ కేసులు 1990లో ప్రతి లక్ష మందికి 70గా నమోదు కాగా 2020లో 120కి చేరాయి. ఈ పెరుగుదలకు ఆహారంలో రసాయన అవశేషాలు ఒక ముఖ్యమైన కారణంగా వైద్య పరిశోధనలు సూచిస్తున్నాయి.

ఇటీవలి కాలంలో సేంద్రీయ వ్యవసాయంపై మళ్లీ ఆసక్తి పెరుగుతోంది. 2000 సంవత్సరంలో భారతదేశంలో సేంద్రీయ వ్యవసాయ విస్తీర?ం కేవలం 0.5 మిలియన్ హెక్టార్లు మాత్రమే ఉండగా 2023 నాటికి ఇది 4.5 మిలియన్ హెక్టార్లకు పెరిగింది. ఇది మొత్తం వ్యవసాయ భూమిలో సుమారు 3 శాతంగా ఉంది. సేంద్రీయ ఆహార ఉత్పత్తుల వినియోగం పట్టణ ప్రాంతాలలో 2010 నుంచి 2022 మధ్య కాలంలో 300 శాతం పెరిగింది. సేంద్రీయ ఆహారం తీసుకునే కుటుంబాలలో పోషక లోపాలు 20 శాతం వరకు తగ్గినట్టు జాతీయ పోషణ సర్వేలు వెల్లడిస్తున్నాయి. పురుగుమందుల అవశేషాల వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు సేంద్రీయ ఆహారం వినియోగించే జనాభాలో 35 శాతం తక్కువగా ఉన్నట్టు అధ్యయనాలు సూచిస్తున్నాయి.

వ్యవసాయ విధానం ఆహార స్వరూపాన్ని నిర్ణయిస్తుంది. ఆహారం ఆరోగ్య స్థితిని ప్రభావితం చేస్తుంది. గతంలో సేంద్రీయ వ్యవసాయం తక్కువ దిగుబడులైనప్పటికీ ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించింది. ప్రస్తుత రసాయన వ్యవసాయం ఆహార పరిమాణాన్ని పెంచినా ఆరోగ్య సమస్యలను పెంచింది. భవిష్యత్తు వ్యవసాయ విధానం సేంద్రీయ సూత్రాలు ఆధునిక సాంకేతికతతో కలిపిన సమతుల్య మార్గాన్ని అనుసరించాల్సిన అవసరం ఉంది. అలా చేసినప్పుడే ఆహార భద్రత నిలబడుతుంది. ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుంది. సమాజం స్థిరమైన అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుంది. భవిష్యత్తులో వ్యవసాయము ఆహారము ఆరోగ్యం మధ్య సమతుల్యత సాధించడమే ప్రధాన సవాలుగా మారుతోంది. మట్టిని కేవలం ఉత్పత్తి సాధనంగా కాక జీవ వ్యవస్థగా చూడాల్సిన దృష్టికోణం అవసరం అవుతుంది. సేంద్రీయ పదార్థాల పునర్వినియోగం మట్టి సారాన్ని తిరిగి పెంచే కీలక మార్గంగా నిలుస్తుంది. రైతుల ఆదాయం పెరిగేలా ఖర్చులు తగ్గించే విధానాలు అమలులోకి రావాలి. ప్రభుత్వ విధానాలు తాత్కాలిక దిగుబడులకన్నా దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలపై ద ృష్టి పెట్టాలి. వినియోగదారుల ఆహార ఎంపికలు కూడా వ్యవసాయ దిశను ప్రభావితం చేస్తాయనే అవగాహన పెరగాలి. పాఠశాల స్థాయిలోనే ఆహార అవగాహన విద్యను ప్రవేశపెట్టడం సమాజ ఆరోగ్యానికి పునాది వేస్తుంది. స్థానిక ఆహార వ్యవస్థలను ప్రోత్సహించడం ద్వారా రవాణా కాలుష్యం తగ్గుతుంది. గ్రామీణ ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. సేంద్రీయ వ్యవసాయం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పునరుజ్జీవనం తీసుకువస్తుంది. వైద్య వ్యయాలు తగ్గడం ద్వారా కుటుంబాల ఆర్థిక భద్రత పెరుగుతుంది. ఆరోగ్యకర ఆహారం ఆరోగ్యకర ఆలోచనలకు దారి తీస్తుంది. ఆరోగ్యకర సమాజం ఉత్పాదక శక్తిని పెంచుతుంది. ఉత్పాదక సమాజమే దేశాభివ ృద్ధికి బలమైన పునాది అవుతుంది. వ్యవసాయ విధానంలో తీసుకునే ప్రతి నిర్ణయం వర్తమాన తరాల ఆరోగ్యాన్ని నిర?యిస్తుందనే సత్యాన్ని మనం మరచిపోవద్దు.



**డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
**కాకతీయ విశ్వవిద్యాలయం**

## బీమా కోరేగావ్ దళితుల ఆత్మగౌరవ యుద్ధం

సామాజిక న్యాయానికి, సమానత్వానికి, హక్కుల పోరాట యుద్ధమే బీమా కోరేగావ్. ఇది అనాదిగా అణిచివేయబడుతున్న దళితుల పోరాటానికి, ధైర్యానికి నిదర్శనం. భీమా కోరేగావ్ మహారాష్ట్రలోని పూణే జిల్లాలో భీమా నది ఒడ్డున ఉన్న ఒక చిన్న గ్రామం, అక్కడ 1818 జనవరి 1న జరిగిన యుద్ధం, దళిత ఉద్యమాల హక్కుల పరంగా ఎంతో ప్రతీకాత్మకమైన స్థలం. ఈ యుద్ధం మూడో ఆంగ్లో–మరాఠా యుద్ధంలో భాగంగా బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి, మరాఠా సమాఖ్యలోని పీష్వా వర్గానికి మధ్య జరిగింది. సుమారు 800 మందికి బ్రిటిష్ బలగాల్లో అత్యధిక భాగం మహర్ వంటి దళిత సైనికులదే కాగా, పీష్వా బాజీరావు పక్షాన దశల వారీగా వేలాది సైనికులు ఉన్నారు. పీష్వా పాలనలో తీవ్ర కుల వివక్ష, అంటరానితనం ఎదుర్కొన్న మహర్ దళితులు, ఈ యుద్ధంలో పీష్వా సైన్యంపై గెలిచిన సంఘటనను ఆత్మగౌరవ విజయంగా చూస్తారు. డా. బి.ఆర్. అంబేద్కర్ 1927 జనవరి 1న భీమా కోరేగావ్ విజయ స్తూపాన్ని సందర్శించి, దీన్ని దళితుల ఆత్మగౌరవ చిహ్నంగా పేర్కొనడంతో ప్రతి ఏడాది అక్కడికి లక్షల మంది దళిత–బహుజనులు చేరి 'శౌర్య దినం'గా జరుపుకుంటున్నారు. ఈ యుద్ధంలో మృతులైన సైనికుల జ్ఞాపకార్థం బ్రిటిష్ ప్రభుత్వం అనాడు కోరేగావ్ వద్ద ఒక స్మారక స్థూపం (విజయ స్తంభం) నిర్మించిందిబీ దానిపై మహర్ సైనికుల పేర్లు కూడా చెక్కబడ్డాయి.ఇప్పుడు జనవరి 1న దేశ నలుమూలల నుంచి దళిత, బహుజనులు అక్కడకు వెళ్లి, పూలే–పెరియార్–అంబేద్కర్ ఆలోచనలతో కలిపి భీమా కోరేగావ్‌ను హక్కుల పోరాటాలకు సూర్తే స్థలంగా జ్ఞప్తి చేసుకుంటున్నారు. 2018లో యుద్ధం 200వ వార్షికోత్సవం సందరరేగా జరిగిన కార్యక్రమాల పూణే పరిసర ప్రాంతాల్లో హింస, ఉద్రిక్తతలు చెలరేగాయి. నేడు దళిత బహుజనులు బీమా కోరేగావ్ యుద్ధ సూర్తేతో ఆత్మగౌరవ రాజ్యాధికార పోరాటానికి శ్రీకారం చుట్టాలి. అప్పుడే బహుజన విముక్తి లభిస్తుంది.



**సంపతి రమేష్ మహారాజ్**
**సామాజిక విశ్లేషకులు**
**7989579428**

# వీబీజీ రామ్‌జీ బిల్లు రద్దయ్యే వరకు ఉద్యమం

**కాప్రా, డిసెంబర్ 31 (జనం సాక్షి) :** కేంద్రం తీసుకువచ్చిన విబి జి రామ్ జి బిల్లు రద్దు అయ్యే వరకు ఉద్యమం చేస్తామని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్రఅధ్యక్షులు కె వెంకట్, హేచ్చరించారు. బుధవారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తా రోడ్ అంబేత్కర్ విగ్రహం వద్ద కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విబి-జి రామ్ జి బిల్లు పత్రాలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె వెంకట్, జిల్లా కార్యదర్శి కె నాగలక్ష్మి, జిల్లా అధ్యక్షుడు కె చంద్ర మోహన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఉన్న వికలాంగులకు 150 ఉపాధి హామీ పథకం ద్వారా కల్పించెందుకు ఉపాధి హామీ పథకం వచ్చిందని అన్నారు.దేశ వ్యాప్తంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో 6,38,088 మంది వికలాంగులకు ఈ పథకం కింద ఉపాధి కల్పించబడిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లు ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంతంలోని వికలాంగ కార్మికులకు జీవనోపాధిని మరింతగా కోల్పోయేలా చేస్తుందని. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వికలాంగుల ను తీవ్రమైన పేదరికంలోకి నేడుతుందని అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో... మందికి పని కల్పించరానిఅన్నారు. నరేగా ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధుల కేటాయింపు 90:10 గా ఉందని, కొత్త బిల్లు ప్రకారం



60:40 శాతంగా నిధులు కేటాయించి ఖర్చు చేయాలని పేర్కొనడం జరుగుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్రమైన ఆర్థిక భారం మోపేదిగా ఉందని అన్నారు. కొత్త చట్టం ప్రకారం వికలాంగులకు పని దొరకని పరిస్థితి ఏర్పడుతుందని.చట్ట బద్ధంగా పని కల్పించాలని చట్టం ఉన్నప్పుడే వికలాంగులకు నిధుల కొరత, పని నిరాకరణ, డిజిటల్ హాజరు వ్యవస్థలు మరియు పని ప్రదేశాలలో సరైన సౌకర్యాలు లేకపోవడం వలన వికలాంగులలో పని చేసే వారి సంఖ్య తీవ్రంగా తగ్గిందని అన్నారు. ఈ బిల్లు 125 రోజుల పనిని అందిస్తుందనే వాదన పూర్తిగా తప్పుదారి పట్టించేదిగా ఉందని అన్నారు. ఉద్దేశపూర్వక నిధుల కొరత కారణంగా సగటున ఉపాధి 50 రోజుల కంటే తక్కువగా ఉందని అన్నారు.వికలాంగులను ఉపాధికి అర్హులైన కార్మికులుగా, సామర్థ్యం ప్రకారం పని చేయడానికి మరియు జీవనోపాధి రక్షణకు చట్టబద్ధంగా గుర్తిస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విబి- జి రామ్ జి బిల్లు వికలాంగుల హక్కును బలహీనపరుస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంతంలోని వికలాంగుల జీవనోపాధి, గౌరవం మరియు మనుగడకు ముప్పు కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం స్ఫూర్తికి భిన్నంగా విబి- జి రామ్ జి బిల్లు ఉందని అన్నారు.కొత్త చట్టం ప్రకారం జాబ్ కార్డ్స్ జారీ చేయడం, పని హక్కుగా ఉపాది వంటి అంశాల వలన రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం వలన వికలాంగులకు అందుబాటులో ఉండే పని దొరికే అవకాశం లేకుండా పోతుందని అన్నారు.ఉపాధి హామీ పథకం సంక్షేమ పథకం కాదని, దేశంలో సామాజిక న్యాయాన్ని చట్ట బద్దంగా అమలు చేసిన ఒక చట్టమనే విషయాన్నీ కేంద్ర ప్రభుత్వం గమనించాలని అన్నారు. కొత్త చట్టంలో పని హక్కుకు వ్యతిరేకంగా ఉన్న అంశాలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బాలయ్య, షైన్ బేగం, కోటయ్య, శివ, అనిల్, నాయకులు, మున్నీ, రవీంద్ర, చంద్ర శేఖర్, జానీ,నరసింహా, తదితరులు పాల్గొన్నారు.

## పార్క్‌ను కాలనీవాసులు సద్వినియోగం చేసుకోవాలి



**హయత్‌నగర్, డిసెంబర్ 31 (జనం సాక్షి) :** వనస్థలిపురం డివిజన్ పోలీస్ స్టేషన్ వెనుక భాగం లోని హెచ్ఎండిఏ పార్క్‌ను వనస్థలిపురం డివిజన్ ప్రాంత ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులు చేపడుతున్న కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి పార్క్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పార్కులు ప్రజల ఆరోగ్యానికి, పిల్లల భవిష్యత్తుకు ఎంతో అవసరమని, ప్రతి కాలనీలో పచ్చదనం పెరగాలనే లక్ష్యంతో ఈ పార్క్‌ను అభివృద్ధి చేశామని వారు తెలిపారు. ప్రజలు పార్క్‌ను సద్వినియోగం చేసుకోవాలని, పరిశుభ్రతను కాపాడుకోవాలని వారు కోరారు. కాలనీవాసుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులు చేపడుతున్న కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి కృషికి కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాశం అశోక్ గౌడ్, క్రిస్టియన్ కాలనీ అధ్యక్షులు హరిందర్ రెడ్డి, మల్లికార్జున నగర్ కాలనీ అధ్యక్షులు నర్సి రెడ్డి, హెచ్ఎండిఏ పార్క్ అధ్యక్షులు చిమ్ముల ప్రభాకర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ మధుసూదన్ రెడ్డి, కోశాధికారి జి. ముత్తిలింగం, అసోసియేషన్ సభ్యులు, కాలని వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## సూసైడ్ చేసుకోబోయే వ్యక్తిని కాపాడిన పోలీసులు



**మహేశ్వరం, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** కేశంపేట మండలం కొత్తపేట గ్రామానికి చెందిన గడ్డమీది కుమార్ బుధవారం మహేశ్వరం మండలం గట్టుపల్లి గ్రామంలో తన అత్తగారి ఇంటికి వచ్చాడు.అత్తగారి ఇంట్లో గొడవ జరగడంతో కుమార్ మన వేదనకు గురై సూసైడ్ చేసుకోవడానికి గట్టుపల్లి నుంచి కోళ్ల పడకల్ వెళ్లే మార్గంలో వెళ్తున్నట్లు 100 నంబర్ కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాడు.వెంటనే అప్రమత్తమైన మహేశ్వరం పోలీస్ సిబ్బంది,పెట్రోలింగ్ వాహనంలో ఉన్న కానిస్టేబుల్ వెంకటేష్,హోంగార్డు నర్సింహులు వెంటనే 4 నిమిషాలలో ఘటన స్థలానికి చేరుకొని వెంకటేష్ ప్రాణాలను కాపాడారు.వెంకటేష్ ను కుటుంబ సభ్యుల దగ్గరికి తీసుకెళ్లి గొడవలు పడకుండా ఉండాలని కుటుంబ సభ్యులకు పోలీసులు సూచించారు.కానిస్టేబుల్ వెంకటేష్ ను, హోంగార్డు నర్సింహులును గ్రామస్థులు అభినందించారు.

## సంగయ్య స్వామి వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరించాలి

- సంగయ్య స్వామిపై దాడి హేయమైన చర్య
- రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్ పటేల్



తాండూరు, డిసెంబర్ 31 (జనంసాక్షి) : కోట్ పల్లి సర్పంచ్ భర్త సంగయ్య స్వామిపై దాడి హేయమైన చర్య అని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శుభప్రద్ పటేల్ అన్నారు. హైదరాబాద్ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంగయ్య స్వామిని ఆయన పరామర్శించారు. సంగయ్య స్వామి ఆరోగ్య పరిస్థితి పై అక్కడి వైద్యులతో అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అలాగే సంగయ్య స్వామి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం భార్య బసమ్మ, కొడుకు రాజశేఖర్ ను కలిసి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా శుభప్రద్ పటేల్ మాట్లాడుతూ సర్పంచ్ భర్తపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలన్నారు. ప్రజాస్వామ్యం లో ఇలాంటి దాడులకు తావు లేదన్నారు. సంగయ్య ఆర్థిక పరిస్థితి బాగాలేదని, ఆయన వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరించాలని శుభప్రద్ పటేల్ ప్రధానంగా డిమాండ్ చేశారు. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. ఎన్నికల్లో ప్రజాతీర్పును ఎదుర్కోలేక భౌతిక దాడులు ,హత్యా రాజకీయాలకు తెగబడడం సిగ్గుచేటన్నారు. రాజకీయాలలో వాదాలు, సంవాదాలు ఉండాలి కానీ కక్షలు, దాడులు ఉండకూడదని అన్నారు. ఇది తెలంగాణ సంస్కృతికి పూర్తిగా వ్యతిరేకమైనటువంటి పెడధోరణి అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన బాధ్యులను చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సంగయ్య స్వామి త్వరగా కోలుకోవాలని శుభప్రద్ పటేల్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## మౌలిక సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు



**హయత్‌నగర్, డిసెంబర్ 31 (జనం సాక్షి) :** వనస్థలిపురం డివిజన్‌లోని వెంకట రమణ కాలనీలో రోడ్డుపై నీరు నిలిచిపోవడం కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాలనీ వాసుల సమస్యను తెలుసుకునేందుకు వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి కాలనీని సందర్శించారు. కాలనీ రహదారులపై నీరు నిలిచిపోవడం వల్ల రాకపోకలకు అంతరాయం కలగడంతో పాటు, ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల ఇబ్బందులను ప్రత్యక్షంగా పరిశీలించిన కార్పొరేటర్ వెంటనే స్పందించి, వాటర్ వర్క్స్ అధికారులను పిలిపించి సమస్యను వెంటనే పరిష్కరించాలని వారు ఆదేశించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజల మౌలిక వసతుల సమస్యలను నిర్లక్ష్యం చేయబోమని, నీటి నిల్వ సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు తాను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తానని వారు కాలనీ వాసులకు భరోసా ఇచ్చారు. రోడ్డుపై నీరు నిలిచిపోవడం వల్ల కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యపై తక్షణ చర్యలు చేపట్టిన రాగుల వెంకటేశ్వర్ రెడ్డి ని ప్రజలు ప్రశంసించారు. ఈ కార్యక్రమం లో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాశం అశోక్ గౌడ్, క్రిస్టియన్ కాలనీ అధ్యక్షులు శ్రీ హరిందర్ రెడ్డి, వాటర్ వర్క్స్ ఏఈ కుమారి భావ్య, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ ను సందర్శించిన డీఎస్పీ సాయి రెడ్డి వెంకట్ రెడ్డి



**ఉర్కొండ, డిసెంబర్ 31 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ను బుధవారం రోజు కల్వకుర్తి డిఎస్పీ సాయి రెడ్డి వెంకట్ రెడ్డి వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించి రికార్డులను పరిశీలించారు.నూతన సంవత్సర వేడుకలు ఎవరికి ఇబ్బంది కలగకుండా చట్టానికి లోబడి చేసుకోవాలని చట్టాన్ని అతిక్రమిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రజలనుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు చట్ట పరిధిలో పరిష్కరించాలని తెలిపారు.రాత్రివేళల్లో ఖచ్చితంగా పెట్రోలింగ్ చేయాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించాలని,పోలీసులు ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలన్నారు.వారి వెంట సిఐ నాగార్జున,ఎస్సై కృష్ణదేవ,పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి

- సంగారెడ్డి అదనపు కలెక్టర్ మాధురి



**సంగారెడ్డి, డిసెంబర్ 31 (జనం సాక్షి) :** విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయులపై ఉందని సంగారెడ్డి అదనపు కలెక్టర్ మాధురి పేర్కొన్నారు. బుధవారం టి టి యు ఉపాధ్యాయ సంఘం సంగారెడ్డి జిల్లా శాఖ క్యాలెండర్ ను అదనపు కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రాథమిక స్థాయి నుంచి పిల్లలకు అర్థమయ్యేలా బోధన చేసి పై చదువులకు సమాయుత్తం చేయడం ఉపాధ్యాయులు బాధ్యతగా తీసుకోవాలన్నారు. అనంతరం జేఏసీ సెక్రటరీ జనరల్ వైద్యనాథ్ మాట్లాడుతూ..... ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ టీచర్స్ యూనియన్ టి టి యు నిరంతరం పనిచేస్తుందని కొనియాడారు. అనంతరం టిటియు జిల్లా క్యాలెండర్ను విడుదల చేశారు. కంది పంచాయతీ నూతన సర్పంచ్ చిన్న సాయిరాం టి టి యు నూతన సంవత్సర క్యాలెండర్ ను సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీటీయూ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు ఎం మోహన్, జిల్లా అధ్యక్షులు పి. ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి రవికుమార్, కంది మండల అధ్యక్షులు తుల్జారాం, సదాశివపేట మండల అధ్యక్షులు జగన్మోహన్, మండల ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్,కృష్ణ,శంకర్ పాల్గొన్నారు.

## ఉప్పల్ నియోజగవర్గ వాసులకి దళిత రత్న అవార్డులు



**ఉప్పల్, డిసెంబర్ 31 (జనం సాక్షి) :** చిలకనగర్ డివిజన్ దళితుల అభివృద్ధికై పటుపడిన నయకులకి దళిత రత్న అవార్డు దక్కింది.దళితుల ఎదుగుదలకు సహకరించిన పెద్దలు వారు చెస్తున్నా సేవను గుర్తించి ఇవ్వడం జరిగింది.షెడ్యూలు కులాల హక్కుల పరిరక్షణ సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు మాస శేఖర్ ఆధ్వర్యంలో స్థానిక ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా దళితరత్న అవార్డు అందజేశారు. దళిత రత్న అవార్డు అందుకున్నా వారిలో కోంద్ర రాములు,పొడిశెట్టి కృష్ణ,కొంగర రామచంద్రం,దేవి పురుషోత్తం,పడిగం రాంనర్సయ్య ,మొగిలిపాక రామచంద్రం,పారుపల్లి నరసింహ, కట్టా భాస్కర్ లు ఉన్నారు.తదనంతరం అవార్డు తీసుకున్న వారు మట్లాడుతు మమ్ములని వెనకుండి నడిపించిన మాస శేఖర్‌కి దన్యవాదాలు తెలుపుతు,భవిష్యత్తులో మాస శేఖర్ ఎల్లావేలల తోడుంటమన్నారు. ఈ కార్యక్రమంలో చిల్కానగర్ మాల సంఘం ఉపాద్యక్షుడు అనుముల వీర,మాల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి మంచినీళ్ల శ్రీనివాస్, మాదరి శ్రీనివాస్, తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర నాయకుడు కోంద్ర లింగస్వామి(జానీ),నక్క సుందర్,సాయి,రాంబాబు,దేవి మహేందర్,బన్నీ,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



**ఊరుకొండ, డిసెంబర్ 31 (జనం సాక్షి) :** జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఊరుకొండ పేట శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. మండల కేంద్రంలో మండల అధ్యక్షులు కుమ్మగోని వెంకటయ్య గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచులు తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఇళ్లకు హైడ్రా భరోసా

- 307 సర్వే నంబరు నివాసితులతో మాట్లాడిన హైడ్రా కమిషనర్
- గాజులరామారంలో పేదల ఇళ్లను మినహాయించే కంచె నిర్మాణం
- ప్రగతినగర్ చెరువు చిరువ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలం

**నిజాంపేట్, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం విలేజ్ సర్వే నంబర్ 307 లోని ప్రభుత్వ భూమిలో ఇళ్ళు కట్టుకుని నివాసం ఉంటున్న వారికి హైడ్రా భరోసా ఇచ్చింది. ఇప్పటికే నివాసం ఉంటున్న పేదలను ఖాళీ చేయించమని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. పేదల ఇళ్లను మినహాయించి మిగిలిన ప్రభుత్వ భూమిని కాపాడుతామన్నారు. వదంతులు నమ్మి ఆందోళన చెందవద్దని సూచించారు. సర్వే నంబరు 307లో నివాసం ఉంటున్న పేదలు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో హైడ్రా కమిషనర్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడ నివాసం ఉంటున్న వారితో హైడ్రా కమిషనర్ నేరుగా మాట్లాడారు. ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన పని లేదని భరోసా ఇచ్చారు. నగరంలో ఎక్కడ కూడా పేదల నివాసాలను హైడ్రా తొలగించదని చెప్పారు. ఎవరైనా హైడ్రా పేరు చెప్పి మోసాలకు పాల్పడితే నేరుగా హైడ్రా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇదే సమయంలో అక్కడ కొత్తగా ఇళ్ల నిర్మాణాలు జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

### ప్రత్యామ్నాయ స్థలం చూపించి తరలించండి..

ప్రగతినగర్ (అంబీర్ చెరువు) చెరువు మధ్యలోంచి సాగే రహదారికి ఇరువైపులా ఉన్న చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలం చూపించాలని అధికారులను హైడ్రా కమిషనర్ ఆదేశించారు. అక్కడ వ్యాపారాలు సులభంగా సాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. హైడ్రా ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ప్రగతినగర్ చెరువును పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. చెరువు పరిసరాల్లో చెత్త గుట్టలను ఇప్పటికే 150 లారీల వరకూ తరలించామని చెప్పారు. చేపలు, చికెన్, మాంసం వ్యర్థాలు చెరువులో కలుస్తుండడంతో పరిసరాలన్నీ దుర్గంధంగా మారుతున్నాయని స్థానికులు ఈ సందర్భంగా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. చిరువ్యాపారులను



ఇక్కడి నుంచి తరలించాలని పలువురు కోరారు. ప్రత్యామ్నాయ స్థలం చూపించి చిరు వ్యాపారులను అక్కడకు తరలించే ఏర్పాట్లు చేయాలని స్థానిక అధికారులను హైడ్రా కమిషనర్ ఆదేశించారు. హైడ్రా అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య, ఏసీపీ ఉమామహేశ్వర్ తో పాటు హైడ్రా, జీహెచ్ఎంసీ, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు కమిషనర్ పర్యటనలో ఉన్నారు.

## మర్పల్లి పోలీస్ స్టేషన్ ను సందర్శించిన డీఎస్పీ శ్రీనివాసరెడ్డి



**మర్పల్లి, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** బుధవారం మర్పల్లి పోలీస్ స్టేషన్ ను డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి తనిఖీ చేశారు. డీఎస్పీకి ఎస్సై రవూఫ్ స్వాగతం పలికారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. పెండింగ్లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. డయల్ 100 ఫిర్యాదులపై వేగంగా స్పందించాలన్నారు. ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలని, పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉన్న పాత నేరస్తులపై నిగా పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకట్, ఎస్సై రవూఫ్, స్టేషన్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
01 జనవరి 2026

# గ్రామాల అభివృద్ధికి సర్పంచులు కృషి చేయాలి

- రాయికోడులో కాంగ్రెస్ సర్పంచ్లకు సన్మానం
- గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి అంజయ్య



**రాయికోడు, డిసెంబర్ 31 (జనం సాక్షి) :** గత రెండు సంవత్సరాలుగా నెలకొన్న సమస్యలు అన్నిటిని పరిష్కరించి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి అంజయ్య నూతన సర్పంచులను కోరారు. బుధవారం మండల కేంద్రమైన రాయికోడు లోని ఎస్ ఎస్ పాటిల్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో నూతనంగా కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచిన సర్పంచులకు,ఉప సర్పంచ్లకు, కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి ఓటమిపాలైన అభ్యర్థులకు,మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలాజీ నర్సింలు ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం చేపట్టారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా డిసిఎంఎస్ మాజీ చైర్మన్ సిద్ధన్న పాటిల్, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు బసవరాజ్ పటేల్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం సుధాకర్ రెడ్డి,వైస్ చైర్మన్ వినయ్ కుమార్,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కేదార్నాథ్ పాటిల్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విదర్భన్ రెడ్డి, వీరభద్రేశ్వర దేవాలయ కమిటీ చైర్మన్ సతీష్ కులకర్?,తదితరులు హాజరయ్యారు అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్మన్ అంజయ్య మాట్లాడుతూ నూతనంగా గెలుపొందిన సర్పంచులందరూ పార్టీల కతీతంగా గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి ఓటమిపాలైన సర్పంచు అభ్యర్థులందరూ ఎవరు కూడా భయపడ కూడదని వారికి మంత్రి దామోదర్ రాజనర్సింహ,కాంగ్రెస్ పార్టీ,అన్ని విధాలుగా అండగా ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఏ ప్రభాకర్,హనుమాన్ గౌడ్, జ్ఞానేశ్వర్, జి విట్టల్, ఎండి రఫీక్, ఆర్ రాజకుమార్, వోగ్గు శ్రీనివాస్, పలు గ్రామాల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్టీయూటీఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన వెల్దుర్తి ఎంఈఓ



**వెల్దుర్తి, డిసెంబర్ 31 (జనం సాక్షి) :** వెల్దుర్తి మండల విద్యాధికారి ఎన్. సీతారాం ఆధ్వర్యంలో బుధవారం వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూటీఎస్ యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా విద్యాశాఖ అభివృద్ధి, ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ, విద్యార్థుల భవిష్యత్తు కోసం యూనియన్ చేస్తున్న కృషి అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యాయుల ఐక్యతతోనే నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు ఆయన చెప్పారు చేశారు. ముఖ్యంగా ఉపాధ్యాయులంతా పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అహర్నిశలు కృషి చేయాలని నేటి బాలలే రేపటి పౌరులను తీర్చిదిద్దాలని ఆయన కోరారు ఈ కార్యక్రమ పి ఆర్ టి యు టి ఎస్ నాయకులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూటీఎస్ యూనియన్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఓటర్ల మ్యాపింగ్ వారం లోపు పూర్తి చేయాలి

- భూభారతి పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య




**సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 31 (జనం సాక్షి) :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఆర్ఐ) లో భాగంగా చేపడుతున్న ఓటర్ల మ్యాపింగ్‌ను వేగవంతం చేసి వారం రోజుల్లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్డీవోలు, తహసిల్దార్లు, ఎన్నికల విభాగపు అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి ఓటర్ మ్యాపింగ్ పురోగతి, భూభారతి దరఖాస్తుల స్థితిగతులను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఎస్ ఐ ఆర్ ప్రక్రియ నిర్దే?త గడువులోగా పూర్తి చేయాలని, బిఎల్వోలు, బిఎల్వో సూపర్వైజర్ల సమన్వయంతో ఫీల్డ్ స్థాయిలో ఓటర్ మ్యాపింగ్ వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మాధురి, సబ్ కలెక్టర్ ఉమా హారతి, రెవిన్యూ డివిజనల్ అధికారులు, తహసిల్దార్లు, ఎన్నికల విభాగపు అధికారులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన మంత్రి



**మక్తల్, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** ప్రణాళికా బద్ధంగా మక్తల్ పట్టణ ప్రగతికి నిధులు కేటాయిస్తామని రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో శ్రీరామ్ నగర్, రసమానియా కాలనీలో మీదుగా గుర్లపల్లి, వనాయకుంట గ్రామాలకు వెళ్లేరోడ్డు రూ.3 కోట్ల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శ్రీరామ్ నగర్ కాలనీ రెహమానియా కాలనీతో పాటు గుర్లపల్లి వనాయకుంట గ్రామాలకు వెళ్లేదారి అధ్వాన్న స్థితిలో గుంతలమైన రోడ్డు కోసం ఈ ప్రాంత ప్రజలు గత 15 ఏళ్లుగా ఇబ్బంది పడ్డారని, ప్రజల ఇబ్బందులు తొలగించేందుకు సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడిన నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. గతంలో లక్ష రూపాయల పని మంజూరైతే 10శాతం కమిషన్లు ఇస్తేనే పనులు ప్రారంభించే దుస్థితి ఉండేదన్నారు. ఈ ప్రాంతాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. అభివృద్ధి చేస్తుంటే పనీపాట లేని వారు ఏమో ఆరోపణలు చేస్తూనే ఉంటారని, అలాంటి విషయాలను పట్టించుకోవాల్సిన అవసరం తనకు లేదన్నారు. స్థానికుడిగా ఈ ప్రాంత అభివృద్ధికి తాను కట్టిపడి ఉన్నానని, దయచేసి ఏ పార్టీకి చెందిన వారైనా స్థానిక నాయకులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం మంచిది కాదని హితవు పలికారు. అవసరమైతే అభివృద్ధి కోసం సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. అభివృద్ధి చేస్తుంటే కేసులు వేస్తున్న దుస్థితి ఉండటం చాలా బాధాకరమన్నారు. ఈ ప్రాంతాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గవినోళ్ళ బాలకృషా?రెడ్డి, కట్టా సురేష్ కుమార్ గుప్తా, కోళ్ళ వెంకటేష్, బోయ రవికుమార్, మందుల నరేందర్, కావలి తాయప్ప, మేదరి శ్రీనివాసులు, బి.అమరేందర. రెడ్డి, నూరొద్దీన్, బి.శంషోద్దిన్, హుసామొద్దీన్, సాదిక్, సాలంబిన్ ఉమర్ బస్రవి, రవూఫ్, రహీం పటేల్, రంజాన్, మున్సిపల్ కమిషనర్ శ్రీరాములు, ఏఈ నాగశివ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలోని సమస్యలు పరిష్కరించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు



**సంగారెడ్డి టౌన్, డిసెంబర్ 31 (జనం సాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కారించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వంను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలలో సమస్యల విద్యార్థులు సమస్య లు తక్షణమే పరిష్కారం చేయాలని కోరారు. ప్రభుత్వం పాఠశాల లో మంచినీళ్లు, వాష్ రూమ్ లు సరిగా లేక విద్యార్థులు టీచర్ లు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.మునిపల్లి మండలం పెద్దలోడి గ్రామంలో ప్రభుత్వ హై స్కూల్ లో ఉన్న మంచినీటి కోసం విద్యార్థులు అవస్థలుపడుతున్నారని అన్నారు. ప్రతి సారి విద్యాధికారులకు చెప్పిన పట్టించుకోవటం లేదని విమర్శించారు. పాఠశాలలో పిఈటీ టీచర్ లేరు. కావున కలెక్టర్ చర్యలు తీసుకొని పాఠశాలలో ఉన్న సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం సిపిఎం నాయకులు నర్సిములు, రమేష్ గౌడ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# పటాన్‌చెరు కేంద్రంగానే పటాన్‌చెరు సర్కిల్ కార్యకలాపాలు

- జిహెచ్ఎంసి కమిషనర్‌ను కోరిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి




**పటాన్‌చెరు, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** దశాబ్దాల చరిత్రతో పాటు నియోజకవర్గ కేంద్రంగా కలిగిన పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిహెచ్ఎంసి పటాన్చెరు సర్కిల్ కార్యాలయాన్ని స్థానికంగానే కొనసాగించాలని లేనిపక్షంలో ప్రజలతోపాటు పాలనాపరంగా తీవ్ర ఇబ్బందులు నెలకొంటాయని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్‌ను పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. బుధవారం హైదరాబాదులోని బల్దియా ప్రధాన కార్యాలయంలో జిహెచ్ఎంసి కమిషనర్ తో ఎమ్మెల్యే జిఎంఆర్ సమావేశమయ్యారు. బల్దియా పునర్విభజన ప్రక్రియలో భాగంగా పటాన్చెరు కేంద్రంగా ఏర్పాటుచేసిన బల్దియా సర్కిల్ కార్యాలయాన్ని ఇటీవల పరిపాలన సౌలభ్యం పేరుతో తెల్లాపూర్ పరిధిలోని మున్సిపల్ కార్యాలయం లోకి మార్చారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ కేంద్రంతో పాటు ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలు మొత్తం పటాన్చెరు కేంద్రంగా సేవలు అందిస్తున్నాయని.. సర్కిల్ కార్యాలయాన్ని తెల్లాపూర్‌కి మార్చడం ద్వారా పరిపాలనాపరంగా ఇబ్బందులతో పాటు పటాన్చెరు, జేపీ కాలనీ, ముత్తంగి డివిజన్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని పేర్కొన్నారు. పరిపాలన పరంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా.. ఆధునిక వసతులతో.. ప్రజలందరికీ అందుబాటులో ఉండే విధంగా గతంలోనే పటాన్చెరు పట్టణంలో సర్కిల్ కార్యాలయాన్ని నిర్మించామని తెలిపారు. నూతన సర్కిల్ ఏర్పడే వరకు సైతం పటాన్చెరు కేంద్రంగానే పాత సర్కిల్ కార్యకలాపాలు కొనసాగాయని తెలిపారు. తక్షణమే పటాన్చెరు కేంద్రంగా సర్కిల్ కార్యకలాపాలు నిర్వహించేలా ఆదేశాలు జారీచేయాలని కమిషనర్ కర?న్ ను ఎమ్మెల్యే జిఎంఆర్ కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కమిషనర్.. ప్రజలకు మెరుగైన పరిపాలన సేవలు అందించడమే తమ లక్ష్యమని.. అతి త్వరలో పటాన్చెరు కేంద్రంగానే సర్కిల్ కార్యకలాపాలు కొనసాగుతాయని తెలిపారు.

## యూరియాను అవసరానికి మించి వాడరాదు



**జడ్చర్ల, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** రైతులు అవసరానికి మించి యూరియాను వాడరాదని అవసరం మేరకు కొనుగోలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం సంయుక్త సంచాలకులు, మహబూబ్ నగర్ జిల్లా నోడల్ అధికారి బాలు నాయక్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా నోడల్ అధికారి బాలు నాయక్ జిల్లా వ్యవసాయ అధికారి బి. వెంకటేష్‌తో కలిసి జడ్చర్ల మండలం బాదేపల్లిలోని ఆగ్రో రైతు సేవా కేంద్రం 2 ను తనిఖీ చేశారు. ఆగ్రో రైతు సేవ కేంద్రంలో యూరియా కొనుగోలు వివరాలను, యూరియా బుకింగ్ విధానంను రైతులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం బాలు నాయక్ రైతులతో మాట్లాడుతూ యూరియాను వృధా చెయ్యొద్దని, పంటలకు వేసేటప్పుడు మొక్క దగ్గర యూరియా వేసిన తర్వాత మట్టి కప్పినట్లు అయితే యూరియాను మొక్క బాగా తీసుకుంటుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా దాదాపుగా 17610 మంది రైతులు నేటివరకు 52545 యూరియా బ్యాగ్ లను ఆన్ లైన్ లో బుక్ చేసుకోవడం జరిగిందని, అందులో 46193 బ్యాగ్స్ రైతులు కొనుగోలు చేయడం కూడ జరిగిందన్నారు. ఇంక 26220 యూరియా బస్తాలు యాప్ లో కొనుగోలు సిద్ధంగా ఉన్నాయని, రైతులు యూరియా విషయంలో ఎటువంటి ఆందోళన చెంద కుండ యూరియా బుకింగ్ యాప్ ద్వారా కొనుగోలు చేయాలని, యూరియా కొనుగోలు కోసం వచ్చే రైతులు తప్పనిసరిగా ఆధార్ కార్డు, పాట్టా పాస్ పుస్తకం తీసుకుని రావాలని సూచించారు.

# ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన శిక్ష తప్పదు

- అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్



**వనపర్తి బ్యూరో, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన శిక్ష తప్పదని అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్ హెచ్చరించారు. బుధవారం అదనపు కలెక్టర్ జిల్లాలోని శ్రీరంగాపూర్, వీపనగండ్ల మండలాల్లోని వివిధ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరియు రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు.వీపనగండ్ల మండలం గోపాల్ దిన్నె ధాన్యం కొనుగోలు కేంద్రంలో (పిపిసి) అక్రమాలు జరుగుతున్నాయన్న వార్తలపై అదనపు కలెక్టర్ తీవ్రంగా స్పందించారు. అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణ అయిన వ్యక్తి పై తక్షణమే ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయాలని సెంటర్ ఇన్చార్జిలను ఆదేశించారు. ఈ విషయంలో సంబంధిత సబ్ ఇన్స్పెక్టర్ తో మాట్లాడి, కేసు నమోదు చేసి విచారణ చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలులో రైతులకు నష్టం కలిగిస్తూ అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారినైనా వదిలిపెట్టేది లేదన్నారు. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా వారిని జైలుకు పంపిస్తాం అని అదనపు కలెక్టర్ హెచ్చరించారు.ధాన్యం కొనుగోలు సజావుగా సాగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని తేమ శాతం పరీక్షించిన వెంటనే తూకం వేయాలని సూచించారు. తూకం పూర్తయిన ధాన్యాన్ని వెంటనే కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలన్నారు. రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు సకాలంలో జమ అయ్యేలా ఇన్చార్జిలు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. శ్రీరంగాపూర్ మండలం కంబాలాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన రైస్ మిల్లును సందర్శించి మిల్లులోని సౌకర్యాలను, ధాన్యం నిల్వ సామర్థ్యాన్ని పరిశీలించి, మిల్లు యజమానులకు సీఎంఆర్, ధాన్యం దించుకోవడంపై తగిన సూచనలు చేశారు.జిల్లా పౌరసరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్, డి ఎం జగన్, రెవెన్యూ సిబ్బంది మరియు సెంటర్ ఇన్చార్జిలు అదనపు కలెక్టర్ వెంట ఉన్నారు.

## బండి సంజయ్‌ను కలిసిన బీజేపీ హుస్నాబాద్ పట్టణ శాఖ



**హుస్నాబాద్, డిసెంబర్ 31 (జనం సాక్షి) :** హుస్నాబాద్ మున్సిపల్ పరిధిలో ఉన్న పలు సమస్యలను కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ దృష్టికి బీజేపీ హుస్నాబాద్ పట్టణ శాఖ నాయకులు తీసుకువెళ్లారు. బుధవారం మహాలక్ష్మి ఆలయం వద్ద ఆయనను కలిసిన పట్టణ శాఖ అధ్యక్షులు బత్తుల శంకర్ బాబు నేతృత్వంలోని బీజేపీ నాయకులు, పట్టణంలో నెలకొన్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సమస్యలను శ్రద్ధగా విన్న కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్ సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత శాఖల అధికారులకు వెంటనే సమాచారం అందజేసి పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. హుస్నాబాద్ పట్టణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి పూర్తి అండదండలు ఉంటాయని తెలిపారు. పట్టణ సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హుస్నాబాద్ మున్సిపల్‌లో నెలకొన్న సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కారానికి భరోసా ఇచ్చిన కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్‌కి బీజేపీ హుస్నాబాద్ మున్సిపల్ పార్టీ తరఫున నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హుస్నాబాద్ పట్టణ శాఖ అధ్యక్షులు బత్తుల శంకర్ బాబు, నాయకులు కవ్వ వేణుగోపాల్ రెడ్డి, వరియోగులు అనంతస్వామి, పట్టణ ప్రధాన కార్యదర్శులు గాదాసు రాంప్రసాద్, పోలోజు రాజేంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాల్లో నాయి బ్రాహ్మణులు ముందుండాలి

- నాయి బ్రాహ్మణ సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నాగభూషణం

**సంగారెడ్డి టౌన్, డిసెంబర్ 31 (జనం సాక్షి) :** రాజకీయ సమీకరణాలలో నాయి బ్రాహ్మణులు ముందుండి ఉనికిని చాటాలని నాయి బ్రాహ్మణ సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నాగభూషణం, పట్టణ అధ్యక్షులు లకుడాలం మాణిక్ ప్రభు, ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు యాదయ్యలు బుదవారం పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన నాయి బ్రాహ్మణ సర్పంచ్లు, ఉప సర్పంచ్లు, వార్డు మెంబర్లకు బుధవారం నాయి బ్రాహ్మణ సేవా సంఘం పట్టణ కమిటీ కార్యాలయంలో ఆత్మీయ సన్మానం చేసి మాట్లాడారు. మనిషి పుట్టుక నుండి చావు వరకు ప్రతి పనిలో ముందుండే నాయి బ్రాహ్మణులు రాజకీయ రంగంలో మరింత ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. నాటి కాలంలో నాయి లైన నందవంశ రాజులు రాజ్యాలను ఏలారని గుర్తు చేశారు. నిస్వార్థ ముఖ్యమంత్రిగా సేవలందించిన నాయి బ్రాహ్మణ కర్పూరి ఠాకూర్ స్ఫూర్తితో నాయిలందరూ రాజకీయంగా మరింత ఎదుగుదలకు కృషి చేయాలని సూచించారు. రాజకీయాలలో అనిచ్చితత్వం కొరబడటం రాజకీయ సమీకరణాల ఆవశ్యకతను సూచిస్తుందన్నారు. జిల్లాలో పోటీ చేసిన నాయి బ్రాహ్మణులు అందరూ గెలుపొందడం పోతులూరి వీరబ్రహ్మం కాలజ్ఞానం మేరకు భవిష్యత్తు రాజకీయాల్లో నాయిలు ముందుంటారని సూచిస్తుందన్నారు. అవకాశం ఉన్న ప్రతి స్థానంలో రాజకీయంగా నాయి బ్రాహ్మణులు పోటీలో ఉండాలని సూచించారు. గెలుపొందిన నాయి బ్రాహ్మణ నాయకులు వృత్తిదారుల ఎదుగుదలకు కృషి చేయాలన్నారు. సమాజంలో నాయిలు అస్పృశ్యతకు లోను కాకుండా మరింత సంఘటితం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శివకాంతం, జిల్లా నాయకులు వీరన్న, సత్యం, ఆంజనేయులు, మురళి, ఉద్యోగ సంఘాల గౌరవ అధ్యక్షులు కిష్టయ్య, సుధామణి, పట్టణ గౌరవ అధ్యక్షులు దత్తాత్రి, వర్కింగ్ ప్రెసిడెంట్ సాయినాథ్, సహాయ కార్యదర్శి మురళి, పెంటయ్య, స్వాగత్ ప్రభు, హనుమంతు, చరణ్, రాము, మండల అధ్యక్షులు, ఉపసర్పంచ్లు, వార్డ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.



# మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ మహా జాతర దృష్ట్యా కీలక ముందడుగు

- మేడారం పరిధి లోని నార్లాపూర్ నూతన పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించిన మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ములుగు ప్రతినిధి-ఎస్ ఎస్ తాడ్వాయి, డిసెంబర్ 31(జనంసాక్షి) :** ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారం నందు నూతనంగా నిర్మించిన నార్లపూర్ పోలీస్ స్టేషన్‌ను బుదవారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామిణాభివృద్ధి, గ్రామిణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన లతో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ నూతన పోలీస్ స్టేషన్ ప్రారంభం మేడారం మహా జాతర దృష్ట్యా ఎల్లప్పుడూ ప్రజలకు భక్తులకు గుత్తికొయా గిరిజన ప్రజలకు అందుబాటులో ఉంటూ, శాంతి భద్రతల పరిరక్షణకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. జాతర సమయంలో లక్షలాది భక్తులు తరలివచ్చే నేపథ్యంలో ప్రజల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వేగవంతమైన పోలీస్ సేవల అందించడంలో ఈ స్టేషన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో పోలీసింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ నూతన స్టేషన్‌ను ఏర్పాటు చేసినట్లు, ఇది ప్రజలకు మరింత చేరువైన, సమర్ధవంతమైన సేవలకు నాంది పలుకుతుందని అన్నారు. పోలీస్ స్టేషన్ లో స్టేషన్ హౌస్ అధికారి ఎస్ఐ హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ స్థాయిలలో సుమారుగా 30 మంది పనిచేయనున్నారని, నార్లాపూర్ పోలీస్ స్టేషన్ హౌస్ అధికారిగా ఎస్ఐ ఏ కమలాకర్ విధులు నిర్వహించనున్నారని, పస్రా పరిధిలో ఈ స్టేషన్ పనిచేస్తుందని పస్రా సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా దయాకర్ పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం మంత్రి సీతక్క, కలెక్టర్, ఎస్పీ లతో కలిసి మేడారం సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ శివం ఉపాధ్యాయ, ఏఎస్పీ ఏటూరునాగారం మనన్ బట్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, స్థానిక సర్పంచ్ పిరిల భారతీ వెంకన్న, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## గట్టమ్మ ఆలయం వద్ద నూతన పార్కింగ్


- భక్తుల సౌకర్యమే మా మొదటి ప్రాముఖ్యత
- ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్
- భక్తులకు ఇబ్బంది కలగకుండా దేవాలయానికి అతి సమీపంలో ఏర్పాటు
- నూతన ప్రణాళికలతో నూతన ఉత్సాహంతో పని చేస్తున్న ములుగు పోలీస్



**ములుగు బ్యూరో,డిసెంబర్31(జనం సాక్షి):** మేడారం మహాజాతర సందర్భంగా భక్తులకు సౌకర్యవంతమైన పార్కింగ్ ఏర్పాట్ల కోసం ములుగు జిల్లా ఎస్పీ శ్రీ సుధీర్ రామనాథ్ కేకాన్,డీఎఫ్ఓ కిషన్ జాదవ్ తో కలిసి గట్టమ్మ ఆలయం పరిసర ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్‌కు అనువైన ప్రాంతాన్ని ఎంచుకొని చదును చేయగా ఈ రోజు చదును చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ ప్రాంతాన్ని జాతర సమయంలో వేల సంఖ్యలో వచ్చే ప్రభుత్వ మరియు ప్రైవేట్ వాహనాల పార్కింగ్‌కు ఉపయోగించేందుకు,సుమారు 10 ఎకరాల మేర ప్రాంతాన్ని అనుకూలంగా తీర్చిదిద్దారు కాగా ఈ సారి ట్రాఫిక్ ను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతికులంగా మారనుంది. ఎస్పీ అటవీ శాఖ అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పార్కింగ్ ప్రాంతంలో వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్పష్టమైన రేడియం స్టిక్కర్లు, దిశానిర్దేశక సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని,రాత్రి సమయంలో కూడా స్పష్టంగా కనిపించేలా సూచికలు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎస్పీ ఆదేశించారు. వాహనాలు సులభంగా వచ్చేందుకు అవసరమైన ర్యాంపులు ఏర్పాటు చేయాలని తెలిపారు. పార్కింగ్ నుంచి ఆలయ మార్గం వరకు ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల సాఫీగా రాకపోకలు జరిగేలా ముందస్తు ప్రణాళిక రూపొందించారు. మేడారం జాతరను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ తెలిపారు.

## ఫుట్‌పాత్‌ల ఆక్రమణకు వృద్ధురాలు బలి

- తోపుడు బండ్ల నియంత్రణలో అధికారుల నిర్లక్ష్యం
- బస్సు కింద పడి మహిళ మృతి





**పరకాల డిసెంబర్ 31 (జనం సాక్షి):** పరకాల పట్టణ బస్టాండ్ పరిధిలో ఫుట్ పాత్ ల ఆక్రమణ, నియంత్రించాల్సిన అధికారుల నిర్లక్ష్యం, ఆర్టీసీ బస్సు డ్రైవర్ అజాగ్రత్త తో ఒక మహిళ నిండు ప్రాణం బలైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ 2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హనుమకొండ నుండి భూపాలపల్లి వైపు వెళ్తూ, పరకాల బస్ స్టేషన్ లోకి వెళ్లే క్రమంలో మూల మలుపు వద్ద ములుగు జిల్లా పల్సాబ్ పల్లి గ్రామానికి చెందిన తోట రాధమ్మ(70) అనే మహిళ బస్సు చక్రాల కింద పడి మరణించింది. బస్సులు లోపలికి వెళ్లే మార్గం లో తోపుడు బండ్ల ఆక్రమణలతో ఇరుకుగా మారడం, మూల మలుపులో రోడ్డు బాగా దెబ్బ తినడం వెరసి మహిళ రోడ్డు దాటుతుండగా డ్రైవర్ మలుపు తిప్పుతున్న క్రమంలో వేగంగా వచ్చి రాధమ్మను ఢీకొట్టడంతో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మహిళ మృతి చెందడం పట్ల స్థానికులు తీవ్ర అగ్రహం చెందుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే బస్టాండ్ ప్రాంతంలో తోపుడు బండ్లు, వాహనాలు పార్కింగ్ వల్ల ప్రమాదాలు జరుగుతున్న మున్సిపల్ అధికారులు, పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. సంఘటన నా స్థలానికి చేరుకున్న పోలీసులు మహిళా మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. ఈ సంఘటనతోనైనా అధికారులు బస్టాండ్ ఏరియాలో ఆక్రమణలు తొలగించి ప్రజల ప్రాణాలకు భత్రతను ఇవ్వాలని కోరుతున్నారు.

## కాంగ్రెస్ పాలనలో అరాచకాలు.. రైతుల అరిగోస!

- కాంగ్రెస్ ప్రభుత్వం, చెన్నారావుపేట పోలీసుల తీరుపై ధ్వజం
- అధికార పార్టీ అండతో అక్రమ కేసులు బనాయించడం పద్ధతి కాదు
- పోలీసుల చిట్టా అంతా నా దగ్గర ఉంది
- వారం రోజుల్లో మీ పని పడతాం
- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి



**చెన్నారావుపేట, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పాలనలో అరాచకాలు పెరిగిపోతున్నాయని రైతులు అరిగోస పడుతున్నారని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం చెన్నారావుపేట మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే, చెన్నారావుపేట పోలీసుల పనితీరు పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పాలనలో యూరియా కోసం మహిళలు, వృద్ధులు పిల్లలను ఎత్తుకొని రాత్రి 12 గంటల నుండి ఉదయం 10 గంటల వరకు ఎముకలు కోరికే చలిలో గంటల తరబడి క్యూ లైన్లలో నిలబడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. రైతుల పాపం ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి తగులుతుందని మండిపడ్డారు. అంతేకాక మొన్న జరిగిన స్థానిక సర్పంచ్ ఎన్నికలలో చలిమంట కాగే నిప్పు కర్రలతో మా బిఆర్ఎస్ కార్యకర్తలపై చెరువుకొమ్ము తండాలో కాంగ్రెస్ కార్యకర్తలు కర్రలతో దాడి చేసిన కూడా పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేయకుండానే తిరిగి మా బిఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేశారన్నారు. చెన్నారావుపేటలో బిఆర్ఎస్ వార్డు సభ్యుడు మూడు రమేష్ పై కాంగ్రెస్ నాయకులు దాడి చేస్తే పోలీస్ స్టేషన్ లో బాధిత వార్డు సభ్యుడు ఫిర్యాదు చేసిన తిరిగి వార్డు సభ్యుడి పైనే అక్రమ కేసు నమోదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే గ్రామాలలో అనేక అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏకపక్షంగా ఉండి చట్టరిత్యా న్యాయం చేయని పోలీసు అధికారుల సంగతి వారం రోజుల్లో చూడడం జరుగుతుందని ఘాటుగా విమర్శించారు. అదేవిధంగా బిఆర్ఎస్ కార్యకర్తలు పని నిమిత్తం పోలీస్ స్టేషన్ కు ఫోను చేస్తే పోలీసులు ఫోను ఎత్తడం లేదని చెన్నారావుపేట పోలీసు వారు ఏం చేస్తున్నారు... ఎక్కడెక్కడ ఎంత తిన్నారు అనేది మా దగ్గర పూర్తి లెక్కలతో సహ ఉన్నాయన్నారు. మావద్ద గూగుల్ పే ఫోన్ పే ఆధారాలు కూడా ఉన్నాయని ప్రతిదీ తేట తెల్లం చేస్తూ చట్టరీత్య వారం లోపే మీ సంగతి చూడడం జరుగుతుందని పోలీసు వారిని హెచ్చరించారు. అంతేకాక ఎస్సీ, ఎస్టీ కమిషన్, పోలీసు రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసి న్యాయస్థానాలకు ఈడుస్తామన్నారు. ఇప్పటికే చెన్నారావుపేట పోలీసులు చేస్తున్న అక్రమ కేసులు, ఆగడాల పై బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నివేదిక తయారవుతుందని ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టేది లేదన్నారు.



## గిన్నిస్ వరల్డ్ రికార్డు వేదికపై విజయ హై స్కూల్ విద్యార్థుల నృత్య ప్రదర్శన

**నిర్మల్ బ్యూరో, డిసెంబర్31 (జనంసాక్షి) :** హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో భారత్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి కళావైభవం?2 కార్యక్రమంలో భాగంగా జరిగిన సామూహిక నృత్య ప్రదర్శనలో విజయ హై స్కూల్ విద్యార్థులు ప్రతిభను చాటారు. గిన్నిస్ వరల్డ్ బుక్ రికార్డు లక్ష్యంగా నిర్వహించిన ఈ మహత్తర ప్రదర్శనలో పాల్గొని ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అల్లాడి శ్రీదిత్య ,అద్విక, ఎన్.ఆద్య, దేవిక ప్రసాద్ , అమిత్ , తనుశ్రీ, విద్యార్థులు కూచిపూడి నృత్యంతో చూపరులను ఆకర్షింపజేశారు. విద్యార్థుల విజయాన్ని పురస్కరించుకుని పాఠశాల కరస్పాండెంట్ మంచిరాల నాగభూషణం, ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి విద్యార్థులను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.

## నేడు బంగారు వర్తక సంఘం ఎన్నికలు

**నిర్మల్ బ్యూరో, డిసెంబర్31(,జనంసాక్షి)**

నిర్మల్ జిల్లా కేంద్రంలో బంగారు వర్తక సంఘం ఎన్నికలు సార్వత్రిక ఎన్నికలను సైతం మైమరిపించేలా రసవత్తరంగా కొనసాగుతున్నాయి. నూతన సంవత్సరం తొలిరోజైన జనవరి 1న స్థానిక సోఫీనగర్‌లోని విశ్వకర్మ భవనంలో ఈ ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం 208 మంది సభ్యులు ఉన్న ఈ వర్తక సంఘంలో ప్రతి ఓటు కీలకంగా మారింది. అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిలను ఓటు ద్వారా ఎన్నుకుంటారు. అధ్యక్ష పదవికి నలుగురు అభ్యర్థులు బరిలో ఉండటంతో పోటీ హోరాహోరీగా మారింది. గతంలో ఐదుసార్లు అధ్యక్షుడిగా సేవలందించిన కోటగిరి అశోక్‌తో పాటు శ్రీరామోజు బూపేష్, మేడారపు కళ్యాణ్, కొండాజీ నరేంద్ర చారి తదితరులు అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్నారు.

## ఇసుక రవాణాలో మిస్ యూజ్ చేస్తే చర్యలు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఇసుక మిస్‌యూజ్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, ఇసుకను దుర్వినియోగం చేసినట్లయితే సంబంధితులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్పష్టం చేశారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో ఎంపిడిఓలతో ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక రవాణా అంశంపై ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కూపన్లలో అక్రమ సవరణలు చేసినా, అక్రమ రవాణా జరిగినా ఎంపిడిఓలు కఠినంగా వ్యవహరించాల్సిందేనని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా ఇసుక సరఫరా జరగాలని సూచించారు. ఎక్కడైనా అక్రమాలు జరిగితే వెంటనే చర్యలు తీసుకుని నివేదికలు సమర్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ పిడి లోకిలాల్, ఎంపిడిఓలు పాల్గొన్నారు.

## సర్పంచులు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం కృషి చేయండి




**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి) :** నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచులు బేల మండలంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం కృషి చేయాలని పీ ఆర్ టీ యూ జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణ కుమార్ అన్నారు.బేల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు గ్రామ సర్పంచ్ లకు బుదవారం పాఠశాలలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి 21 గ్రామాల నుండి ఇటీవల ఎన్నికైన సర్పంచులను సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొమ్ము కృష్ణ కుమార్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాల హాజరయ్యే విధంగాచూడాలని, ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయడానికి మీ సహాయ సహకారాలు అందించాలని సర్పంచ్లను కోరారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచులు మాట్లాడుతూ ఇంత గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని పాఠశాల మౌలిక వసతులు,పాఠశాల అభివృద్ధికి జతమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు .ఈ కార్యక్రమంలో బేల సర్పంచ్ శ్రీమతి ఓలపు భాగ్యలక్ష్మి దేవన్న, ఉపసర్పంచ్ బేతం ప్రకాష్ రెడ్డి, బెదోడ సర్పంచ్ ట్రాక్టర్ అశోక్, డొప్టాల సర్పంచ్ వెంకటమ్మ రాకేష్, జూనోనీ సర్పంచ్ రేష్మ వివేక్, మనీయార్పుర్ సర్పంచ్ గంభీర్, రూపేష్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు పాఠశాల ఉపాధ్యాయులు సంజయ్, ఎలియా, ఆరె భాస్కర్, స్వామి నితిన్ కుమార్ పాల్గొన్నారు

## సర్పంచ్ గౌరవ వేతనం గ్రామ పంచాయతీకి కేటాయింపు



- జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన రంగయపల్లి సర్పంచ్ మండల రజిత మహేందర్,వ్యాపారవేత్త లక్కిరెడ్డి తిరుపతిరెడ్డి

భీమదేవరపల్లి, డిసెంబర్ 31(జనం సాక్షి) : భీమదేవరపల్లి మండలంలోని రంగయపల్లి గ్రామాన్ని జిల్లాలోనే ఉత్తమ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని రంగయపల్లి సర్పంచ్ మండల రజిత మహేందర్ తెలిపారు. ఈ క్రమంలో తనకు రానున్న సర్పంచి గౌరవ వేతనాన్ని పూర్తిగా గ్రామాభివృద్ధికి కేటాయిస్తానని పేర్కొంటూ హనుమకొండ జిల్లా కలెక్టర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త లక్కిరెడ్డి తిరుపతిరెడ్డి కూడా పాల్గొన్నారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచేందుకు తాను సిద్ధంగా ఉన్నానని సర్పంచ్ రజిత మహేందర్ తెలిపారు.ప్రభుత్వ పరంగా కూడా రంగయపల్లి గ్రామానికి అవసరమైన సహకారాలు అందించి జిల్లాలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా లక్కిరెడ్డి తిరుపతిరెడ్డి జిల్లా కలెక్టర్‌ను కోరారు. గ్రామాభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు సమిష్టిగా ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలకు జిల్లా పరిపాలన తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ ఎలబోయిన రజిత శ్రీనివాస్, మాజీ సర్పంచ్ చవ్వాల బుచ్చయ్య, మాజీ ఎంపీటీసీ సట్ల రఘుపతి,జిమ్మల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు సత్వరమే ఇళ్ల స్థలాలివ్వాలి

- కలెక్టర్ హామీ మేరకు తాత్కాలికంగా దీక్ష విరమణ



**నిర్మల్ బ్యూరో, డిసెంబర్31 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లా కేంద్రంలో పాత్రికేయులుగా విధులు నిర్వర్తిస్తున్న అర్హులైన పాత్రికేయులకు సత్వరమే ఇళ్ల స్థలాలను కేటాయించాలని నిర్మల్ ప్రెస్ క్లబ్ డిమాండ్ చేశారు. జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఇచ్చిన హామీతో పాటు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సానుకూలంగా స్పందించిన నేపథ్యంలో.. గత తొమ్మిది రోజులుగా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు బుధవారం ప్రకటించింది. పాత్రికేయులకు సాధ్యమైనంత త్వరగా ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు కృషి చేస్తామని బీజేఎల్పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి పేర్కొనడం, మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, డిసిసి మాజీ అధ్యక్షుడు శ్రీహరి రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్ అలీ, మున్సిపల్ మాజీ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి సహకరించిన నేపథ్యంలో.. నిర్మల్ ప్రెస్ క్లబ్ తొమ్మిది రోజులపాటు నిరాటంకంగా నిర్వహించిన రిలే నిరాహార దీక్షలకు తాత్కాలికంగా విరమణ ఇచ్చింది. మరోవైపు సాధ్యమైనంత త్వరగా తమకు ఇళ్ల స్థలాలను ఇవ్వాలని మరో మారు ప్రెస్ క్లబ్ విన్నవించింది. లేని పక్షంలో తమ నిరసనలను ఈసారి మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేసింది. తొమ్మిది రోజుల పాటు కొనసాగిన రిలే నిరాహార దీక్షలకు సంఘీభావం తెలిపిన పార్టీలు, సంఘాలు, నాయకులు, బాధ్యులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపింది.

## ఆదివాసీలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి):** ఆదివాసీలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజార్షి షా పిలుపునిచ్చారు. గుడిహత్నూర్ మండలంలోని గర్కంపేట్ గ్రామంలో బుధవారం ఆదివాసీలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్య, వైద్య రంగాల్లో ప్రభుత్వం అందిస్తున్న సేవలను నిర్లక్ష్యం చేయకుండా వినియోగించుకోవాలన్నారు. పిల్లలు బడిబయట తిరగకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రభుత్వ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్య అందేలా చూడాలని సూచించారు. అలాగే గుట్కా, తంబాకు వంటి దురలవాట్లను వీడి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. గర్భిణీలు, బాలింతలు తప్పనిసరిగా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే వైద్య సేవలు పొందాలని, జ్వరాలు వంటి అనారోగ్య సమస్యలకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆర్ఎంపీల వద్ద చికిత్స తీసుకోవద్దని స్పష్టం చేశారు. జిల్లాలో చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో గత రెండు నెలల నుంచే మారుమూల ఆదివాసీ గ్రామాలకు దుప్పట్లు పంపిణీ చేయాలని వివిధ శాఖల అధికారుల సహకారంతో ప్రణాళిక రూపొందించినప్పటికీ, ఎన్నికల కోడ్ కారణంగా కొంత జాప్యం జరిగిందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్, ఈవో మనోహర్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, మండల ప్రత్యేకాధికారి సునీత, డీపీవో రమేష్, ఎంపీడీవో ఇంతియాస్, ఎంపీవో దిలీప్, అధికారులు పాల్గొన్నారు.

# గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి ప్రణాళికాబద్ధ చర్యలు

- మంత్రి పొంగులేటి




**కల్లూరు, డిసెంబర్ 31 (జనం సాక్షి) :** గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికాబద్ధ చర్యలు చేపడుతుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం కల్లూరు మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి శంకుస్థాపన చేశారు. రూ. 2 కోట్లతో నారాయణపురం నుండి పేరువంచ వరకు బిటి రోడ్డు, రూ. 4 కోట్లతో నారాయణపురం నుండి కొర్లగూడెం ఆర్ అండ్ బి రోడ్ నుండి రామకృష్ణపురం వరకు బిటి రోడ్డు, రూ. 7 కోట్లతో పేరువంచ నుండి కుప్పనకుంట్ల వరకు బిటి రోడ్డు, రూ. 2 కోట్లతో కొత్త నారాయణపురం నుండి ఎన్ఎస్పీ కెనాల్ లిఫ్ట్ వరకు నిర్మించనున్న బిటి రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంఖుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా పేరువంచ గ్రామంలోగ్రామపంచాయతీ సర్పంచ్ కీసర నిర్మల మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూప్రజా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎటువంటి వెనుకడుగు వేయకుండా చర్యలు తీసుకుంటుందని అన్నారు. రాబోయే రోజుల్లో వందకు వంద శాతం ప్రతి గ్రామానికి అవసరమైన రోడ్లు, మౌళిక సదుపాయాల కల్పన చేస్తామని తెలిపారు. పేదలకు ఇచ్చిన ప్రతి మాట నెరవేర్చేందుకు ప్రభుత్వం పని చేస్తున్నదని, పేదలకు సన్న బియ్యం సరఫరా, కొత్త రేషన్ కార్డుతో పాటు పాత రేషన్ కార్డులో పేర్లను చేర్చడం, మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం, పిల్లలకు మంచి విద్య అందించాలనే లక్ష్యంతో గురుకులాల్లో 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీలు పెంచడం జరిగిందని అన్నారు. రైతును రాజు చేసే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం వచ్చిన మొదటి 9 నెలల్లోనే 21 వేల కోట్ల రూపాయలు 25 లక్షల రైతన్నలకు చెందిన రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేశామని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం మొదటి విడతలో నాలుగున్నర లక్షలు ఇండ్లు మంజూరు చేసిందని, ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లు ఇస్తూ, ప్రతి సోమవారం నాడు లబ్ధిదారులు కట్టిన ఇంటి లెవెల్ ననుసరించి చెల్లింపులు చేస్తున్నామని అన్నారు. వచ్చే ఏప్రిల్ నుండి రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరులు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఏసీపీ వసుంధర యాదవ్, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకుబ్, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, మిషన్ భగీరథ ఇఇ పుష్పలత, కల్లూరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నీరజ ప్రభాకర్, మండల తహసీల్దార్ సాంబ శివుడు, అగ్రికల్చరల్ ఏవో రూప, ఎంపీడీవో చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు. పేరువంచ సర్పంచ్. కీసర నిర్మల, ఉప సర్పంచ్ పరిమి కృష్ణవేణి. అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, కిసర మధుసూదన్ రెడ్డి,పోట్రు అర్జున్ రావు, బొల్లం రామారావ్, జంగా పిచ్చి రెడ్డి, లక్కిరెడ్డి ఏసు రెడ్డి, కిసర మోహన్ రెడ్డి, నల్లగట్ల పుల్లయ్య, కొండపల్లి మహేష్ కోట బన్నీ జోన బోయిన గోపాలరావు, పొంగులేటి రామిరెడ్డి, కొనకళ్ళ తిరుపతిరావు,తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి నాగేశ్వర్ రావును కలిసిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి



**తాండూరు, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు.బుధవారం హైదరాబాద్ లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి కలిసి తాండూరులో కొత్తగా నిర్మించే మార్కెట్ యార్డుకు అనుమతులు ఇవ్వాలని మంత్రిని కోరారు.ఇందుకుగాను మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు నిర్మాణ అనుమతులపై ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ప్రకటించారు. దీంతో తాండూరు మార్కెట్ యార్డు నిర్మాణానికి అడ్డంకులు తోలిగాయి.ఈ సందర్భంగా తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## బ్రూణ హత్యలకు పాల్పడుతున్న డాక్టర్‌లపై పీడీ యాక్ట్ నమోదు చేయాలి



**మిర్యాలగూడ, డిసెంబర్ 31 (జనం సాక్షి) :** ఆరు నెలల ఆడ గర్భస్థ శిశువును తల్లి గర్భంలోనే అబార్షన్ పేరుతో హత్య చేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్. బుధవారం స్థానికంగా మాట్లాడుతూ రెండు నెలల క్రితం విద్యానగర్లో చెత్త కుప్పలో ఉన్న ఆడ మృత శిశువు మృతదేహాన్ని కుక్కలు లాక్కెళ్తుండగా విషయం బయటపడగా, తిరిగి బుధవారం షాబునగర్లో మురికి కాలువలో ఆడ మృత శిశువు మృతదేహం వెలుగు చూడటం దారుణమన్నారు.అలా నెలలు నిండక ముందే లింగ నిర్ధారణ పరీక్షలు చేసే ఆసుపత్రులను మరియు స్కానింగ్ సెంటర్లను గుర్తించి ఆ యొక్క ఆసుపత్రులను రద్దుచేసి,ఆ డాక్టర్లపై పీడి యాక్ట్ కేసులు నమోదు చేయాలని లింగంగౌడ్ డిమాండ్ చేశారు.ఇలాంటి పరీక్షలు నిర్వహించిన, ప్రోత్సహించిన,సహకరించిన వారి అందరిపై చర్యలుతీసుకోవాలన్నారు. జిల్లా వైద్య శాఖ అధికారుల నిర్లక్ష్యం వలనే ఇలాంటి సంఘటనలు వరుసగా వెలుగుచూస్తూ న్నాయన్నారు.ఇప్పటికైనా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కోరారు .

## నట్టల నివారణ మందుల పంపిణీని సద్వినియోగం చేసుకోవాలి



**వెల్దండ, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** వెల్దండ మండల పరిధిలోని పశు వైద్య ఆధ్వర్యంలో రాఘయిపల్లి శంకర్ కొండ తండా బండోనిపల్లి గ్రామాలలో గొర్రెలకు మేకలకు నట్టల మందు పంపిణీ కార్యక్రమాన్ని పశు వైద్య అధికారి డాక్టర్ శ్యాంసుందర్ గ్రామ సర్పంచులు ప్రారంభించారు ఈ సందర్భంగా డాక్టర్ శ్యాంసుందర్ మాట్లాడుతూ మూగజీవాలైన మేకలు గొర్రెలు ఆరోగ్యంగా ఉండాలంటే నట్టల నివారణ మందులు తప్పకుండా వేయించాలని అన్నారు ఈ కార్యక్రమంలో రాఘయిపల్లి సర్పంచ్ సామ వెంకటయ్య బండోనిపల్లి సర్పంచ్ ఎనుముల సంగీత శేఖర్ రెడ్డి కొండల్ అల్వాల్ యాదవ్ రవీందర్ రైతులు శివకుమార్ రాములు బాలయ్య గోపాల్ మల్లేష్ పశు వైద్య సిబ్బంది నరసింహ ఫణిందర్ రెడ్డి తిరుపతయ్య గోపాలమిత్రలు మొగులయ్య సాయిబాబు బాలు విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కోసం ఆందోళన వద్దు

- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**పాపన్నపేట, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** మండల పరిధి లోని లక్ష్మీనగర్ లోని లక్ష్మీ గ్రోమోర్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.అ కేంద్రంలో నిల్వ ఉన్న ఎరువులు,విత్తనాల స్టాక్ వివరాలను రికార్డులను పరిశీలించారు. ఎరువుల నాణ్యత,నిల్వ విధానం,విక్రయ ధరలు ప్రభుత్వం నిర్ణయించిన విధంగా ఉన్నాయా లేదా అన్న అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఎరువులు సకాలంలో అందించాలని,అక్రమ నిల్వలు,అధిక ధరలకు విక్రయాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులు ఎవరైనా సమస్యలు ఎదుర్కొంటే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. యూరియా కోసం రైతులు ఎవరు ఆందోళన చెందొద్దనీ,రైతులకు సరిపడా యూరియా ప్రభుత్వం అందించడానికి సిద్ధంగా ఉందన్నారు. అక్టోబర్ 2025..జనవరి 26 సంవత్సరానికి మన జిల్లాకు 12.000 మెట్రిక్ టన్నుల యూరియా అవసరముంటుందని రాష్ట్రానికి ప్రతి పాదనలు పంపామన్నారు. డిసెంబర్ 30 నాటికి మెదక్ జిల్లాకు 12.663 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. 8.000 మెట్రిక్ టన్నుల యూరియా రైతులు ఇప్పటివరకు కొనుగోలు చేయడం కూడా జరిగిందనీ,ఇంకా జిల్లాలో 4.000 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. జిల్లాలో మన అవసరానికి మించి యూరియా జనవరి కి కూడా రాబోతుందనీ రైతులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. ఈసందర్భంగా మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస రాజు,విస్తరణ అధికారి జనార్ధన్ ఉన్నారు.

## మురికి కాలువలో మృతి చెందిన శిశువు లభ్యం

**మిర్యాలగూడ, డిసెంబర్ 31 (జనం సాక్షి) :** మానవత్వాన్ని మరిచిన ఓ మాతృమూర్తి తనకు జన్మించిన బిడ్డ ఆడశిశువు అని తెలిసి... అభం శుభం తెలియని ఆ నవజాత శిశువును నిర్దాక్షిణ్యంగా కవర్లో కట్టి మురికి కాలువలో పడేసిన సంఘటన బుధవారం నల్గొండ జిల్లా మిర్యాలగూడలో వెలుగు చూసింది. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మున్సిపాలిటీ కార్మికులు రోజువారి పనులలో భాగంగా ఉదయం షాపు నగర్ లో మురుగు కాలువలను శుభ్రపరుస్తున్న క్రమంలో ఒక కవర్లో చుట్టిన పెద్ద వస్తువుగా భావించి మున్సిపాలిటీ కార్మికుడు బయటకు తీశాడు. ఆ సమయంలో కవర్లో నుండి ఒక అవయవం బయటకు కనబడడంతో అనుమానం వచ్చి కవరు మొత్తం తీసి చూడగా బొడ్డుతాడు కోయకుండా ఉన్న నవజాత శిశువు మృతదేహం కనిపించింది. వెంటనే ఉన్నతాధికారులకు పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని నవజాత శిశువు మృతదేహాన్ని పరిశీలించారు. పరిసర ప్రాంత ప్రజలను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏమాత్రం దయ దాక్షిణ్యాలు లేకుండా ఆడబిడ్డ అని తెలిసి ఆ నవజాత శిశువును కర్కశకంగా మానవత్వాన్ని మరిచి మురుగు కాలువలో పడి వేయడం పట్ల పలువురు కంటతడి పెట్టారు. మృతి చెందిన నవజాత శిశువును పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## చిరు వ్యాపారుల నూతన కమిటీ ఎన్నిక



**మధిర, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** మధిర పట్టణంలోని చిరు వ్యాపారుల నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మిరియాల రమణ గుప్తా ఆధ్వర్యంలో జరిగిన చిరు వ్యాపారుల సమావేశంలో ఈ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. నూతన కమిటీ సభ్యులుగా పసుపులేటి నాగేంద్ర శ్రీనివాసరావు, కె శంకరమ్మ, ఆదిమూలం పుల్లారావు, చిన్నం స్వామి, పెగళ్లపాటి శ్రీనివాసరావుషేక్ రబ్బాని ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ వీధి వ్యాపారుల శాశ్వత పరిష్కారం కోసం మిరియాల రమణ గుప్త ఆధ్వర్యంలో ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. గత 30 సంవత్సరాల నుండి మధిర పట్టణంలో రోడ్లు వెంట బడ్డీ కోట్లు పెట్టుకొని జీవన సాగిస్తుండగా తొలగించడంతో జీవనం కోల్పోయామని వారు పేర్కొన్నారు. మాకు శాశ్వతంగా ఒక పరిష్కార మార్గం చూపించాలని వారు ఈ సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి శ్రీ మల్లు బట్టి విక్రమార్కని కోరుతున్నారు.

## నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ



**పోచంపల్లి, డిసెంబర్ 31 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలోని గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ అందించేందుకు భూదాన్ పోచంపల్లి మండలం జలాల్పూర్ గ్రామంలోని స్వామి రామానందతీర్థ రూరల్ ఇన్స్టిట్యూట్ లో పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వివిధ కోర్సులకు దరఖాస్తులు కోరుతున్నట్లు సంస్థ చైర్మన్ ఎన్. కిషోర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణా కేంద్రంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ డిజిటల్ మిత్ర (ఇంటర్మీడియట్), ట్యాలీ (బీకాం), ఆటోమొబైల్ (10వ తరగతి), ఎలక్ట్రీషియన్ మరియు సోలార్ ఇన్‌స్టాలేషన్ (ఐటీఐ), కంప్యూటర్ హార్డ్వేర్, సీసీటీవీ, సెల్‌ఫోన్ రిపేరింగ్ (10వ తరగతి), టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జర్దోజీ, క్విల్ట్ మేకింగ్ (8వ తరగతి) వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కోర్సులన్నీ ఉచిత నివాస, భోజన సౌకర్యాలతో నిర్వహించబడతాయని, 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు అర్హులని తెలిపారు. శిక్షణ వ్యవధి 3 నుంచి 6 నెలలు ఉంటుందని పేర్కొన్నారు. ఈ శిక్షణకు ఆసక్తి గల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికేట్లతో జనవరి 5, 2026 లోపు సంస్థలో హాజరు కావాల్సిందిగా సూచించారు. ఇతర వివరాలకు 9133908000, 9133908111, 9133908222, 9948466111 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

## మణుగూరు ఏరియాలో 90 శాతం బొగ్గు ఉత్పత్తి




**మణుగూరు, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** ఈ ఏడాది వర్షా ప్రభావం వల్ల బొగ్గు ఉత్పత్తి తగ్గిందని జనరల్ మేనేజర్ దుర్గం రామచంద్ర అన్నారు. బుధవారం జిఎం కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ... డిసెంబర్ నెలలో మణుగూరు ఏరియాలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 10 లక్షల 68 వేల టన్నులకు గాను 9 లక్షల 65 వేల 989 టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించారు. డిసెంబర్ నెలలో సాధించిన బొగ్గు ఉత్పత్తి 90 శాతం. అలాగే 01 ఏప్రిల్ 2025 నుండి 31 డిసెంబర్ 2025 వరకు ప్రొగ్రెస్సివ్ బొగ్గు ఉత్పత్తి 83 లక్షల 33 వేల500 టన్నుల లక్ష్యానికి గాను 77 లక్షల 99 వేల 972 టన్నులు సాధించడం జరిగింది. అనగా 94 శాతం సాధించడం జరిగింది. డిసెంబర్ నెలలో మణుగూరు ఏరియా 9 లక్షల 56 వేల 576 టన్నుల బొగ్గును రవాణా చేయటం జరిగింది. అలాగే 01 ఏప్రిల్, 2025 నుండి 31 డిసెంబర్ 2025 వరకు ప్రోగ్రెస్సివ్ గా 76 లక్షల 38 వేల 829 టన్నులు రవాణా చేశారు. డిసెంబర్ నెలలో ఓవర్ బర్డెన్ డిపార్ట్‌మెంటల్ గా 15 లక్షల క్యూబిక్ మీటర్లకు లక్ష్యానికి గాను 99 శాతం తో 14 లక్షల 86 వేల క్యూబిక్ మీటర్లు తీయటం జరిగింది. అలాగే పదవి విరమణ మెడికల్ ఉద్యోగులకు ఇతర చెల్లింపులు చేయటం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం బి. శ్రీనివాస చారి , ఏరియా ఇంజినీర్ ఆర్. శ్రీనివాస్, ఏరియా రక్షణ అధికారి వెంకటరామరావు, ఎం ఎన్ జి ఓసీ ప్రాజెక్ట్ అధికారి ఈ. శ్రీనివాస్ , ఏజిఎం(ఐఈడి) సిహెచ్ రాంబాబు, డిజిఎం(పర్సనల్) ఎస్. రమేశ్, డిజిఎం( ఫైనాన్స్) ఎం. అనురాధా, డీజిఎం (సివిల్) శివప్రసాద్, డివై.సిఎంఓ జ్యోతిర్మై, పర్యావరణ అధికారి జే. శ్రీనివాస రావు. ఏరియా సెక్యూరిటీ అధికారి కే. శ్రీనివాస్, డివై. ఎస్ఈ డివిఎస్ఎన్ ప్రవీణ్ , సీనియర్ పర్సనల్ అధికారి సింగు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన మంత్రి తుమ్మల



**ఖమ్మం, డిసెంబర్ 31 (జనం సాక్షి) :** రాష్ట్ర వ్యవసాయం, మార్కెటింగ్, సహకార, చేనేత ? టెక్స్‌టైల్స్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరం ప్రజల జీవితాల్లో ఆరోగ్యం, ఆనందం, విజయాలు, శాంతి నింపాలని ఆయన ఆకాంక్షించారు. గత సంవత్సరం ఎదురైన కష్టాలు, సవాళు కొత్త సంవత్సరంలో తొలగిపోయి, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు వెల్లివిరియాలని పేర్కొన్నారు. రైతులకు పంటలు సమృద్ధిగా పండాలని, మహిళలు అన్ని రంగాల్లో ముందంజ లో ఉండాలని, వారి భద్రత, గౌరవం కాపాడబడాలని పేర్కొన్నారు.

## విద్యార్థి హక్కుల కోసం ఎస్ఎఫ్ఐ పోరాటం




**మొయినాబాద్, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** విద్యార్థి పోరాటాల వేగుచుక్కగా నిలిచిన భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మొయినాబాద్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావాన్ని స్మరి స్తూ విప్లవ వీరుడు భగత్సింగ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జెండాను రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ 1970 సంవత్సరంలో కేరళ రాష్ట్రం త్రివేంద్రంలో స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలతో 'అధ్యయనం- పోరాటం' నినాదంతో ప్రారంభమైందన్నారు. నేడు దేశవ్యాప్తం గా 30 లక్షల సభ్యత్వంతో అతి పెద్ద విద్యార్థి సంఘంగా ఎదిగిందన్నారు. దేశంలో చదువుతున్న ప్రతి విద్యార్థికీ నాణ్యమైన, శాస్త్రీయమైన, ఉచిత విద్య అందాలనే లక్ష్యంతో ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మతోన్మాద బీజేపీ ప్రభుత్వం విద్యార్థులకు వ్యతిరేకంగా నూతన విద్యా విధానాన్ని అమలు చేస్తూ అశాస్త్రీయమైన, చరిత్రను వక్రీకరించే విద్యను ప్రవేశపెడుతోందని తీవ్రంగా విమర్శించారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చి రెండేండ్లు గడిచినా విద్యాశాఖకు మంత్రి నియమించకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. తక్షణమే రాష్ట్రానికి పూర్తి స్థాయి విద్యాశాఖ మంత్రిని నియమించి, పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్లు, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్ , ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల్ అధ్యక్ష కార్యదర్శులు , రేశ్వంత్,చరణ్ గౌడ్, ఉపాధ్యక్షులు , ఎండి. ఇర్ఫాన్, చేవెళ్ల మండల అధ్యక్ష కార్యదర్శులు, ఇర్ఫాన్, మాల చందు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నల్గొండ డీసీసీ అధ్యక్షుడికి అవమానం..

- మంత్రులు ఉన్న వేదిక పైకి వెళ్లకుండా అడ్డుకున్న సీఐ ఆదిరెడ్డి
- బీసీ నేతను అవమానిస్తున్నారని పార్టీ శ్రేణుల్లో అసహనం



**చండూరు, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** నల్గొండ జిల్లా కాంగ్రెస్ రాజకీయాల్లో విభేదాలు మరోసారి బయటపడ్డాయి. జిల్లా నూతన డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాస్ నేతకు ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన వేదిక దగ్గర పోలీసుల నుండి అవమానం ఎదురైంది. దీని వెనుక మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హస్తం ఉందనే అనుమానాలు పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతున్నాయి.చండూరు మండలం, తుమ్మలపల్లి గ్రామానికి చెందిన బిగ్ టీవీ స్టాఫ్ రిపోర్టర్ బోయపల్లి రమేష్ తండ్రి అయిన బోయపల్లి సురేందర్ గౌడ్ దశదిన కర్మ కార్యక్రమం అంగడిపేట శివారులోని బి.ఆర్సీ ఫంక్షన్ హాల్ లోజరిగింది. ఈ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాస్ నేత ముందుగానే హాజరయ్యారు. ఆ తర్వాత శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మాజీ మంత్రి దివంగత రాంరెడ్డి దామోదర్ రెడ్డి కుమారుడు సర్వోత్తమ్ రెడ్డి అక్కడికి చేరుకోగా.. కైలాస్ నేత వారిని సాదరంగా ఆహ్వానించారు. కొద్దిసేపటి తర్వాత మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అక్కడికి చేరుకున్నారు. స్వర్గీయ బోయపల్లి సురేందర్ గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించేందుకు మంత్రి కోమటిరెడ్డి, గుత్తా సుఖేందర్ రెడ్డి, సర్వోత్తమ్ రెడ్డి తదితరులు వేదికపైకి వెళ్లారు. వారి వెంటే వేదికపైకి వెళ్తున్న డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాస్ నేతను స్థానిక సీఐ ఆదిరెడ్డి అడ్డుకున్నారు. దీంతో మనస్థాపం చెందిన డిసిసి ప్రెసిడెంట్ పున్న కైలాష్ నేత పోలీసుల పైన ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి వెళ్లిపోయే వరకు కూడా సామాన్యుల పక్కన కూర్చోవాల్సిన పరిస్థితి వచ్చింది.అది ప్రభుత్వ కార్యక్రమం కాదు, పార్టీ కార్యక్రమం కూడా కాదు. కేవలం ఒక ప్రైవేట్ ఫంక్షన్ అయినప్పటికీ, సొంత పార్టీకి చెందిన జిల్లా అధ్యక్షుడిని పోలీసులు ఇలా అడ్డుకోవడం, వారి పట్ల జులుం ప్రదర్శించడం సరైంది కాదని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేదికపైకి వెళ్తున్న అందరినీ పంపించి, కేవలం పున్న కైలాస్ నేతను మాత్రమే ఆపడం వెనుక మంత్రి కోమటిరెడ్డి హస్తం ఉందని అక్కడ ఉన్న వారు చర్చించుకుంటున్నారు.తనకు జిల్లా అధ్యక్ష పదవి వచ్చినప్పటి నుంచి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కావాలనే కుట్రపూరితంగా వ్యవహరిస్తూ... తనను అవమానపరుస్తున్నారని పున్న కైలాస్ నేత ఆరోపిస్తున్నారు. తనపై జరుగుతున్న ఈ కుట్రలో పోలీసులు కూడా అత్యుత్సాహం ప్రదర్శించారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.విషయం పైన పున్న కైలాస్ నేత తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన వ్యక్తిని కాబట్టే తనని ఇలా అవమానిస్తున్నారు అంటూ.. పున్న కైలాస్ నేత చెప్పుకొస్తున్నారు.





## లాభాలతో 2025కి వీడ్కోలు..

**ముంబయి:** దేశీయ స్టాక్‌మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. నాలుగు రోజులుగా వరుస నష్టాలు చవిచూస్తున్న సూచీలు.. 2025 చివరి ట్రేడింగ్ సెషన్‌ను మాత్రం లాభాలతో ముగించాయి. ఓ వైపు విదేశీ మదుపర్ల విక్రయాలు కొనసాగుతున్నా.. మన మార్కెట్‌లో కొనుగోళ్ల ఉత్సాహం కనిపించింది. ఒక్క ఐటీ మినహా మిగిలిన అన్ని రంగాల షేర్లలో కొనుగోళ్లు నమోదయ్యాయి. దీంతో ఒక్కరోజులోనే మదుపర్ల సంపద రూ.4 లక్షల కోట్లు పెరిగింది. బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.472 లక్షల కోట్ల నుంచి రూ.476 లక్షలకు కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 84,793.58 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,675.08) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 750 పాయింట్లకు పైగా లాభపడి 85,437.17 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 545.52 పాయింట్ల లాభంతో 85,220.60 వద్ద ముగిసింది. నిఫ్టీ 190.75 పాయింట్ల లాభంతో 26,129.60 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 89.88గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, రిలయన్స్, యాక్సిస్ బ్యాంక్, టైటాన్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టీసీఎస్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, సన్‌ఫార్మా షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 61.44 వద్ద ట్రేడవుతుందగా.. బంగారం ఔన్సు 4321 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# తిరుగులేని క్రోమ్

**ఇంటర్నెట్ వినియోగంలో ఒక విప్లవం వస్తుందని, ఏఐ ఆధారిత బ్రౌజర్లు వెబ్ బ్రౌజింగ్ తీరును పూర్తిగా మార్చేస్తాయని గత రెండేళ్లుగా పెద్ద ఎత్తున చర్చ జరిగింది.ఓపెన్‌ఏఐ మద్దతు ఉన్న అట్లాస్, పెర్ప్లెక్సిటీ ఆధ్వర్యంలోని కామెట్, మైక్రోసాఫ్ట్ ఎడ్జ్‌లోని కోపైలట్ వంటివి సాంప్రదాయ బ్రౌజర్లకు ముగింపు పలుకుతాయని భావించారు. కానీ, 2025 ముగింపు దశకు చేరుకున్నా, గూగుల్ క్రోమ్ తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది.భారతదేశంలో సుమారు 90% బ్రౌజింగ్‌కుపైగా మార్కెట్ వాటాతో గూగుల్ క్రోమ్ అగ్రస్థానంలో ఉంది. ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్లలో క్రోమ్ డిఫాల్ట్ బ్రౌజర్‌గా ఉండటం, గూగుల్ ఖాతాతో ఉన్న విడదీయలేని అనుబంధం ఇందుకు కారణమని తెలుస్తుంది. ఒపెరా, సఫారీ వంటివి సింగిల్ డిజిట్ వాటాకే పరిమితం కాగా, ఎడ్జ్, ఫైర్‌ఫాక్స్ 1% కంటే తక్కువ స్థాయిలోనే ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా కూడా ఇదే ధోరణి కనిపిస్తోంది. క్రోమ్ 71% మార్కెట్ వాటాను కలిగి ఉండగా, యాపిల్ సఫారీ (15%) రెండో స్థానంలో ఉంది. ఏఐను ఉపయోగిస్తున్న ఇతర బ్రౌజర్లు ఇప్పటికీ నామమాత్రపు వాటాకే పరిమితమయ్యాయి.**



**జనంసాక్షి:**కేవలం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఉందనే కారణంతో వినియోగ దారులు తమ దశాబ్ద కాలపు అలవాట్లను మార్చుకోవడం లేదని నిపుణులు విశ్లేషిస్తున్నారు. దీనికిగల కారణాలు..జీమెయిల్, గూగుల్ డ్రైవ్, యూట్యూబ్ వంటి సేవలతో క్రోమ్ ఇచ్చే అనుభవం మరే బ్రౌజర్ ఇవ్వలేకపోతోంది.కొత్త ఏఐ బ్రౌజర్ అవసరం లేకుండానే గూగుల్ తన జెమిని(ఉపవిరిని) ఏఐని నేరుగా క్రోమ్‌లోకి ఎంబెడ్ చేసింది.సెర్చ్ సమ్మరీలు, రైటింగ్ అసిస్టెంట్, ట్యాబ్ ఆర్గనైజర్ వంటి ఫీచర్లను క్రోమ్ వినియోగదారులకు వారి పాత అలవాట్లను మార్చకుండానే అందుబాటులోకి తెచ్చింది.చాలా ఏఐ బ్రౌజర్లు క్రోమ్‌లానే పనిచేస్తున్నాయి. వినియోగదారులకు తమ పాస్‌వర్డ్‌లు, హిస్టరీ, బుక్‌మార్క్‌లను వదులుకుని కొత్త బ్రౌజర్‌కు వెళ్లడానికి బలమైన కారణాలు కనిపించడం లేదు. ఏఐ ఫీచర్లు ఇప్పుడు క్రోమ్ ఎక్స్‌టెన్షన్ల రూపంలో కూడా లభిస్తుండటం మరో కారణం.

**ఏఐ ఏజెంట్ వైపు..**

ప్రస్తుత ఏఐ బ్రౌజర్లు కేవలం సమాచారాన్ని క్రోడీకరించడానికి లేదా పోల్చడానికి మాత్రమే పరిమితమయ్యాయి. కానీ భవిష్యత్తులో బ్రౌజర్ల పాత్ర మారబోతోంది. వినియోగదారుడి తరఫున స్వయంగా పనులు చేసే (ఉదాహరణకు: టికెట్లు బుక్ చేయడం, షాపింగ్ చేయడం, షెడ్యూల్ మేనేజ్ చేయడం) అటానమస్ ఏజెంట్‌గా బ్రౌజర్ మారినప్పుడు మాత్రమే క్రోమ్‌కు నిజమైన పోటీ ఎదురవుతుందని వాదనలున్నాయి. బ్రౌజర్ అనేది ఒక విండోలా కాకుండా, ఒక పర్సనల్ అసిస్టెంట్‌గా మారినప్పుడు మాత్రమే మార్కెట్ వాటాలో మార్పులు వచ్చే అవకాశం ఉంది.

గిగ్ వర్కర్ల సమ్మె..

## స్విగ్గీ, జొమాటో ప్రోత్సాహకాలు?

**న్యూఢిల్లీ:**దేశవ్యాప్తంగా గిగ్ వర్కర్లు సమ్మె చేస్తున్న నేపథ్యంలో.., కం పెనీలు కార్యకలాపాలకు అంతరాయాలు కలగకుండా ఉం డేదుకు చర్యలు తీసుకున్నాయి. ఇందులో భాగంగానే..ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్‌లైన స్విగ్గీ ఉ జొమాటోలు పీక్ అవర్స్.. సంవత్సరాంతపు రోజులలో డెలివరీ కార్మికులకు అధిక ప్రోత్సాహకాలను ప్రవేశపెట్టాయి.జీతం, పని పరిస్థితులు, సామాజిక భద్రత లేకపోవడాన్ని నిరసిస్తూ డిసెంబర్ 25, డిసెంబర్ 31 తేదీలలో డెలివరీ వర్కర్ యూనియన్లు సమ్మెలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఈ ప్రోత్సాహకాల ప్రకటన వెలువడింది. సాయంత్రం 6 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల మధ్య రద్దీ సమయాల్లో జొమాటో డెలివరీ భాగస్వాములకు ఒక్కో ఆర్డర్‌కు రూ.120-150 చెల్లింపులను ఆఫర్ చేసినట్లు కార్మికులు.. ఈ విషయం తెలిసిన వ్యక్తులు పంపిన సందేశాలు చెబుతున్నాయి.తాజా ప్రోత్సాహకాల ప్రకారం.. డెలివరీ ఏజెంట్లు సగటున 3000 రూపాయల వరకు సంపాదించుకోవచ్చు. అంతేకాకుండా.. క్యాన్సిలేషన్లు లేదా ఆర్డర్ తీసుకోకపోయిన సందర్భాల్లో సాధారణంగా విధించే పెనాల్టీలను కూడా అమలు చేయబోమని హామీ ఇచ్చినట్లు సమాచారం. దీనిద్వారా.. ఎక్కువ మంది డెలివరీ ఏజెంట్లు పనికి రావాలని సంస్థలు ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. నూతన సంవత్సరం సందర్భంగా, స్విగ్గీ కూడా సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 12 గంటల మధ్య రూ. 2,000 వరకు పీక్-అవర్ ఆదాయాన్ని ప్రకటిస్తోంది.



## 10 నిమిషాల డెలివరీ.. సాంకేతిక ప్రగతా? శ్రమ దోపిడీనా?

**న్యూఢిల్లీ:**దేశంలోని ప్రధాన నగరాల్లో క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ లుగా ఉన్న బ్లింకిట్, జెప్టో, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్.. వంటి సంస్థలు పది నిమిషాల్లోనే వస్తువులను ఇంటి ముంగిటకు చేరుస్తున్నాయి.ఒకప్పుడు గంటలు, రోజులు పట్టే డెలివరీ ప్రక్రియ ఇప్పుడు నిమిషాల్లో ముగుస్తుంది. అయితే, ఈ మెరుపు వేగం వెనుక కొన్ని సామాజిక సమస్యలున్నాయని కొందరు అభిప్రాయపడుతున్నారు. దాంతో ఇది నిజంగా సాంకేతిక ప్రగతా లేక శ్రామిక దోపిడీకి కొత్త రూపమా? అనే చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో గిగ్ వర్కర్లు తమ హక్కుల కోసం దేశవ్యాప్తంగా నిరసనలు చేస్తున్నారు. అందుకు కొన్ని వర్కర్ యూనియన్లు మద్దతుగా నిలుస్తున్నాయి.భారతదేశంలో జనసాంద్రత ఎక్కువ. దాంతో శ్రామిక శక్తి చౌకగా లభిస్తుంది. ఈ రెండు అంశాలను పెట్టుబడిగా పెట్టుకుని క్విక్ కామర్స్ రంగం దూసుకుపోతోంది. డార్క్ స్టోర్స్.. అంటే కేవలం డెలివరీల కోసం మాత్రమే నిర్వహించే చిన్న గోదాములను నగరాల్లోని ప్రధాన ప్రాంతాల్లో ఏర్పాటు చేయడం ద్వారా ఈ సంస్థలు 10 నిమిషాల్లోనే వస్తువులను వినియోగదారులకు చేరవేస్తున్నాయి. 2024-25 నాటికి ఈ రంగం విలువ బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. సిబ్బందిపై ఒత్తిడి

సాధారణ లాజిస్టిక్స్ వ్యవస్థలో వస్తు పంపిణీ బాధ్యత వ్యవస్థ మొత్తానికి ఉంటుంది. కానీ, ఈ 10 నిమిషాల డెలివరీ మోడల్‌లో మొత్తం భారం డెలివరీ పార్ట్‌నర్, డార్క్‌స్టోర్ పికర్(నిర్వాహకులు)లపైనే పడుతోంది. ఇందులో ఒక యాప్ నిర్ణయించే సమయం, రూట్, రేటింగ్స్ రైడర్ భవిష్యత్తును నిర్ణయిస్తున్నాయి. చిన్న పొరపాటు జరిగినా జరిమానాలు, ఖాతా నిలిపివేత (అకౌంట్‌ డీయాక్టివేషన్) వంటి చర్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించయినా సరే సమయానికి చేరాలనే ఒత్తిడి వల్ల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. మనిషి ప్రాణం కంటే వేగమే ముఖ్యం అనే ధోరణి ఆందోళనకరం. ఇటీవల హైదరాబాద్‌లో గిగ్ వర్కర్లు చేపట్టిన సమ్మె ఈ వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపింది. వారి ప్రధాన డిమాండ్లు..

అల్ట్రా-ఫాస్ట్ డెలివరీ గడువులను తొలగించాలి. కనీస వేతనం, ప్రమాద బీమా కల్పించాలి. డార్క్ స్టోర్లలో తాగునీరు, వాష్‌రూమ్ వంటి కనీస సౌకర్యాలు ఉండాలి.పారదర్శకమైన ఫిర్యాదుల పరిష్కార వేదిక ఉండాలి.

సామాజిక ప్రభావం

ఈ 10 నిమిషాల డెలివరీ సంస్కృతి వినియోగదారుల్లో 'తక్షణ సంతృప్తి'అనే అలవాటును పెంచుతోంది. చిన్న వస్తువు కోసం కూడా యాప్‌పై ఆధారపడటం వల్ల ప్రజల్లో ప్రణాళిక నైపుణ్యాలు తగ్గుతున్నాయనే వాదనలున్నాయి. దశాబ్దాలుగా అందరూ ఉన్న వీధి చివర కిరాణా దుకాణాలు, మందుల షాపుల ఉనికికి ఇది ముప్పుగా పరిణమిస్తోందని కొందరు చెబుతున్నారు. గతంలో స్థానిక వ్యాపారులు వృద్ధులకు, ఇరుగుపొరుగు వారికి ఆత్మీయంగా సేవలు అందించేవారు, కానీ ఈ కార్పొరేట్ మోడల్ ఆ మానవీయ సంబంధాలను దూరం చేస్తోందనే అభిప్రాయాలు కూడా వ్యక్తం అవుతున్నాయి.

చట్టపరమైన రక్షణలు

భారత ప్రభుత్వం నూతన లేబర్ కోడ్‌ల్లో గిగ్ వర్కర్లను సామాజిక భద్రతా పరిధిలోకి తెచ్చింది. అయితే, 10 నిమిషాల డెలివరీ వంటి అత్యంత వేగవంతమైన పనుల వల్ల కలిగే శారీరక, మానసిక ఒత్తిడిని నియంత్రించే ప్రత్యేక నిబంధనలు ఇంకా పూర్తిస్థాయిలో అమలులోకి రాలేదు. రాజస్థాన్ వంటి రాష్ట్రాలు గిగ్ వర్కర్ల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలను తీసుకురావడం ఒక ఆశాజనక పరిణామం.కొందరు నిపుణుల అభిప్రాయం ప్రకారం.. 'ఒక వస్తువు కోసం 10 నిమిషాలు వేచి ఉండకపోవడం అభ్యంతరకరం. వృద్ధులకు అత్యవసర మందులు అందించడం గొప్ప విషయమే, కానీ ప్రతి చిన్న వస్తువుకూ అదే వేగాన్ని ఆశించడం సమంజసం కాదు. వేగం అనేది బాధ్యతతో కూడి ఉండాలి. మరొక మనిషి ప్రాణాలను పణంగా పెట్టి పొందే సౌకర్యం ఎప్పటికీ పురోగతి అనిపించుకోదు. భారతదేశం ఒక స్థిరమైన, మానవీయమైన పని సంస్కృతిని నిర్మించుకోవాలి. టెక్నాలజీ అనేది మనిషికి సేవ చేయాలి తప్ప, మనిషిని యంత్రంగా మార్చకూడదు'.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 6.30 | ₹ 6.32 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,23,950 (22 క్యారెట్లు) | ₹ 1,35,220 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,58,000



## ఎయిర్‌వేస్‌లో జాత్యహంకారం?

**ప్రయాణికురాలి మండిపాటు**

**నైరోబీ:** కెన్యాకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ కాష్మీర్ సయ్యద్‌కు విమాన ప్రయాణంలో ఘోర అవమానం ఎదురైంది. 'కెన్యా ఎయిర్‌వేస్‌'లో తాను ముందుగా బుక్ చేసుకున్న బిజినెస్ క్లాస్ సీటును తనకు కేటాయించకుండా, ఎకానమీ క్లాస్‌కు మార్చడంపై ఆమె తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు.దీనికి సంబంధించిన వీడియోను ఆమె సోషల్ మీడియాలో షేర్ చేయడంతో ఈ అంశం అంతర్జాతీయంగా మారింది.కాష్మీర్ సయ్యద్ తెలిపిన వివరాల ప్రకారం ఆమె గత వారంలో తన ప్రయాణం కోసం బిజినెస్ క్లాస్ టికెట్‌ను బుక్ చేసుకుని, నిర్ణీత సమయంలోనే చెక్-ఇన్ కూడా పూర్తి చేశారు. అయితే విమానం ఎక్కే సమయంలో సిబ్బంది ఆమెను ఎకానమీ క్లాస్‌కు వెళ్లాలని సూచించారు. వెంటనే ఆమె ప్రశ్నించగా, విమాన సిబ్బంది సరైన సమాధానం చెప్పకుండా, మప్పై నిమిషాల పాటు వేచి ఉండేలా చేశారని ఆమె ఆరోపించారు. స్థానిక కెన్యా పౌరురాలైన తనను కాదని, తన సీటును మెరుగుకు తెల్లజాతీయులకు కేటాయించారని ఆమె విమాన సిబ్బందిని నిలదీశారు.ఈ ఘటనకు సంబంధించిన వీడియోలో కాష్మీర్ సయ్యద్ సిబ్బందితో విమాన వాదించడం కనిపిస్తుంది. 'ఈ సీటు కోసం నేను డబ్బు చెల్లించాను. చెక్-ఇన్ చేశాను.. మరి నా సీటులో ఎవరు కూర్చుంటారు?' అని ఆమె విమాన సిబ్బందిని నిలదీశారు. దీంతో విమాన సంస్థ ప్రతినిధులు ఆమెకు రీఫండ్ ఇస్తామని లేదా తదుపరి విమానంలో పంపిస్తామని ఆఫర్ చేసినప్పటికీ, ఆమె వాటిని తిరస్కరించారు. ఇది కేవలం సాంకేతిక లోపం కాదని, స్పష్టమైన జాత్యహంకార వివక్ష అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వీడియో చూసిన నెటిజన్లు ఎయిర్‌లైన్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# దుబాయ్ ఇక మరింత ఖరీదు



**జనంసాక్షి:**

న్యూ ఇయర్- 2026 దుబాయ్‌లో ఉండే వారికి షాక్ ఇవ్వనుంది. ప్రపంచ వ్యాప్తంగా దుబాయ్ వచ్చే వారి సంఖ్య విపరీతంగా పెరిగడంతో అక్కడ అద్దెలు ఈ ఏడాది గరిష్ఠంగా పెరిగే అవకాశాలున్నాయని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.వాటితో పాటు విల్లాలు, ప్లాట్ల రేట్లు కూడా అధికంగా పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.దుబాయ్ అంటే కాస్ట్లీ లైఫ్‌కు పెట్టింది పేరు. ఆ నగరం కేవలం టూరిస్ట్ స్పాట్‌గానే కాకుండా షాపింగ్ కాంప్లెక్స్‌లు, సాంస్కృతిక వైభవం, సెక్యూరిటీ తదితర కారణాల రీత్యా దుబాయ్‌కి ప్రపంచం నలుమూలల నుండి పర్యాటకులు క్యూ కడుతుంటారు. ఈ నేపథ్యంలో 2026లో అక్కడ భవనాల అద్దెరెట్లు దాదాపు అరుశాతం పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు.పామ్ జుమేరా, దుబాయ్ హిల్స్, డౌన్‌టౌన్, దుబాయ్ మెరీనా వంటి ప్రాంతాలలో నివసించడానికి విదేశీయులు ప్రత్యేక ఆసక్తి కనబరుస్తున్నారని అందుచేత అక్కడ అద్దెలు ఈ ఏడాది మరింతగా పెరిగే అవకాశం ఉందని తెలిపారు. వీటితో పాటు సాధారణ ప్రాంతాలలో అద్దెలు సైతం గణనీయంగా పెరుగుతుండటంతో ఆ ప్రాంతంలో నివసిస్తున్న మధ్యతరగతి ప్రజలకు వీటిని చెల్లించడం అధిక భారంగా ఉండనున్నట్లు పేర్కొన్నారు.వీటితో పాటు గోల్డెన్ వీసా హోల్డర్లు, విదేశీ నిపుణుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండడంతో పాట్లు, విల్లాల అమ్మకాలకు అధిక డిమాండ్ ఏర్పడనున్నట్లు తెలిపారు.

## తైవాన్‌పై చైనా దూకుడు..

**గగనతల దిగ్బంధనం**

**హాంకాంగ్:** చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ(పీఎల్‌ఏ) మంగళవారం రెండో రోజు కూడా తైవాన్ జలసంధిలో భారీ సైనిక విన్యాసాలను కొనసాగించింది. తైవాన్ తమ భూభాగమేనని, ఎప్పటికైనా కలిపేసుకుంటామని చైనా కమ్యూనిస్ట్ ప్రభుత్వం ఎప్పటి నుంచో చెబుతోంది. ఈ నేపథ్యంలోనే సోమవారం నుంచి జస్టిస్ మిషన్ 2025 పేరుతో విన్యాసాలకు తెరతీసింది.తైవాన్‌కు బయటి నుంచి అందే ఎలాంటి మద్దతునైనా అడ్డుకునే సత్తా తమకుందని చూపేందుకు స్వయం పాలిత దీవిని దిగ్బంధనం చేసే లైవ్ ఫైర్ డ్రిల్స్ సాగిస్తోంది. ఇందులో పీఎల్‌ఏ సదరన్ థియేటర్ కమాండ్‌లోని దె?రస్త్రాయర్లు, ఫ్రిగేట్లు, యుద్ధ విమానాలు, బాంబర్లు పాల్గొంటున్నాయి. తైవాన్ ఉత్తరం వైపు మొదలుకొని దక్షిణ వైపు సముద్ర జలాలతోపాటు గగనతలాన్ని దిగ్బంధనం కొనసాగిస్తున్నాయి. తైవాన్ ఉత్తర ప్రాంతంపై లాంగ్ రేంజ్ క్షిపణులను ప్రయోగించం ద్వారా ఆశించిన ఫలితాలను రాబట్టినట్లు సదరన్ కమాండ్ తెలిపింది.కాగా, సోమవారం ఉదయం 6 నుంచి మంగళవారం ఉదయం 6 గంటల వరకు తమ దీవికి సమీపంలో చైనాకు చెందిన ఫైటర్ జెట్లు, బాంబర్లు కలిపి 130 విమానాలు, 14 మిలటరీ ఓడలు, 8 ఇతర షిప్పులు కనిపించాయని తైవాన్ తెలిపింది.




చైనాకు చెందిన కనీసం 90 విమానాలు జలసంధిలోని తైవాన్ గగనతల రక్షణ జోన్‌లోకి ప్రవేశించాయని పేర్కొంది. చైనా బెలూన్ కూడా సంచరించిందని తెలిపింది. చైనాలోని ఫుజియాన్ ప్రావిన్స్ నుంచి లాంగ్ రేంజ్ ఆర్టిలరీ విభాగం తమ ఉత్తర ప్రాంతంపై కాల్పులు జరిపిందని వివరించింది. తమ తీరానికి 44 కిలోమీటర్ల దూరం వరకు వీటి ప్రభావం కనిపించిందని వెల్లడించింది.

## గ్రెగ్ అబెల్ చేతికి బెర్క్‌షైర్ హాత్వే పగ్గాలు



**న్యూయార్క్:**ప్రపంచ పెట్టుబడి రంగంలో ఒక శకం ముగియబోతోంది. లెజెండరీ ఇన్వెస్టర్ వారెన్ బఫెట్ నుంచి బెర్క్‌షైర్ హాత్వే బాధ్యతలను గ్రెగ్ అబెల్ ఈ వారం చివరలో అధికారికంగా చేపట్టనున్నారు. 1962లో కేవలం ఒక చిన్న టెక్స్‌టైల్ మిల్లుగా ప్రారంభమైన బెర్క్‌షైర్‌ను నేడు ప్రపంచంలోనే అత్యంత విలువైన సంస్థల్లో ఒకటిగా నిలిపేందుకు బఫెట్ ఎంతో కృషి చేశారు. ఈ నేపథ్యంలో బఫెట్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడం అబెల్ ముందున్న అతిపెద్ద సవాలు.గత ఆరు దశాబ్దాల్లో బఫెట్ బెర్క్‌షైర్‌ను ఒక సామ్రాజ్యంగా మార్చారు. గీకో (ఇన్సూరెన్స్), నేషనల్ ఇండెమ్నిటీ వంటి బీమా సంస్థలు, డెయిరీ క్వీన్, బీఎన్‌ఎస్‌ఎఫ్(రైల్వే) రైల్ రోడ్ వంటి దిగ్గజ కంపెనీలను కొనుగోలు చేశారు. యాపిల్, కోకాకోలా, అమెరికన్ ఎక్స్‌ప్రెస్ వంటి సంస్థల్లో వారెన్ బఫెట్ చేసిన దీర్ఘకాలిక పెట్టుబడులు అపారమైన లాభాలను తెచ్చిపెట్టాయి. గత 20 ఏళ్లలో 60 బిలియన్ డాలర్లకు పైగా దానం చేసినప్పటికీ, బఫెట్ వ్యక్తిగత సంపద నేడు సుమారు 150 బిలియన్ డాలర్లుగా ఉంది.2018 నుంచి బెర్క్‌షైర్ కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్న 62 ఏళ్ల గ్రెగ్ అబెల్, బఫెట్ కంటే భిన్నమైన వ్యక్తిగా పేరు తెచ్చుకున్నారు. అబెల్ ఇటీవల నెట్ జెట్స్ సీఈఓ ఆడమ్ జాన్సన్‌ను కంపెనీ సర్వీస్, రిటైల్ విభాగాలకు హెడ్‌గా నియమిస్తూ సంస్థలో మూడో విభాగాన్ని సృష్టించారు. టాడ్ కాంబ్స్ నిష్క్రమణ, సీఎఫ్‌ఓ మార్క్ హాంబర్గ్ పదవీ విరమణ నేపథ్యంలో బఫెట్ కంపెనీలో కీలకంగా మారారు. సంస్థలో నాయకత్వ మార్పులు ఉన్నప్పటికీ బెర్క్‌షైర్ ప్రధాన సూత్రమైన 'వికేంద్రీకరణ' మారదని విశ్లేషకులు భావిస్తున్నారు.

ముందున్న సవాళ్లు

బెర్క్‌షైర్ ప్రస్తుతం 382 బిలియన్ డాలర్ల భారీ నగదు నిల్వ కలిగి ఉంది. ఇంత భారీ మొత్తాన్ని పెట్టుబడి పెట్టడానికి సరైన అవకాశాలు దొరకకపోవడం అబెల్ ముందున్న ప్రధాన సమస్య అని కొందరు చెబుతున్నారు. ఒకవేళ కొత్త కొనుగోళ్లు చేయలేకపోతే చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వాటాదారులకు డివిడెండ్లు చెల్లించాలని లేదా స్టాక్ బైబ్యాక్ చేయాలని పెట్టుబడిదారుల నుంచి ఒత్తిడి వచ్చే అవకాశం ఉంది. అయితే, బఫెట్ వద్ద ఉన్న 30 శాతం ఓటింగ్ పవర్ కారణంగా అబెల్‌కు ప్రస్తుతం ఎటువంటి ముప్పు ఉండకపోవచ్చు. బఫెట్ కంపెనీకి ఛైర్మన్‌గా కొనసాగుతూ, రోజూ కార్యాలయానికి వస్తూ సలహాలు ఇస్తానని ప్రకటించడం వాటాదారులకు ఊరటనిచ్చే అంశం.

## ప్రళయ్ టెస్ట్ విజయవంతం

**అత్యాధునిక టెక్నాలజీతో 2 క్షిపణులను రూపొందించిన డీఆర్‌డీఓ**

**చాందీపూర్(జనంసాక్షి):**అత్యాధునిక టెక్నాలజీతో డీఆర్‌డీఓ రూపొందించిన రెండు ప్రళయ్ క్షిపణుల టెస్ట్-ఫైర్ విజయవంతమైనట్లు రక్షణ శాఖ బుధవారంనాడు తెలిపింది. ఒడిశా చాందీపూర్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి ఉదయం 10.30 గంటలకు ఈ మిసైళ్లను ప్రయోగించారు. ఒకే లాంచర్ నుంచి వరుసగా వీటిని ప్రయోగించినట్టు రక్షణ శాఖ తెలిపింది. రక్షణ శాఖకు చెందిన పరిశోధన, అభివృద్ధి సంస్థ ఈ క్షిపణిని అభివృద్ధి చేసింది. ఆపరేషనల్ కండిషన్ల కింద యూజర్ ఎవల్యూషన్ ట్రయల్స్‌లో భాగంగా ప్రళయ్ క్షిపణులను ప్రయోగించినట్టు డీఆర్‌డీఓ ఓ ప్రకటనలో తెలిపింది. రెండు క్షిపణులు నిర్దేశిత పథంలో వెళ్లి లక్ష్యాలను చేరుకున్నట్టు పేర్కొంది. మిసైల్ లేట్ తుది దశ వెరిఫికేషన్ కూడా విజయవంతమైందని చెప్పింది.

## కాల గర్భంలోకి 400 ఏళ్ల చరిత్ర!

**ఉత్తరాలపై డెన్మార్క్ కీలక నిర్ణయం..**




**కోపెన్‌హాగన్:** ఆధునిక డిజిటల్ యుగం ప్రపంచంలోని అన్నింటినీ సమూలంగా మార్చివేస్తోంది. ఈ ప్రభావం పోస్టల్ విభాగంపై తీవ్రంగా పడింది. సుమారు నాలుగు శతాబ్దాల కాలంగా ప్రజల మధ్య వారధిగా నిలిచిన డెన్మార్క్ పోస్టల్ సర్వీస్ తాజాగా చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. దేశంలో భౌతిక రూపంలో ఉండే ఉత్తరాల పంపిణీని అధికారికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది.దాదాపు 400 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఈ వ్యవస్థ, మారుతున్న కాలానికి అనుగుణంగా తన సేవలను సమూలంగా మార్చుకుంటోంది. ఉత్తరాల పంపిణీ కోసం దశాబ్దాలుగా కొనసాగిన సార్వత్రిక సేవా బాధ్యత ఒప్పందం ముగియడంతో డెన్మార్క్ ఈ సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రజలు ఉత్తరాలు రాయడం తగ్గించడమే దీనికి ప్రధాన కారణం. గడచిన 20 ఏళ్లలో డెన్మార్క్‌లో ఉత్తరాల సంఖ్య ఏకంగా 90శాతానికి పడిపోయింది. స్మార్ట్‌ఫోన్లు, ఇమెయిల్స్, ఇతర డిజిటల్ సమాచార వ్యవస్థలు అందుబాటులోకి రావడంతో ప్రజలు కాగితంపై రాసే ఉత్తరాలకు దూరమయ్యారు.ఒకప్పుడు వేల సంఖ్యలో పోస్ట్‌మెన్‌లు వీధివీధిన తిరిగిన రోజులు ఉండేవి. ప్రస్తుతం ఉత్తరాలు మోయడం అనేది పోస్టల్ విభాగానికి ఆర్థికంగా భారంగా మారింది. దీంతో ప్రభుత్వం పోస్టల్ సేవలను కేవలం పార్సిల్స్, వ్యాపార సరుకుల పంపిణీకే పరిమితం చేయాలని నిర్ణయించింది. మరోవైపు డిజిటల్ విప్లవంలో డెన్మార్క్ అగ్రగామిగా ఉంది. ఈ నిర్ణయంతో డెన్మార్క్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా డిజిటల్ అవుతున్న దేశంగా మరోసారి నిరూపితమయ్యింది. ఇప్పటికే డెన్మార్క్‌లోని ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, ప్రజల మధ్య కమ్యూనికేషన్ అనేది దాదాపు 100శాతం మేరకు డిజిటల్ వేదికల ద్వారానే సాగుతోంది.

### గత ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలను అమలు పరుస్తూ...

# ఎన్నికలలో ఇచ్చిన హామీలను 80% అమలు చేసాం

## కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**కరీంనగర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 31(జనంసాక్షి):** కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బుధవారం రోజు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ తో పాటు పలువురు నాయకులతో కలిసి డిసిసి కార్యాలయంలో పత్రిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం మాట్లాడుతూ... గత ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలను అమలు పరుస్తూ మేము ఎన్నికల హామీలలో భాగంగా ఇచ్చిన హామీలను 80% వరకు అమలు చేస్తున్నామన్నారు. మహిళలందరికీ ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగదారులకు ఉచిత కరెంటు తోపాటు దేశంలో ఎక్కడా లేనివిధంగా రెండు లక్షల రైతు రుణమాఫీ చేయడం జరిగిందని, గతంలో 500 రైతు భరోసా ఇస్తే 1000 రూపాయలు అదనంగా చేసి రైతు భరోసా ఇచ్చి రైతు లకు అండగా నిలిచింది కాంగ్రెస్ ప్రభుతమన్నారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా నీళ్లు నిధులు నియామకా లలో అన్యాయం జరుగుతుందని చెప్పిన కేసీఆర్ వారి పాలనలో వీటి అమలు విషయం విస్మరించినప్పటికీ మేము అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే 60 వేల ఉద్యోగ నియామకాలు చేపట్టి నిరుద్యోగులను ఆదుకుందని, మా కాంగ్రెస్ ప్రభుత్వం అని పదేళ్ల టిఆర్ఎస్ పాలనలో పేదవా డికి ఒక రేషన్ కార్డు ఇచ్చిన పాపాన పోలేదు, మా ప్రభుత్వం ఏర్పడి అర్హులైన ప్రతి పేదవాడికి రేషన్ కార్డు అందజేయడ ంతో పాటు ధనవంతులు, తినే సన్నబియ్యాన్ని అందజేసి ప్రతి పేద వాడి కడుపు నింపుతున్నామని, బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఏ గ్రామంలో పేదవాడికి ఒక ఇల్లు కట్టించింది లేదు, ఇచ్చిన హామీ మేరకు మొదటి సంవత్సరంలోనే ప్రతి నియోజకవర్గం లో దాదాపు 3500 ఇందిరమ్మ ఇల్లు మంజూరి చేయడం జరిగిందని, ఇందులో 80 శాతానికి పైగా నిర్మాణం పూర్తయి గృహప్రవేశాలు చేసుకున్నారని ఇది మా చరిత్ర, ఇదంతా



మేము చేసిన అభివృద్ధి సంక్షేమానికి నిదర్శనమన్నారు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో పల్లెలన్నీ కాంగ్రెస్ పార్టీ వైపే తీర్పునిచ్చాయని, మరో ఒకటి రెండు మాసాలలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో పల్లెల్లో ఇచ్చిన తీర్పు కంటే రెట్టింపుగా మాకు అనుకూలంగా ఫలితాలు రానున్నాయని, తెలంగాణలో మెజారిటీ మున్సిపల్ స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోబోతుందని, ముఖ్యంగా కరీంనగర్ కార్పొరేషన్ లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తాం, జిల్లాలో మెజారిటీ మున్సిపల్ స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలవబోతుందన్నారు. నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో చొప్పదండి ఎమ్మెల్యేగా గెలుపొందిన నేను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి చొరవతో ఇటీవల 23 కోట్ల రూపా యలు విడుదల చేయించడం జరిగింది. వారం రోజుల్లో మరో 20 కోట్ల రూపాయలు విడుదల చేయించి నిర్వాసితులందరికీ న్యాయం చేయడంతో పాటు ప్రాజెక్టు పూర్తి చేస్తాం అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను కలిసి కొండగట్టు అంజన్న మా ఆరాధ్య దైవమని ఈ దేవాలయానికి మీరు కొంత సహాయం చేయాలని కోరడంతో పాటు ఆ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, నారా లోకేష్ కి, నేను లేఖలు రాయడం, దానికి అనుగుణంగా ప్రయత్నాలు చేయడం ద్వారా కొంత ఆలస్యమైనప్పటికీ పవన్ కళ్యాణ్ స్పందించి దాదాపు 36 కోట్ల రూపాయలు కొండగ ట్టు ఆలయానికి కేటాయించినారని, 100 గదుల వసతి గృహం తో పాటు మాల విరమణ మండపం కట్టిస్తామని హామీ ఇచ్చినా రన్నారు. చొప్పదండి నియోజకవర్గం ప్రజల పక్షాన పవన్ కళ్యాణ్ కి, ఆ రాష్ట్ర ప్రభుత్వానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞత లు తెలియజేస్తున్నానని తెలిపారు. మరో మూడు సంవత్స రాలలో చొప్పదండి నియోజకవర్గాన్ని ఒక మోడల్ హబ్ గా రాష్ట్రంలో చర్చించుకునే విధంగా తీర్చి దిద్దబోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షులు ఎండి తాజ్, బానోతు శ్రావణ్ నాయక్, కొరివి అరుణ్ కుమార్, పురం రాజేశం, ముత్యం శంకర్ గౌడ్, పత్తి మధుకర్ రెడ్డి, వెన్నం రజిత రెడ్డి, పంజాల కృపాసాగర్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, రోళ్ల సతీష్, మిరాజ్, మంద మహేష్ పాల్గొన్నారు.

# నూతన సంవత్సరం టీఆర్పీలో చేరికలు జోష్



- మండల మహిళ అధ్యక్షులు పల్లవి ఆధ్వర్యంలో చేరికలు
- కండువాలు కప్పి ఆహ్వానించిన రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు
- మహిళలు ముందు వరుసలో ఉండాలన్న అరుణ సూచన
- జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ని సన్మానించిన అఖిల్ పాషా

**కరీంనగర్ డిసెంబర్ 31 (జనంసాక్షి):** కరీంనగర్ జిల్లా టీఆర్పీ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ గంగాధర మండల మహిళా అధ్యక్షురాలు జింక లావణ్య ఆధ్వర్యంలో పలువురు మహిళలు భారీగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ లో చేరారు. వారికి ఆన్లైన్ లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేసిన అనంతరం పార్టీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా, జిల్లా అధ్యక్షులు గంగిపెల్లి అరుణ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానం పలికారు. అనంతరం కరీంనగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమితులైన షేక్ చాంద్ పాషా గారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గంగిపెల్లి అరుణ పార్టీ నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ మండల , గ్రామ కమిటీల నిర్మాణం వేగవంతం చేయాలని అన్నారు. పార్టీలో పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని తెలిపారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా నూతన సభ్యులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల విషయంలో బిసిలకు తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. గత కొన్నేళ్లుగా అగ్రవర్ణాలు పెత్తనం చేలాయించి ఎస్సి, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అన్యాయం చేసారని మండిపడ్డారు. టీఆర్పీ పార్టీ అధికారంలోకి రాగానె మొట్ట మొదట ఈడబ్ల్యూఎస్ కోటను రద్దు చేయిస్తామని చెప్పుకొచ్చారు. ఇన్నెండ్ల అగ్రవర్ణాల పాలన బిసిలకు ఏరోజు కూడా ఎలాంటి రంగాలలోనైనా న్యాయం చేయలేదని అన్నారు. బీసీ రాజ్యాధికారం సాదించుకోవడం టీఆర్పీ పార్టీ తోనే సాధ్యమైతుందని తెలిపారు. మహిళలు టీఆర్పీ పార్టీలో పెద్ద ఎత్తున చేరాలని, మహిళల పాత్ర పార్టీలో కీలకమైనదని అన్నారు. మేమెంతో మాకంత అనే నినాదంతో ప్రజా క్షేత్రంలోకి పార్టీ వెళ్తుందని, అగ్రవర్ణాల దోపిడీని అరికట్టేలా పార్టీ శ్రేణులు కష్టపడాలని తెలిపారు. పార్టీలో చేరిన నూతన సభ్యులు కొలపాక విజయ, అంజిలు పార్టీ బలోపేతానికి ముందు వరుసలో ఉండాలని అఖిల్ పాషా సూచన చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గంగిపెల్లి అరుణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, జిల్లా మహిళ అధ్యక్షులు విజయ లక్ష్మి, మహిళా టౌన్ ప్రెసిడెంట్ జింక లావణ్య,, జిల్లా మహిళ కార్యదర్శి ఇశ్రత్ శావాలి, జిల్లా మైనారిటీ ప్రధాన కార్యదర్శి అంకుష్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ మహబూబ్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం అందించాలి

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ రూరల్, డిసెంబర్ 31 (జనంసాక్షి):** జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేద ప్రజలకు కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ వైద్య ఆరోగ్య శాఖపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఏడాది కాలంలో జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి, ప్రసూతి ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలు తదితర అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు అందించిన వైద్య సేవల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇన్‌పేషెంట్, అవుట్‌పేషెంట్ సేవలు, ఇతర వైద్య సదుపాయాలు, ఆసుపత్రుల్లో కల్పించిన మౌలిక వసతులపై సమీక్షించారు. ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మరింత మెరుగైన వైద్యం అందేలా అన్ని స్థాయిల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా వైద్య కళాశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులు 99 శాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమని పేర్కొంటూ విద్యార్థులు, అధ్యాపకులను అభినందించారు. రానున్న రోజుల్లో కూడా మెరుగైన బోధన అందిస్తూ ఇలాంటి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాలలో మౌలిక సదుపాయాల పనులు ఏవైనా పెండింగ్‌లో ఉంటే వెంటనే పూర్తి చేసి విద్యార్థులకు అనుకూల వాతావరణంలో విద్యాభ్యాసం చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం గ్రామీణ ప్రజల కోసం వారి నివాస ప్రాంతాల్లోనే క్షయ వ్యాధిని గుర్తించే పోర్టబుల్ ఎక్స్‌రే యంత్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు క్షయ వ్యాధి నిర్ధారణలో ఈ యంత్రం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. దీని ద్వారా ప్రజలకు ప్రయాణ భారం తగ్గి, వేగంగా చికిత్స ప్రారంభించేందుకు అవకాశం కలుగుతుందని అన్నారు. యంత్రం పనితీరును అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాజేందర్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఓరుగంటి శ్రీనివాస్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గోపాల్ సింగ్, సరోజ, సురేష్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆగయ్య కుటుంబానికి ఏపీ సీఎం అండ

### రూ.5 లక్షలు ఆర్థిక సహాయం

**కరీంనగర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 31(జనంసాక్షి) :** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఇటీవల మృతి చెందిన ఎన్‌టిఆర్ అభిమాని, తెలుగుదేశం పార్టీ కార్యకర్త, కరీంనగర్‌కు చెందిన కళ్యాడపు ఆగయ్య కుటుంబానికి రూ.5 లక్షలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. పొలిట్‌బ్యూరో సభ్యులు, జాతీయ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు జాతీయ పార్టీ అధ్యక్షులు ప్రకటించిన రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని కళ్యాడపు ఆగయ్య కుమారుడు కళ్యాడపు నరేష్ , కోడలు కళ్యాడపు రవళిలకు బుధవారం ఎన్‌టిఆర్ భవన్‌లో అందజేశారు. ఈ సందర్భంగా బక్కని నర్సింహులు మాట్లాడుతూ... కళ్యాడపు ఆగయ్య ఎన్‌టిఆర్ కు వీర అభిమానిగా, పార్టీలో కార్యకర్తగా క్రమశిక్షణతో పనిచేస్తూ ముక్కుసూటిగా మాట్లాడేవారని అన్నారు. ఆయన మృతి ఎవరూ భర్తీ చేయలేరని అన్నారు. జాతీయ పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు కళ్యాడపు ఆగయ్య కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారని అన్నారు. తెలుగుదేశం పార్టీ తరపున 2014లో 15 మంది ఎమ్మెల్యేలు, 2018లో ఇద్దరు ఎమ్మెల్యేలు గెలుపొందగా వీరందరినీ కేసీఆర్ తమ పార్టీలోకి తీసుకుని తెలుగుదేశం పార్టీయే తెలంగాణలో ఉండకూడదనే విధంగా ఆలోచించిన కేసీఆర్‌కు 2023 ఎన్నికలలో ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు. కేసీఆర్ ఇప్పుడు మళ్లీ చంద్రబాబు, తెలుగుదేశం పార్టీ పేరు చెప్పి మళ్లీ అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తుండటం ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతం కావడం ఖాయమని అన్నారు. భారత దేశంలో ఏ రాజకీయ పార్టీ చేయనంతగా ఎన్‌టిఆర్ ట్రస్ట్ ద్వారా ప్రజలకు సేవలందిస్తుం డటం జరుగుతు న్నదని అన్నారు. నారాలోకేష్ మొట్టమొదటిసారిగా 'కార్యకర్తల సంక్షేమ నిధి' నిఏర్పాటు, ఇన్సూరెన్స్‌ను రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచడం జరి గింద ని అన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రారంభించిన ఈ కార్యక్ర మాలను ఇతర పార్టీలు కూడా అనుసరిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ వంచ శ్రీనివాస్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు నెల్లూరి దుర్గాప్రసాద్, జనగామ నర్సిం గ్‌రావు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా పార్టీ మాజీ ఉపాధ్యక్షులు రొడ్డ శ్రీనివాస్, కరీంనగర్ పార్లమెంట్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి తీగుట్ల రమేష్ పాల్గొన్నారు.



### రాష్ట్ర ప్రజలందరికీ

# నూతన సంవత్సర శుభాకాంక్షలు

### రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**కరీంనగర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 31(జనంసాక్షి) :** రాష్ట్ర ప్రజలకు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నూతన సంవ త్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 2025 సంవత్సరంలోని తీపి జ్ఞాపకాలు, సాధించిన అంశాల ను , ఈ 2026 నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరికి మరిన్ని విజయాలు సాధించాలని ప్రార్థించారు. కొత్త సంవత్సరం ప్రతి కుటుంబానికి ఆరోగ్యం, ఆనందం, శాంతి, సమృద్ధిని తీసుకురా వాలని ఆకాంక్షించారు. ప్రజా పాలన ప్రభుత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో యువతకు మరిన్ని అవకాశాలు పెరిగి, రైతులు, కార్మికులు, మహిళ లు, విద్యార్థులు అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ముందుకు సాగాలని కోరుకుంటున్నానని, అందరం ఐక్యతతో, ఆశావహ దృక్పథంతో కొత్త సంవత్సరాన్ని స్వాగతిస్తూ, రాష్ట్ర ప్రగతికి కలిసి కట్టుగా కృషి చేద్దామని పేర్కొన్నారు.

# వైద్యులు సమయ పాలన పాటించాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**గోదావరిఖని, డిసెంబర్ 31 (జనంసాక్షి):** వైద్యులు సమయ పాలన పాటించాలని లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి తెలిపారు. బుధవారం (రామగుండం) గోదావరిఖని జనరల్ ఆసు పత్రిని లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,లి గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలో వైద్యులు సమయ పాలన పాటిస్తూ విధులకు తప్పకుండా హాజరుకావాలని ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జనరల్ ఆసుపత్రి లోని క్రిటికల్ కేర్, ఆర్థోపెడిక్ సర్జరీ బ్లాక్ లను కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల నుంచి తమకు ఎటువంటి ఫిర్యాదులు రాకుండా వైద్య సిబ్బంది సేవలు అందిం చాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దయాళ్ సింగ్, డాక్టర్‌లు కృపా బాయి, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.



# ఇష్టానుసారంగా కూల్చివేతలు

- అక్రమ కూల్చివేతలపై మున్సిపల్ కమిషనర్ పై చర్యలు తీసుకోండి
- జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



**గోదావరిఖని, జనంసాక్షి :** గత రెండు సంవత్సరాలుగా రామగుండం నియో జకవర్గంలో చట్టాన్ని తుంగలో తొక్కుతూ ఇష్టానుసారంగా దుకణాల కుల్చివేతలు జరిగుతున్నయని అక్రమ కూల్చివేతలపై రామగుండం మున్సిపల్ కమిషనర్ అరుణ శ్రీ పై చర్యలు తీసుకోవాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గారు అన్నారు. బుధవారం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాల యం లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మున్సిపల్ కమిషనర్ పై మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గారు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ ప్రాంతంలో 43 మైసమ్మ గుళ్లను కుల్చివేసారని ఇప్పటివరకు బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకో లేదన్నారు. చిరు వ్యాపారుల దుకాణాలకు ఎలాంటి నష్టపరి హారం చెల్లించకుండా జీవితాలను రోడ్డుపై పడవేసారని అన్నారు. అక్రమ కుల్చివేతలు చేపడుతున్న కమిషనర్ అరుణ శ్రీ పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీ.ఆర్.ఎస్ పార్టీ నా యకులు పర్లపల్లిరవి, నారాయణదాసు మారుతి, నీరటీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# గిన్నిస్ రికార్డు

## నృత్యంలో ఆకట్టుకున్న సాన్వి ప్రదర్శన



**నిర్మల్ రూరల్, డిసెంబర్ 31, (జనంసాక్షి):** నిర్మల్ జిల్లా కేంద్రంలోని రోహిదాస్ రజిత దంపతుల కుమార్తె సాన్వి జే వి ఎన్ ఆర్ స్కూల్ నిర్మల్ హైదరాబాద్లోని భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిం చిన కూచిపూడి కళావైభవం కార్యక్రమంలో కూచిపూడి నృత్య ప్రదర్శనలో భాగంగా అద్భుతమైన నృత్య ప్రదర్శనతో ప్రేక్షకులను ఆకట్టుకుని అలరించింది. ఒకేసారి వేలాది మంది కళాకారులతో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా గిన్నిస్ రికార్డు సాధించడంతో నిర్వాహకులు విద్యార్థిని సాన్వి కి గిన్నిస్ రికార్డు సర్టిఫికెట్ తో పాటు ప్రత్యేక బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా గిన్నిస్ రికార్డు నృత్యంలో పాల్గొన్న ఈ చిన్నారి సాన్విని పలువురు అభినందించారు.

# కరీంనగర్ కార్పొరేషన్‌పై కాషాయ జెండా ఎగరేసి తీరుతాం

- సర్వే ఆధారంగా గెలుపు గుర్రాలకే టికెట్లు
- మున్సిపాలిటీల్లో జరుగుతున్న అభివృద్ధి అంతా కేంద్ర నిధులతోనే..
- కార్పొరేషన్ , మున్సిపాలిటీలు బీజేపీకి అప్పగిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తా
- మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

**కరీంనగర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 31(జనంసాక్షి):** రాబోయే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ తోపాటు తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మున్సిపాలిటీల్లో కాషాయ జెండా ఎగరేయడమే బీజేపీ ముందున్న లక్ష్యమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈసారి కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుని తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. టిక్కెట్ల విషయంలో పైరవీలు, మొహమాటాలకు తావులేదని, సర్వే రిపోర్టుల ఆధారంగా గెలుపు గుర్రాలకే పార్టీ నాయకత్వం బీజేపీ టిక్కెట్లు కేటాయిస్తుందని స్పష్టం చేశారు. టిక్కెట్ల కోసం తనతోపాటు తన కుటుంబ సభ్యులకు ఫోన్లు కూడా చేయొద్దని, ఎవరైనా ఒత్తిడి తెస్తే వాళ్లకు వచ్చే టిక్కెట్లు కూడా రావని హెచ్చరించారు. టిక్కెట్ ఆశించడంలో తప్పు లేదని, గెలవలేని పరిస్థితి ఉన్నప్పుడు అర్థం చేసుకుని పార్టీ గెలుపు కోసం పనిచేయాలని సూచించారు. టిక్కెట్లు రాకపోయినా పార్టీ పరంగా, నామినేటెడ్ పోస్టుల పరంగా వారికి న్యాయం చేస్తామన్నారు. ఈసారి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఎక్కువ మంది నామినేటెడ్ పోస్టులు దక్కేలా



క్రుషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల సందర్భంగా టిక్కెట్ల కోసం, ఇతరత్రా విషయాల్లో గొడవలకు దిగే నాయకులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని, వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులను కోరారు. టిక్కెట్లు రాలేదనే కోపంతో పార్టీని వదిలివెళ్లాలనుకునే వారి రాజకీయ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఈసారి తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని, రాజకీయ భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకోవద్దని సూచించారు. తనకు పార్టీ గెలుపు, పార్టీ ప్రయోజనాలే ముఖ్యమని, ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. బ్లాక్ మెయిల్ కు బెదిరింపులకు బండి సంజయ్ లొంగే రకం కాదని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం రోజు కరీంనగర్ లోని త్రిధా హోటల్ లో కరీంనగర్ కార్పొరేషన్ తోపాటు హుజూరాబాద్, హుస్నాబాద్, జమ్మికుంట, చొప్పదండి మున్సిపాలిటీల్లోని పట్టణ, జోన్ల అధ్యక్షులు, ముఖ్య నాయకులతో 'మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం' నిర్వహించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, మాజీ అధ్యక్షులు బాస సత్యనారాయణ, మాజీ మేయర్లు సునీల్ రావు, డి.శంకర్, డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్, వాసాల రమేశ్, రాజేంద్రప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులను ఉద్దేశించి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ... ఎన్నికల్లో టిక్కెట్లు ఇప్పిస్తానని ఎవరైనా హామీ ఇచ్చినా నమ్మొద్దని, సర్వే ఆధారంగా గెలిచే అవకాశమున్న వాళ్లకు మాత్రమే టిక్కెట్లు వస్తాయని పార్టీ నాయకత్వం మాత్రమే టిక్కెట్లు ఇస్తుంది. ఈ విషయంలో ఎవరి మాటలు నమ్మి మోసపోవద్దు. కరీంనగర్ తోపాటు అన్ని మున్సిపాలిటీల్లో బీజేపీకి మంచి వాతావరణం ఉందన్నారు. ప్రజలంతా బీజేపీవైపు చూస్తున్నారని ఈసారి కరీంనగర్ కార్పొరేషన్ పై కాషాయ జెండా ఎగరేసి తీరుతామని, ఇతర మున్సిపాలిటీల పీఠాలను సైతం బీజేపీ గెలుచుకునేలా చేస్తామని, ప్రజలంతా బీజేపీవైపు చూస్తున్నారని బీజేపీ నాయకులు, ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే నాయకులు మాత్రం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలి. టిక్కెట్లు రానివారికి పార్టీ, నామినేటెడ్ పదవుల్లో సర్దుబాటు చేస్తాం. ఆవేశంతో రాంగ్ స్టెప్ వేస్తే రాజకీయ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది. ఎన్నికల సమయంలో గొడవలు పెట్టుకునే నేతలను ఉపేక్షించబోం. వెంటనే షోకాజ్ నోటీసు జారీ చేస్తాం. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ అభివృద్ధి విషయంలో పదేళ్లలో బీఆర్ఎస్, రెండేళ్లలో కాంగ్రెస్ చేసిందేమీ లేదు. కేంద్ర నిధులతోనే ఆయా మున్సిపాలిటీల్లో అభివృద్ధి జరుగుతోంది. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో కార్పొరేషన్, మున్సిపాలిటీలకు ఇచ్చింది గాడిద గుడ్డు మాత్రమే. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారం లేని బీఆర్ఎస్ కు ఓటేస్తే డ్రైనేజీలో వేసినట్లే. ఈ నేపథ్యంలో కరీంనగర్ కార్పొరేషన్ సహా మున్సిపాలిటీలన్నింటినీ బీజేపీకి అప్పగిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చూపిద్దాం. ఇదే విషయాన్ని మీరు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లండి. ఇంటింటికీ వెళ్లి బీజేపీకి ఓటేసేలా ప్రచారం చేయండి. మున్సిపల్ ఎన్నికల్లో పెద్ద ఎత్తున బోగస్ ఓట్లు ఉన్నాయని వార్తలు వస్తున్నాయని, వెంటనే ఓటర్ల ముసాయిదా జాబితాను డివిజన్లు, వార్డుల వారీగా సేకరించి ఇంటింటికీ వెళ్లి పరిశీలించండి. బోగస్ ఓట్లు ఉంటే వెంటనే ఫిర్యాదు చేయండి.

# గోల్డెన్ అవర్‌లో వైద్య సహాయం అందిస్తే రోడ్డు ప్రమాద మరణాలు తగ్గుతాయి

- ప్రమాద బాధితులను ఆసుపత్రికి చేర్చిన వారికి రూ.25 వేల నగదు బహుమతి
- జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి , డిసెంబర్ 31 (జనంసాక్షి) :** రోడ్డు ప్రమాదాలకు గురైన బాధితులకు మొదటి గంటలోపు (గోల్డెన్ అవర్) సరైన వైద్య సహాయం అందిస్తే, రోడ్డు ప్రమాదాల్లో జరిగే మరణాలను చాలా వరకు తగ్గించవచ్చని మేడ్చల్?మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా బుధవారం మేడ్చల్?మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ మినీ మీటింగ్ హాల్ లో జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రోడ్డు సేఫ్టీ డీసీపీ మనోహర్‌తో కలిసి అదనపు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రమాదాలకు గురవుతున్న ప్రాంతాలు, మరమ్మత్తులు అవసరమైన రోడ్ల వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. గత సమావేశంలో గుర్తించిన సమస్యలు ఎంతవరకు పరిష్కారమయ్యాయి, ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయన్న అంశాలపై అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులను, మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాద బాధితులను గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి చేర్చిన వారికి 'రాహ్‌వీర్' పథకం కింద రూ.25 వేల నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం అందజేస్తామని తెలిపారు. అవసరమైన చోట ఎలక్ట్రిక్ పోల్స్‌ను మార్చి రోడ్డు విస్తీర్ణం పెంచాలని, రోడ్డు ఇరువైపులా అక్రమ ఆక్రమణలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్లను గుర్తించి తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. రోడ్లపై వర్షపు నీరు నిలువకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, తరచూ ప్యాచ్ వర్క్ చేయకుండా అవసరమైన చోట కొత్త రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా రోడ్డు సేఫ్టీ డీసీపీ మనోహర్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాద బాధితులకు ఏడు రోజుల వరకు నగదు రహిత ఉచిత వైద్య చికిత్స అందించనున్నట్లు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో గోల్డెన్ అవర్‌లో చికిత్స అందించి బాధితుల ప్రాణాలు కాపాడటమే ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఈ అంశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఆర్‌టీఏ కమిటీ సభ్యులు జయ్‌పాల్ రెడ్డి మాట్లాడుతూ, రోడ్డు భద్రత మాసోత్సవాల ద్వారా ప్రజలకు అవగాహన పెంచాలని, ప్రమాదాల నివారణకు సమిష్టిగా చర్యలు తీసుకోవాలని అన్నారు. హకీంపేట, తూంకుంట ప్రాంతాల్లో బ్లాక్ స్పాట్లను గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఈఈ శ్రీనివాసమూర్తి, పోలీస్, టీజీఎస్‌ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

# జనవరి 3,4 తేదీల్లో హైదరాబాద్‌లో ఎస్‌ఎఫ్‌ఐ జాతీయస్థాయి సెమినార్

- విద్యారంగంలో మతోన్మాద ప్రమాదంపైనే ప్రధానమైన చర్చలు
- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎస్.రజనీకాంత్ టి.నాగరాజు




**హైదరాబాద్ డిసెంబర్ 31 (జనంసాక్షి) :** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆల్ ఇండియా కన్వెన్షన్ జనవరి 3,4 తేదీలలో హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎ.రజనీకాంత్ టి.నాగరాజులు తెలిపారు. స్థానిక సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జనవరి 3, 4 తేదీలలో హైదరాబాదులో ఎస్ఎఫ్ఐ ఆల్ ఇండియా కన్వెన్షన్ లో జాతీయ విద్యా విధానం ఐదేళ్ల కాలంలో అమలు తీరు విద్యారంగంలో వచ్చిన మార్పుల గురించి చర్చించినునట్లు తెలిపారు. నేడు బిజెపి అధికారంలోకి వచ్చిన నుండి విద్యారంగంలో మతోన్మాద విధానాలు అమలు చేస్తూ విద్య కేంద్రీకరణ వ్యాపారీకరణం కార్పొరేటీకరణ చేస్తుందని, రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా వ్యవస్థలను కూలద్రోచి, ఫెడరల్ స్ఫూర్తికి భిన్నంగా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్య హక్కులపై దాడి చేస్తుందని అన్నారు. దీనిలో భాగంగానే జఉఆ రద్దు, ఎఆం బిల్లు అమలు, విదేశీ విశ్వవిద్యాలయాలకు ఆహ్వానం, విద్యలోకి ఈఆఎ ల ఆహ్వానించడం, విద్యా రంగంలో కార్పొరేటీకరణ విధానాలు అమలు చేస్తూ విద్యను సామాజికంగా వెనుకబడిన దళిత గిరిజన ఆదివాసి విద్యార్థులకు చదువును చేస్తున్నారు. ఈ అంశాలపై ఎస్ఎఫ్ఐ ఈ సెమినార్ లో చర్చించి పలు తీర్మానాలు చేస్తుందని అన్నారు. విద్యా రంగానికి ఫండ్స్ కట్ , హాస్టల్ సమస్యలు, నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాల కోసం ఈ ప్రభుత్వం నిధులు తగ్గించడం చేస్తుందని అన్నారు. ఈ సెమినార్ కు ప్రముఖ ఆర్థికవేత్త, ప్రొఫెసర్ ప్రభావత్ పట్నాయక్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి, న్యూస్ క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పురకాయస్థ, పద్మశ్రీ అవార్డు గ్రహీత బాలహక్కుల ఫోరం చైర్మన్ ప్రొ.శాంత సిన్హా, ఎస్ఎఫ్ఐ మాజీ ఆల్ ఇండియా అధ్యక్షులు ఆర్ అరుణ్ కుమార్, ఎస్ఎఫ్ఐ అఖిలభారత అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆదర్శ్ ఎం సాజీ, శ్రీజన్ భట్ట, అఖిల భారత ఉపాధ్యక్షులు శిల్ప, రోహిదాస్, అతిక్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. అనంతరం హైదరాబాద్ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి కే అశోక్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ మహానగరంలో ఈ జాతీయ కన్వెన్షన్ ను నిర్వహించడం ద్వారా దేశంలో జాతీయ విద్యా విధానంపై పోరాటానికి తెలంగాణ వేదిక కానుందని, ఈ కన్వెన్షన్ సందర్భంగా జనవరి 3న ర్యాలీ, బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు లేనిన్ గువేరా, నాయకులు శ్రీమన్, నాగేందర్ స్టాలిన్ రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# తార్నాక సర్కిల్ అభివృద్ధిపై సమన్వయానికి నాంది

### డిప్యూటీ మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన డిప్యూటీ కమిషనర్



**ఉప్పల్, డిసెంబర్ 31(జనంసాక్షి) :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) సికింద్రాబాద్ జోన్ పరిధిలోని తార్నాక సర్కిల్‌కు నూతన డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన జ్యోతి బుధవారం తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ.. తార్నాక సర్కిల్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. పారిశుధ్యం, డ్రైనేజీ, రహదారులు, తాగునీటి సరఫరా వంటి మౌలిక వసతుల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నూతన డిప్యూటీ కమిషనర్ జ్యోతి మాట్లాడుతూ, ప్రజల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకొని పారదర్శక పాలన అందించేందుకు కృషి చేస్తామని, క్షేత్రస్థాయిలో పర్యటనలు నిర్వహిస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశం ద్వారా తార్నాక సర్కిల్‌లో అభివృద్ధి కార్యక్రమాలకు ఊపునిచ్చే దిశగా ఇరువురి మధ్య సానుకూల చర్చ జరిగింది.

# తెలంగాణ వ్యాప్తంగా ఆర్టిఫిషియల్ కోర్సులకు ఆన్‌లైన్ శిక్షణ




**హైదరాబాద్ డిసెంబర్ 31:** కేంద్ర ప్రభుత్వ సంస్థ నేషనల్ స్కిల్ అకాడమి ఆధ్వర్యంలో ఆర్టిఫిషి యల్ ఇంటెలిజెన్స్, తదితర సాఫ్ట్‌వేర్ కోర్సులకు తెలంగాణ వ్యాప్తంగా ఆన్‌లైన్ శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నేషనల్ స్కిల్ అకాడమి డైరెక్టర్ వెంకటరెడ్డి తెలిపారు. బుధవారం కాచిగూడలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. డిప్లొమా ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, పీజీ డిప్లొమా ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మాస్టర్ ప్రోగ్రాం ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తదితర కోర్సుల్లో ఆన్‌లైన్‌లో 5-10 నెలల శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. రానున్న ఐదేండ్లల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా యువతకు 40 లక్షల కొత్త ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, డిప్లొమా, పీజీ, ఇంజినీరింగ్ చదివిన యువతి,యువకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9505800050, సంప్రదించవచ్చని సూచించారు.

# ఏఐసీసీ ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ నేషనల్ సెక్రెటరీగా అదిత



**న్యూఢిల్లీ డిసెంబర్ 31 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీలో కీలకమైన సంస్థాగత పరిణామంలో భాగంగా, తెలంగాణకు చెందిన అదిత గారిని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) – ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ నేషనల్ సెక్రెటరీగా నియమించారు. ఈ నియామకం ఏఐసీసీ నేషనల్ జనరల్ సెక్రెటరీ కె.సి. వేణుగోపాల్, ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆల్కా లాంబా ఆదేశాల మేరకు జరిగింది. ఇంతకు ముందు అదిత బీహార్, పాండిచ్చెరి, అండమాన్, నికోబార్ దీవులకు నేషనల్ అబ్జర్వర్‌గా సమర్థవంతంగా సేవలందించారు. ఆమె కట్టుబాటు, సంస్థాగత నైపుణ్యం, పాతాళస్థాయి అనుసంధానం దృష్ట్యా, పార్టీ నాయకత్వం ఆమెకు ఆంధ్రప్రదేశ్, పాండిచ్చెరి , అండమాన్, నికోబార్ దీవుల అదనపు బాధ్యతలను అప్పగించింది. "కాంగ్రెస్ పార్టీకి నాయకత్వం వహిస్తున్న మల్లికార్జున ఖర్గే జీ, రాహుల్ గాంధీ జీ మార్గదర్శకత్వంలో నాపై ఉంచిన నమ్మకానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, రాష్ట్రంలోని అన్ని మంత్రులు, తెలంగాణ రాష్ట్ర నాయకత్వానికి వారి నిరంతర ప్రోత్సాహం, మద్దతుకు హృదయపూర్వక ధన్యవాదాలు. తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావుకి ఆమె నిరంతర ప్రోత్సాహం, సహకారం, మార్గదర్శకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ప్రత్యేకంగా మీనాక్షి నటరాజన్ కి ఆమె మార్గదర్శకత్వం, ప్రేరణకు కృతజ్ఞతలు. జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో మహిళా కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేస్తూ, ప్రతి మండలం, ప్రతి బూత్ స్థాయికి మహిళా కాంగ్రెస్‌ను తీసుకెళ్లేందుకు పూర్తి అంకిత భావంతో పనిచేస్తాను. మహిళా కాంగ్రెస్ జాతీయ స్థాయిలో బలమైన కేడర్ నిర్మాణం, సమాన హక్కుల సాధన, మహిళా నాయకత్వ వికాసానికి నిరంతరం కృషి చేస్తోందని పార్టీ వర్గాలు తెలిపారు. అదిత నియామకం మహిళా నాయకత్వాన్ని మరింత బలపరిచే దిశగా మరో కీలక అడుగు అని వారు పేర్కొన్నారు.

# వెన్నుపోటు పొడిచే వారితో తస్మాత్ జాగ్రత్త

### మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్



**శామీర్ పేట్, డిసెంబర్ 31(జనంసాక్షి):** అలియాబాద్ మున్సి పల్ కార్య వర్గం, నాయకుల సమావేశంలో మేడ్చల్ నియోజక వర్గ ఇంచార్జి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, జిల్లా అధక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ల మధ్య మాటల యుద్ధం ఎవరికి వాళ్లే తోపు ఏవరు ఎవరిని నమ్ముకుని మోసపోవద్దని ఎన్నికల్లో గెలుపే లక్షంగా ప్రతి కార్యకర్త కృషి చేయ్యాలని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ అన్నారు. రాబోయె మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థులు ఎవరిని నమ్ముకొని మోస పోవద్దని, వెన్ను పోటు పొడిచేవారితో తస్మత్ జాగ్రత్తగా ఉండాలని గెలుపే లక్ష్యంగా ప్రతి నాయకుడు,కార్తకర్తలతో కలిసి ముందుకెళ్ళాలని మేడ్చల్ నియోజక వర్గ ఇన్చార్జ్, జిల్లా అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ హితవు పలికారు. బుదవారం అలియబాద్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సమవేశాన్ని మున్సిపల్ అధ్యక్షలు తుంకి రమేష్ అధ్యాక్ష్యతన సంగీత్ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ఈ సమావేశంలో నాయకులు మహిపాల్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, జైపాల్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, పాల్గొన్నారు.

# బార్బర్ హత్య కేసులో నిందితుడు అరెస్ట్




**రాజేంద్రనగర్,డిసెంబర్ 31 (జనంసాక్షి):** ఏకపక్ష ప్రేమతో బార్బర్ ను హత్య చేసిన ఘటన లో శంషాబాద్ పోలీసులు కేసును శంషాబాద్ పోలీసులు ఆరు రోజుల్లోనే కేసును చేధించారు. బుధవారం శంషాబాద్ డిసిపి ఆదేశాలతో శంషాబాద్ ఏసిపి వి.శ్రీకాంత్ గౌడ్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కవెలిగూడ గ్రామం విన్ సిటీ వెంచర్‌లో డిసెంబర్ 24న రాత్రి జరిగిన జంపుల మహేష్ (24) బార్బర్ గా పనిచేస్తున్న మహేష్‌ను గొంతు, తలపై గాయాలతో హత్య చేసినట్లు దర్యాప్తులో తేలింది.కేసు దర్యాప్తులో కాల్ డేటా, సాంకేతిక ఆధారాలు, సాక్ష్యాలను పరిశీలించిన పోలీసులు, ఏకపక్ష ప్రేమతో ప్రణాళికాబద్ధంగా హత్య చేసిన క్యాబ్ డ్రైవర్ బాపురం రత్నం (27)ని బుధవారం బోరబండలో అరెస్టు చేశారు. నిందితుడు కారం పొడి ఉపయోగించి, గొడ్డలితో హత్య చేసినట్లు అంగీకరించాడు. నిందితుడిని అరెస్టు చేసి, జ్యుడీషియల్ కస్టడీకి తరలించి, ఫోరెన్సిక్ ఆధారాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మీడియా సమావేశంలో ఇన్స్పెక్టర్ నరేందర్ రెడ్డి, ఎస్సైలు పాల్గొన్నారు.కేసును త్వరగా ఛేదించిన డిటెక్టివ్,పోలీసు దర్యాప్తు బృందాన్నిశంషాబాద్ పోలీసులు అభినందించారు.

# గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు



**ఉప్పల్ డిసెంబర్ 31 (జనంసాక్షి):** ఉప్పల్ పరిసర ప్రాంతాలలో తక్కువ ధరకు బీహార్ నుంచి గంజాయి కొని అధిక ధరలకు విక్రయిస్తున్న సుధాన్ష కుమార్ అనే యువకుడిని ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 5 కిలోల 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బీహార్లోని వైశాలి జిల్లాకు చెందిన సుధాన్ష కుమార్, ఉప్పల్లో నివాసం ఉంటూ, కిలో రూ.5,000 చొప్పున గంజా యిని కొనుగోలు చేసి, చిన్న ప్యాకె ట్లలో అధికధరలకు విక్రయిస్తున్నట్లు ఉప్పల్‌ఎక్సైజ్ సీఐ ఓంకార్ తెలిపారు.

# పరిశుభ్రనగరంగా గ్రేటర్ హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలి




- పారిశుద్ధ్య కార్యక్రమాలు పక్కాగా చేపట్టాలి
- జోనల్, డిప్యూటీ కమిషనర్లకు కమిషనర్ ఆదేశం

**హైదరాబాద్, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** పారిశుద్ధ్య కార్యక్రమాలు పకడ్బందీగా చేపడుతూ గ్రేటర్ హైదరాబాద్ ను పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దాలని కమిషనర్ ఆర్ వి కర్ణన్ జోనల్, డిప్యూటీ కమిషనర్లు, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ విభాగం ఇంజనీర్లకు కమిషనర్ ఆర్ వి కర్ణన్ సూచించారు. బుధవారం గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా చేపట్టిన జీహెచ్ఎంసీ ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా మూడోరోజు రోడ్లకు ఇరువైపుల క్లీనింగ్, డివైడర్లు, సెంట్రల్ మీడియం, కెర్బ్ ల క్లీనింగ్ నిర్వహించారు. శంషాబాద్ జోనల్ పరిధిలో ఆదిభట్ల, కొంగర కలాన్, బోంగుళూరులలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం అమలును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మొదటి రోజు ఫుట్ ఓవర్ బ్రిడ్జి క్లీనింగ్ చేపట్టగా.. రెండో రోజు ఫ్లై ఓవర్ల క్లీనింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ మాట్లాడుతూ... గ్రేటర్ హైదరాబాద్ నగరంలో పారిశుద్ధ్యం మరింతగా మెరుగుపరచడానికి జోనల్, డిప్యూటీ కమిషనర్లు, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ విభాగం ఇంజనీర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఆదేశించారు. రానున్న రోజుల్లో చెరువులు, నాలాలు,ఫుట్‌పాత్‌లు, పార్కులు , నిర్మాణ కూల్చివేత (సీ అండ్ డీ) వ్యర్థాల తొలగింపు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల వద్ద పేరుకుపోయిన చెత్త తొలగింపు వంటి కార్యక్రమాలు షెడ్యూల్ ప్రకారం పారిశుద్ధ్య కార్యక్రమాలు ప్రభావంతంగా చేపట్టాలన్నారు.

క్షేత్ర తనిఖీలో కమిషనర్ వెంట జోనల్ కమిషనర్ చంద్రకళ తదితరులు ఉన్నారు.

# శేరిలింగంపల్లిను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

### పిఏసి చైర్మన్ అరికెపూడి





**శేరిలింగంపల్లి, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ప్రత్యేక నిధులు వెచ్చించడం ద్వారా అన్ని రంగాలలో తీర్చిదిద్ది గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే ఒక ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ధీమాను వ్యక్తం చేశారు. ఈ మేరకు మాదాపూర్ డివిజన్ పరిధి ఆయా కాలనీలలో 14.35 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు మాదాపూర్ డివిజన్ కార్పొరేటర్ వాలిదాసు జగదీశ్వర్ గౌడ్ తో కలిసి బుధవారం పిఏసి చైర్మన్ శంకుస్థాపన గావించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శేరిలింగంపల్లి ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా తాను ముందుకు సాగుతున్నానన్నారు. మాదాపూర్ డివిజన్ పరిధి ఆదిత్య నగర్, సుభాష్ చంద్రబోస్ నగర్, బిక్షపతి నగర్, కృష్ణానగర్, శిల్పా హిల్స్, ఇజ్జత్ నగర్, అయ్యప్ప సొసైటీ, మాతృశ్రీ నగర్, సైబర్ హిల్స్, హనుమాన్ నగర్, జూబ్లీ గార్డెన్, దీప్తి హిల్స్, నవభారత్ నగర్, సిద్ధి వినాయక నగర్ తదితర కాలనీలలో 14.35 కోట్ల రూపాయల ప్రభుత్వ నిధులతో నూతనంగా చేపట్టబోయే సిసి రోడ్లు, బిటి రోడ్లు, స్మశాన వాటికలు, వరద నీటి కాలువ నిర్మాణపు పనులకు శంకుస్థాపన చేసుకోవడం హర్షణీయమన్నారు. వందల కోట్ల రూపాయల భారీ నిధులతో శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని ఆయా డివిజన్లు, కాలనీలలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడంద్వారా కాలనీ ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి కాలనీలో ప్రాధాన్యత క్రమంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి శాశ్వత పరిష్కార దిశగా పక్కా ప్రణాళికతో కార్యాచరణలను రూపొందించి అమలు చేయడం జరుగుతుందన్నారు. హైదరాబాద్ ను విశ్వనగరంగా తీర్చిదిద్దే క్రమంలో భాగంగా ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు పెంపొందించుటకు మౌలిక వసతుల కల్పనకై కోట్ల రూపాయల నిధులు వెచ్చించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంసంసిద్ధంగా ఉందని, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

**హఫీజ్ పేట్ డివిజన్ పరిధిలో....**

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో హఫీజ్పేట్ డివిజన్ పరిధిలో 4.34 కోట్ల 50వేల రూపాయల ప్రభుత్వ నిధుల అంచనాతో పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ వాలీదాసు జగదీశ్వర్ గౌడ్, రాగం నాగేందర్ యాదవ్ తో కలిసి బుధవారం రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ శంకుస్థాపన గావించారు. ఈ సందర్భంగా హఫీజ్ పేట్ డివిజన్ పరిధిలో సిసి రోడ్లు, బిటి రోడ్లు, ఓపెన్ జిమ్, థీమ్ పార్క్, చైన్ లింక్ మెష్ నిర్మాణం తదితర కార్యక్రమాలను 4 కోట్ల 34 లక్షల 50 వేల రూపాయల అంచనా వేయంతో పనులను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హఫీజ్ పేట్ డివిజన్ పరిధి నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

**రోలింగ్ మెడోస్ కాలనీ పరిధిలో యుజిడి పనులకు శంకుస్థాపన...**

శేరిలింగంపల్లి డివిజన్ పరిధి రోలింగ్ మెడోస్ కాలనీలో 55 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించ తలపెట్టిన భూగర్భ డ్రైనేజీ పనులకు డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, జలమండలి అధికారులతో కలిసి బుధవారం పిఏసి చైర్మన్ అరికెపూడి శంకుస్థాపన గావించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూగర్భ డ్రైనేజి సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని, పలు కాలనీలలో ప్రజలనుండి వచ్చిన వినతి మేరకు తమ కార్పొరేటర్ల చొరవతో రోలింగ్ మెడోస్ కాలనీలో 55 లక్షల రూపాయల ప్రభుత్వ నిధులతో యుజిడి పనులను పూర్తిచేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రాజు యాదవ్, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, రోలింగ్ మెడోస్ కాలనీ అసోసియేషన్ ప్రెసిడెంట్ రవి కుమార్, జనరల్ సెక్రటరీ కేశవ రావు, వెంకటేశ్వర్లు, సుధాకర్ రెడ్డి, వెంకట్, వెంకట్ రెడ్డి, సెంట్రల్ పార్క్ ఫేస్ 2 జనరల్ సెక్రటరీ వేణు, అరుణ, మాధవ హిల్స్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, శిల్ప వ్యాలీ జనరల్ సెక్రటరీ భవాని, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ శ్రీకర్, విష్ణు, గోపికాంత్, శ్రీ వెంకటేశ్వరా కాలనీ ప్రెసిడెంట్ ఫణిందర్, మల్లేష్, పవన్ స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన విద్యా విధానంలో టీ-సాట్ భాగస్వామ్యం




- మంత్రి శ్రీధర్ బాబును కోరిన సీఈవో వేణుగోపాల్ రెడ్డి

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం చేపట్టబోయే 'నూతన విద్యా విధానం' లో టి-సాట్ నెట్వర్క్ ను భాగస్వామిని చేసే విధంగా చూడాలని ఐటి, పరిశ్రమలు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి కోరారు. మంత్రి శ్రీధర్ బాబును బుధవారం కలిసి 'నూతన విద్యావిధానంలో టి-సాట్ భాగస్వామ్యం' పేరుతో టి-సాట్ రూపొందించిన విధి విధానాల ప్రణాళిక డాక్యుమెంట్ ను సీఈవో అందచేశారు. విద్యా శాఖకు సంబంధించి ప్రాథమిక, ఉన్నత, సాంకేతిక విద్యతో పాటు యూనివర్సిటీ స్థాయిలోనూ టి-సాట్ డిజిటల్ కంటెంట్ అందిస్తోందని సీఈవో వేణుగోపాల్ రెడ్డి మంత్రికి తెలిపారు. విద్యా ఛానళ్ల ప్రసారాల్లో 39 వేల వీడియోలు కలిగి 140 మిలియన్ వ్యూస్ తో దేశంలోనే టి-సాట్ మొదటి స్థానంలో నిలిచి, తెలంగాణలోని సుమారు 80 శాతం చదువరులకు వివిధ రకాల కార్యక్రమాలతో చేరువైందని వివరించారు. ఆధునిక సమాజంలో పూర్తిగా డిజిటల్ మీదే విద్యా వ్యవస్థ ఆదారపడే అవకాశాలున్నందున భవిష్యత్ ను ఆలోచించి టి-సాట్ ప్రత్యేక ప్రణాళికను రూపొందించిందని వేణుగోపాల్ రెడ్డి మంత్రికి వివరించారు. ఇటీవలి కాలంలో 'ఆన్వల్ స్టూడెంట్ కాంపిటషన్స్-2025' పేరుతో టి-సాట్ నిర్వహించిన పోటీలు గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, అధికార యంత్రాంగాన్ని భాగస్వాములను చేయడమే అందుకు ఉదాహరణ అని గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించబోయే నూతన విద్యా విధానంలో టి-సాట్ ను సైతం భాగస్వామిని చేస్తే డిజిటల్ కంటెంట్ అందించడంలో రాష్ట్ర ప్రభుత్వానికి టి-సాట్ డిజిటల్ సహకారాన్ని అందించడానికి సిద్దంగా ఉందన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఐటి శాఖ పరిధిలో ఉన్న టి-సాట్ నూతన విద్యావిధాన రూపకల్పనంలో భాగస్వామిని చేసేలా చూడాలని కోరారు. మంత్రిని కలిసిన సందర్భంగా సీఈవో వేణుగోపాల్ రెడ్డి వెంట టి-సాట్ ఎగ్జుక్యూటీవ్ డైరెక్టర్ ఎండీ సాదిక్ ఉన్నారు.

# ఆస్తుల కోసమే కెసిఆర్ కుటుంబంలో పంచాయితీ

- పదేండ్ల కాలంలో పనిచేయకుండా అప్పులు చేశారు
- ఏటీసీ సెంటర్లకు మంత్రి వివేక్ శంకుస్థాపన



**యాదాద్రి, డిసెంబర్31 (జనంసాక్షి) :** ఆస్తుల కోసమే బిఆర్ఎస్ అధినేత,మాజీ సీఎం కేసీఆర్ కుటుంబంలో కొట్లాట జరుగుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆరోపించారు. అధికారంలో ఉన్న పదేండ్ల కాలంలో ఒక్క పైసా పని చేయకుండా రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరులో నిర్మించతలపెట్టిన నూతన ఏటీసీకి ఆయన ఇవాళ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పాటైన తర్వాత బీఆర్ఎస్ సర్కార వ్యవస్థను నాశనం చేసిందని, ఇచ్చిన హామీలను కేసీఆర్ మర్చి పోయారని విమర్శించారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందన్న మంత్రి యువతకు నాణ్యమైన విద్యతోపాటు ఆధునిక నైపుణ్యం, శిక్షణ అందించాలనే లక్ష్యంతో ఐటీఐలను ఏటీసీలుగా అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ రూ.3,622 కోట్ల నిధులు తెచ్చి నియోజక వర్గాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నారని ప్రశంసించారు. ఇందిరమ్మ హయాంలో అమలైన సంక్షేమ పథకాలను ఇప్పుడు మళ్లీ కొనసాగిస్తున్నామని అర్హులైన ప్రతి ఒక్కరి కీ ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు.యంగ్ ఇండియా స్కూల్స్ పేదలకు వరంగా మారాయని, ఉద్యోగాలు ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మంత్రి గుర్తు చేశారు. రాసున్న రోజుల్లో కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల అవుతాయని యువతకు భరోసా ఇచ్చారు. ఇకపోతే త్వరలో మరిన్నీ అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)లు ఏర్పాటు చేస్తామని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. తద్వారా గ్రామీణ ప్రాంత యువతకు ప్రోత్సాహకం అందిస్తామని చెప్పారు. తుంగతుర్తి నియోజకవర్గంలోని అడ్డగూడూరులో ఐటీఐకు మంత్రి వివేక్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెనుకబడిన ప్రాంతంలో ఐటీఐ ఏర్పాటు కోసం భూమి పూజ చేయడం సంతోషంగా ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభు త్వం ఐటీఐలను పట్టించుకోలేదని విమర్శిం చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గ్రామీణ ప్రాంత యువతకు ఉపాధి కల్పిం చడం కోసం ఏటీసీలు ఏర్పాటు చేస్తున్నా మని తెలిపారు. రేషన్ ద్వారా పేదలకు సన్న బి య్యం ఇస్తున్నామన్నారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇళ్లు కట్టిస్తోందని.. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామని చెప్పారు. తుంగతుర్తి నియోజక వర్గంలో ఇంది రమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే మందుల సామెల్ రూ.3622 కోట్ల నిధులు తెచ్చి తుంగతుర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నాడని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో గ్రామాల కోసం ఒక్క పైసా కూడా ఖర్చుచేయకుండా వ్యవస్థని నాశనం చేశారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ పదేళ్లు రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని విమర్శించారు. అక్రమ ఆస్తుల కోసమే కేసీఆర్ కుటుంబ సభ్యులు కొట్లాడుకుంటున్నారని అన్నారు.

# ప్రభుత్వ వైద్య వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాం

- రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు
- మంత్రి దామోదర్ రాజనర్సింహ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రభుత్వ వైద్య వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని, ప్రతి ఇంటా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ వైద్య వ్యవస్థను బలోపేతం చేసి, కొత్త సంవత్సరంలో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందిస్తామని మంత్రి పేర్కొన్నారు. ఎన్సీడీలపై ఫోకస్2026లో నాన్ కమ్యునికెబుల్ డిసీజెస్ నివారణ, నియంత్రణ, చికిత్స, పాలియేటివ్ కేర్‌పై మరింత ఫోకస్ చేస్తామని మంత్రి వెల్లడించారు. ఇప్పటికే ఎన్సీడీసీ క్లినిక్స్, డే కేర్ కేన్సర్ క్లినిక్స్ ద్వారా గ్రామాల సమీపంలోకి వైద్య సేవలను తీసుకెళ్లామని మంత్రి గుర్తు చేశారు. ఎమర్జన్సీ కేర్‌రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలు కాపాడేందుకు ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్‌ను విస్తృతం చేస్తున్నామని, 2026లో రాష్ట్రవ్యాప్తంగా వందకుపైగా క్రిటికల్ కేర్ బ్లాక్స్, ట్రామా కేర్ సెంటర్లు అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి తెలిపారు. పది నిమిషాల్లోనే ఘటన స్థలానికి చేరుకుని వైద్య సేవలు ప్రారంభించేలా "108 అంబులెన్స్" సర్వీసెస్‌ను ఎక్స్‌పాండ్ చేస్తున్నామని మంత్రి వెల్లడించారు.కొత్త ఏడాదిలో 4 కొత్త హాస్పిటల్స్‌దశాబ్దాల ఉస్మానియా నూతన హాస్పిటల్ ఆకాంక్షను 2025లో నెరవేర్చుకున్నామని మంత్రి గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పలు మెడికల్ కాలేజీలు, టీచింగ్ హాస్పిటళ్లకు కొత్త భవనాలను నిర్మించుకున్నామన్నారు. 2026లో 4 కొత్త మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన వెల్లడించారు. గుండె, కిడ్నీ జబ్బులు, కేన్సర్ వంటి మొండి వ్యాధులకు సైతం పేదలు పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ స్థాయి వైద్యం పొందేలా ఈ హాస్పిటళ్లను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. మెడికల్ కాలేజీలు, టీచింగ్ హాస్పిటళ్లలో అన్ని సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొచ్చి వైద్య విద్య వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని మంత్రి పేర్కొన్నారు.మన హాస్పిటళ్లను మనమే కాపాడుకుందాంప్రభుత్వ హాస్పిటళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిది అని మంత్రి పేర్కొన్నారు. దేవాలయాలకు వెళ్లినప్పుడు ఎంత శుభ్రతను పాటిస్తామో, అదే విధంగా ప్రభుత్వ దవాఖానలకు కాపాడుకుందామని మంత్రి పిలుపునిచ్చారు. బీపీ, షుగర్, ఒబెసిటీ, కిడ్నీ, గుండె జబ్బులు, కేన్సర్లకు కారణమైతున్న అనారోగ్యకర అలవాట్లను మానుకోవాలని, కొత్త సంవత్సరంలో ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవాలని మంత్రి సూచించారు. జాగ్రత్త..నూతన సంవత్సర వేడుకలు ఆహ్లాదకర వాతావరణంలో జరుపుకోవాలని, అనవసరమైన తగాదాలకు తావు ఇవ్వకూడదని మంత్రి సూచించారు.

## కాశ్మీర్‌లో మంచుదుప్పటి

**శ్రీనగర్, డిసెంబర్31 (జనంసాక్షి) :** జమ్ముకశ్మీర్ లోని కశ్మీర్ లోయ లో మంచు దుప్పటి పరుచుకుంది. కశ్మీర్ వ్యాలీలోని ప్రసిద్ధ టూరిస్ట్ స్పాట్ అయిన సోనామార్గ్‌లో తెల్లటి దూది వెదజల్లినట్టుగా మంచు పరుచుకున్నది. దాంతో కశ్మీర్ వ్యాలీ పరిసరాలన్నీ అందంగా, ఆహ్లాదకరంగా, అద్భుతంగా కనిపిస్తున్నాయి. ఆ సుందర దృశ్యాలను టూరిస్టులకు కనువిందు చేస్తున్నాయి. కశ్మీర్ వ్యాలీలో పగటి ఉష్ణోగ్రతలు పడిపోవడంతో గత కొన్ని రోజుల నుంచి మంచు విపరీతంగా కురుస్తున్నది. సన్నని దూది పింజాల్లా రాలుతున్న మంచును యాత్రికులు తెగ ఎంజాయ్ చేస్తున్నారు. కశ్మీర్ వ్యాలీ పరిసరాలన్నీ తెల్లని మంచు పరుచుకోవడంతో అక్కడి వాతావరణం ఆహ్లాదకరంగా మారింది.

## గణతంత్రంలో యానిమల్ కంటింజెంట్

**న్యూఢిల్లీ, డిసెంబర్31 (జనంసాక్షి) :** గణతంత్ర దినోత్సవంలో ఈయేడు జంతువుల పరేడ్ ప్రత్యేక ఆకర్షణ కానుంది. ఈ మేరకు కొత్తంగా ప్రయోగం చేయబోతున్నారు. దిల్లీలోని కర్తవ్యపథ్‌లో వచ్చే ఏడాది జనవరి 26న నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల కవాతులో ఈసారి ఓ అరుదైన కంటింజెంట్ చేరనుంది. గణతంత్ర దినోత్సవ పరేడ్ లో తొలిసారిగా యానిమల్ కంటింజెంట్ ను తీసుకురావడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. రీమౌంట్ అండ్ వెటర్నరీ కార్ప్స్ విభాగానికి చెందిన శిక్షణ పొందిన జంతువులను ఈ కవాతులో ప్రదర్శించనున్నామని అధికారులు తెలిపారు. దేశంలోనే అత్యంత సవాళ్లతో కూడిన సరిహద్దుల వద్ద భద్రత కోసం సైనికులు ఉపయోగించే బాక్ట్రియన్ జాతికి చెందిన రెండు ఒంటెలు, నాలుగు గుర్రాలు, నాలుగు డేగలు, పది స్వదేశీ జాతి ఆర్మీకి చెందిన జాగిలాలు, ఇప్పటికే సేవల్లో ఉన్న మరో ఆరు జాగిలాలు ఈ బృందంలో ఉన్నాయి.

# యూరియా కష్టాలపై పట్టింపులేని ప్రభుత్వం

- రైతులను ఆదుకోవడంలో సిఎం రేవంత్
- మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ విమర్శలు



**నల్లగొండ, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** రైతులకు ఎరువులు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ విమర్శలు గుప్పించారు. యూరియా కోసం రైతులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతమని అన్నారు. నాగార్జున సాగర్ నియోజకవర్గంలోని త్రిపురారం మండలంలో పార్టీ స్థానిక నేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. పొంకనాల రేవంత్‌రెడ్డి యాప్ పేరుతో రైతులను ఇబ్బందులు పెడుతున్నడని ఆవేదన వ్యక్తంచేశారు. ఆ యాప్ వాడటం తెల్వక రైతులు ఇబ్బందులు పడుతున్నరని చెప్పారు. యాప్‌లో ఎకరాకు మూడు బస్తాల యూరియాకు బదులు ఒక బస్తా మాత్రమే ఫీడ్ చేసుకునేలా సెట్ చేశారని ఆరోపించారు. పోనీ ఒక బస్తా అయినా తీసుకుందామని, యాప్‌లో ఫీడ్ చేయించుకుని ఎరువుల దుకాణానికి వెళ్తే.. అక్కడ స్టాక్ లేదని చెబుతున్నారని విమర్శించారు. యాప్‌లో స్టాక్ చూపిస్తున్నదని, స్టోర్‌కు మాత్రం యూరియా రాలేదని ఎరువుల దుకాణదార్లు జవాబిస్తున్నారని భగత్ చెప్పారు. ఈ చేతగాని రేవంత్‌రెడ్డి ప్రభుత్వంవల్లే రైతులకు ఈ ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. ఇప్పటికైనా రేవంత్ సర్కారు యాప్‌లను తీసేసి రైతులకు మునుపటిలాగే నేరుగా యూరియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# యూట్యూబర్ అన్వేష్‌పై పోలీస్ కేసులు



**హైదరాబాద్, డిసెంబర్31 (జనంసాక్షి) :** యూట్యూబర్ అన్వేష్‌పై కేసు నమోదైంది. ఇటీవల సోషల్ మీడియాలో ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ సినీనటి కరాటే కల్యాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అభ్యంతర కంటెంట్ ప్రచారం చేశారని అందులో పేర్కొన్నారు. దీంతో అన్వేష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అన్వేష్‌పై ఖమ్మంలోని ఖానాపురంహవేలి ఠాణాలోనూ ఇప్పటికే కేసు నమోదైంది. విశాఖపట్టణానికి చెందిన అన్వేష్ విదేశాల్లో ఉంటూ యూట్యూబ్ ఛానల్ నిర్వహి స్తున్నాడు. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా హిందువులు పూజించే సీతాదేవి, ద్రౌపదీదేవిలపట్ల అసభ్యంగా ఇటీవల అతడు వీడియో విడుదల చేశాడు. దానవాయిగూడేనికి చెందిన జి.సత్యనారాయణరావు అనే వ్యక్తి ఆదివారం రాత్రి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు. యూట్యూబర్ అన్వేష్‌పై హైదరాబాద్‌లోని పంజాగుట్ట, ఖమ్మం అర్బన్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ దేవతలు, మహిళలను కించపరిచేలా మాట్లాడాడని అన్వేష్‌పై ఫిర్యాదులు అందడంతో రెండు కేసులు నమోదు చేశారు. దేవీ దేవతలను యూట్యూబర్ అన్వేష్ దూషించాడని సినీ నటి, బీజేపీ నాయకురాలు కరాటే కళ్యాణి పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# హిందూ జంటలు కనీసం ఇద్దరిని కనాలి

- అసోం సిఎం హిమంత్ బిశ్వ శర్మ

**గౌహతి, డిసెంబర్31 (జనంసాక్షి) :** జనాభా పెరుగుదలకు యువత ఆలోచన చేయాలని అస్సాం ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత హిమాంత బిశ్వశర్మ సంతానం మరోసారి కామెంట్స్ చేశారు. అస్సాంలోని హిందూ జంటలు ఒక్క సంతానంతో ఆపవద్దని, కనీసం ఇద్దరినైనా కనాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో హిందువుల జననాల రేటు ఆందోళనకర రీతిలో తగ్గిపోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మైనారిటీ డామినేట్ ఏరియాలతో పోల్చి చూస్తే ఇతర ప్రాంతాల్లో జననాల రేటు తక్కువగా ఉన్నదని అన్నారు. తాజాగా మీడియాతో మాట్లాడిన ఆయన.. మైనారిటీ డామినేటెడ్ ఏరియాల్లో జననాల నిష్పత్తి ఎక్కువగా ఉన్నదని అస్సాం సీఎం చెప్పారు. అదే సమయంలో హిందువుల్లో జననాల రేటు వేగంగా తగ్గిపోతోందని అన్నారు. అందుకే పిల్లలను కనడం ఒక్కరితో ఆపవద్దని హిందూ జంటలను కోరారు. కనీసం ఇద్దరినీ కనాలని, వీలైతే ముగ్గురిని కన్నా మంచిదేనని ఆయన వ్యాఖ్యానించారు. అదే సమయంలో మైనారిటీలు ఏడు, ఎనిమిది మంది పిల్లలను కనడం ఆపేయాలని సూచించారు.

## సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సజీవదహనం కేసులో

# ఆరుగురు మహిళలకు జీవితఖైదు

**జగిత్యాల, డిసెంబర్31 (జనంసాక్షి) :** ఓ సాఫ్ట్‌వేర్ సజీవదహనం కేసులో కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఆరుగురు మహిళలకు జీవిత ఖైదుతో పాటు పదివేల చొప్పున జరిమానా విధించింది. వివరాల్లోకి వెళితే...హైదరాబాద్‌లోని అల్వాల్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీరు రాచర్ల పవన్‌కుమార్(38) సజీవదహనం కేసులో జగిత్యాల జిల్లా న్యాయస్థానం సంచలన తీర్పు ఇచ్చింది. మృతుడి భార్యతో పాటు మరో ఐదుగురు మహిళలకు జీవితఖైదు విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. జగిత్యాలకు చెందిన విజయ్.. కొండగట్టుకు దాదాపు 1.5 కిలోమీటర్ల దూరంలో మంజునాథ ఆలయాన్ని, దాని పక్కనే కుటీరాన్ని నిర్మించుకున్నారు. విజయ్ తమ్ముడు జగన్ అనారోగ్యంతో మృతి చెందారు. విజయ్ కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు బావ పవన్‌కుమార్, భార్య కృష్ణవేణితో కలిసి 2020 అక్టోబరు 28న రాత్రి మంజునాథ ఆలయానికి చేరుకున్నారు. పవన్‌కుమార్ చేతబడి చేయించి తన భర్తను చంపించాడనే అనుమానంతో అక్కడే ఉన్న జగన్ భార్య సుమలత బంధువులతో కలిసి అతన్ని కుటీరం లోని ఓ గదిలో బంధించింది. అందరూ కలిసి.. పవన్ ఒంటిపై పెట్రోలు పోసి నిప్పం టించారు. పోలీసులు వచ్చి గది తాళం తీసే సరికే పవన్‌కుమార్ పూర్తిగా దహనమ య్యారు. కేసు దర్యాప్తులో పవన్ కుమార్ భార్య కృష్ణవేణితో పాటు మరో ఐదుగురి మహిళలను నిందితులుగా చేరుస్తూ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన జగిత్యాల మొదటి అదనపు న్యాయమూర్తి ఎస్.నారాయణ ఆరుగురు మహిళలకు జీవిత ఖైదు, రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించారు.

# నగరంలో మొదలైన తనిఖీలు

- డ్రంకెన్ డ్రైవ్‌పై కఠిన చర్యలు : సిపి



**హైదరాబాద్, డిసెంబర్31 (జనంసాక్షి) :** నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో నగరంలో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఫ్లై ఓవర్లు మూసేసారు. ఎక్కడిక్కడ తనిఖీలు మొదలు పెట్టారు. సాయంత్రం నుంచే పోలీసులు వాహనాలను చెక్ చేయడం ప్రారంభించారు. ఈ క్రమంలో నగర వాసులకు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ కఠిన హెచ్చరికలు జారీ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారి పట్ల ఏమాత్రం ఉపేక్షించే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ మరియు రోడ్డు ప్రమాదాల నివారణెళి ధ్యేయంగా పోలీసులు ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేశారు.ఈ సందర్భంగా పలు కీలక ప్రకటనలు చేశాడు. రాత్రి నగరం అంతటా 120కి పైగా కీలక పాయింట్లలో ప్రత్యేక డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించబోతున్నట్లు తెలిపాడు. ఈ తనిఖీలు కేవలం ఈ రోజుకే పరిమితం కాకుండా జనవరి మొదటి వారం అంతా కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. తనిఖీల్లో మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడితే భారీ జరిమానా విధించడంతో పాటు, వాహనాన్ని సీజ్ చేస్తామని, అలాగే కోర్టు ద్వారా జైలు శిక్ష, డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసే ప్రక్రియను చేపడతామని హెచ్చరించారు. కేవలం డ్రంక్ అండ్ డ్రైవ్ మాత్రమే కాకుండా అతివేగంగా వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్ చేయడం, బహిరంగ ప్రదేశాల్లో నలుగురికి ఇబ్బంది కలిగించేలా న్యూసెన్స్ చేయడం వంటి పనులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు తెలిపారు. మద్యం సేవించిన వారు బాధ్యతాయుతంగా వ్యవహరించి, స్వయంగా డ్రైవింగ్ చేయకుండా క్యాబ్ సేవలను లేదా డ్రైవర్లను ఆశ్రయించాలని సూచించారు. కొత్త సంవత్సర వేడుకలను ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో కలిసి క్షేమంగా, సంతోషంగా జరుపుకోవాలని పోలీస్ యంత్రాంగం కోరింది.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370